# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

ఫిబ్రవరి 2025

వెల: రూ. 25/-





# శ్రీవేంకటేశం

**ఆధ్యాత్మిక మాసపత్రిక**

**సంపుటి:** 18 **సంచిక:** 2

**సలహాదారులు, స్ఫూర్తిదాత, కర్త, కర్మ, క్రియ మా ప్రభు తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు**

ప్రధాన సంపాదకులు:

**పుల్లగూర్ల సాయిరెడ్డి**

(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:

**డా॥ టి. గౌరీశంకర్**

ఫొటోగ్రాఫర్: **పత్తి సుబ్రమణ్యం,** శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్:

సాయినాథ్, రమేష్



**Email:**
srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.readwhere.com
Phone: **040–27175050**
Cell: **9348212354**


**లోపలి పేజీల్లో**


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| ప్రత్యక్ష భగవానుని పండుగ రథసప్తమి | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం | 10 |
| భక్తప్రియత్వమే శ్రీ వేంకటేశ్వర తత్వం | 20 |
| కులశేఖరాళ్వార్లు | 23 |
| ఆదర్శప్రాయుడు – భీష్మాచార్యుడు | 26 |
| రామాయణ రత్నాకరం | 29 |
| పాపం – పుణ్యం | 33 |
| తిరుప్పావై | 36 |
| ముకుందమాల | 42 |
| మీ ప్రశ్న మా సమాధానం | 47 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 48 |
| శ్రీకృష్ణ తత్వం | 54 |
| సరస్వతీ నమస్తుభ్యం | 56 |
| తిరుమల సర్వస్వం | 58 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |


## సాధన ముఖ్యం

భగవంతుణ్ణి సంతృప్తి పరిచే విధంగా సర్వదా భక్తుని ప్రవర్తన ఉండాలి. భక్తుని వలన ఇతరులు నొచ్చుకునే పరిస్థితి కలగకూడదు. ఇలాంటి భక్తుణ్ణి భగవంతుడు ఇష్టపడతాడు. అందుకని భక్తుడు సర్వదా సత్వగుణ ప్రధానంగా జీవించాలి. అప్పుడే కామ క్రోధాలను అదుపు చేసుకొని మనీషిగా జీవించగలడు. సత్త్వగుణముతో జీవించాలంటే మన ఆహారపు అలవాట్లు ప్రధానపాత్ర పోషిస్తాయి. అందుకని భక్తులు మాంసాహారానికి దూరంగా ఉంటూ, సాధ్యమైనంతవరకు ఇంటి భోజనము చేయుట మంచిది. చాలామంది భక్తులకు అరిషడ్వర్గాలను వదిలించుకొనుట సాధ్యము కాదు. సాధన ద్వారా కొంత సాధించినా ఏ క్షణాన్నైనా అవి తిరిగి ఆక్రమించవచ్చును. కాబట్టి జీవుడు జీవించి ఉన్నంత కాలము వీటితో పోరాడుతూనే ఉండాల్సి ఉంటుంది. కాని ఏ భక్తుడైతే భగవంతుడికి శరణాగతుడై సర్వమూ భగవంతుడే, తాను ఆయన దాసుడనని, తన ప్రతి కర్మ భగవంతుని గురించి చేస్తున్నాననే భావము కలిగి జీవించిన వానికి ఈ అరిషడ్వర్గాల భయము నుండి ముక్తి లభిస్తుంది. భగవంతుని సన్నిధికి చేరే ప్రయత్నంలో అడ్డు వచ్చే అరిషడ్వర్గాల నుండి బయటపడుటకు భగవంతుణ్ణి ఆశ్రయించుట ఒక్కటే ఏకైక మార్గం తప్ప వేరు దిక్కు లేదు. భక్తుడు ఎప్పుడూ దంబాలకు దూరంగా ఉంటూ, అత్యంత అల్పునిగా జీవించుట మంచిది. ఇలా భగవంతుణ్ణి సంతృప్తి పరచుటకు ఆయనకు ఇష్టమైనట్లు జీవించుట అవసరము. ఈ జ్ఞానము గురువుల ద్వారా, సద్గ్రంథ పఠనము ద్వారా, పెద్దల ప్రవచనములు వినుట వలన కలుగును. కాని వీటిని ఆచరించినప్పుడే ఫలితము పొందగలము. స్వతహాగా అనుభవించిన జ్ఞానము అత్యంత గొప్పది. అందుకే గురువైన శంకరాచార్యులు భజగోవిందమును మనకు అందించారు. చదివిన దానికంటే ఆచరించిన వాడు ధన్యుడు. ప్రకృతిలో జరిగే ప్రతి విషయాన్నీ క్షుణ్ణంగా పరిశీలిస్తూ వంట పట్టించుకుని ఆచరించాలి. పూర్వం భరద్వాజ ఋషి మూడు జన్మల వరకు జీవితాన్ని పొడిగించుకుని తపస్సు చేసినప్పటికీ ఇంకా చదవవలసింది పెద్ద మొత్తంలో ఉన్నదని బ్రహ్మ చెప్పాడు. దీనిద్వారా మనకు పుస్తక పఠనము కంటే సాధనము మంచిదనిపిస్తుంది. జీవితంలో ఎదురగు ప్రతి సమస్యను భగవంతుడికి సమర్పిస్తూ, ఆయన స్మరణలో కాలం గడుపుట మంచిది. దీనిని 'భజగోవిందం'లో శంకరాచార్యులవారు స్పష్టంగా చెప్పారు. 'ఓ జీవుడా! వయస్సు మీరుతోంది, ఎప్పడు ఈ భూమిని వదిలిపోతావో తెలియదు, అందుకని పుస్తక పఠనం కంటే సదా గోవిందుని స్మరిస్తూ జీవించుమన్నాడు. ఇదే మనకు మేలు చేస్తుందన్నారు". కాబట్టి ప్రతి జీవుడు భగవంతునికి శరణాగతుడై, ఆయనను ప్రతి కణములో వీక్షించుచు, ఆయనతో కలిసి జీవిస్తూ మన సంపూర్ణ సమస్యలను ఆయనకే వదిలి జీవించాలి. భారము ఆయనపై వేయాలి. నీటిలో ఉన్న తామరాకు మాదిరి జీవించాలి. ఈ సంసార సాగరము అంటీ అంటనట్లు జీవించాలి. ముఖ్యంగా మనం భగవంతుని వారిమై భగవంతుని కొరకు జీవించాలి. ప్రతి వ్యక్తి ఆత్మ భగవంతుడే కాబట్టి ఎదుటి వారితో పాటు సమస్త విశ్వమును భగవంతుడితో నిండి ఉన్నది కావున ఆయన మధ్యలో, ఆయన కృపచే జీవిస్తున్నట్లు జీవించాలి. ఇట్టివాని జీవితము ధన్యము, స్వామివారికి ప్రియము.

నమో వేంకటేశాయ

**వినా వేంకటేశం న నాథో న నాథః ।**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి॥**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**పుల్లగూర్ల సాయిరెడ్డి** (గోవిందదాసు)


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy:** Cell : **93482 12354**, Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు
(రూ.లలో)


| | |
|---|---|
| ☐ 2 సం|| | 500-00 |
| ☐ 4 సం|| | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**
నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.
లేదా
శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను
లేదా
**Srivenkatesham**
A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు:______________________
______________________
చిరునామా:______________________
______________________
______________________
______________________
______________________
పిన్‌కోడ్:______________________
చందా వివరాలు:______________________

మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

**చందాదారులకు స్వామివారి పవిత్ర పాదాలు (10"x8") ఉచితం**

# శ్రీ వేంకటేశ్వర స్తుతి

– డా|| కె.వి. రాఘవాచార్యులు

శ్లో|| కలవేణు రవావశ గోపవధూ
శతకోటి వృతాత్స్వర కోటిసమాత్
ప్రతి వల్లవికాభి మతాత్సుఖదాత్
వసుదేవ సుతాన్న పరం కలయే

తాత్పర్యం –మధురమగు వేణునాదముచే పరవశులై చుట్టూ పరివేష్ఠించి ఉన్న గోపికలు కలవాడు, కోటి మన్మథులతో సమానుడగు సుందరుడు, ఒక్కొక్క గోపికకు ఆనందము కలిగించువాడు అగు వసుదేవుని కుమారుడగు శ్రీకృష్ణుడు వేంకటాచలమున నివసించి యుండగా నేను వేరొక దేవుని తలంచను.


శ్లో|| అభిరామ గుణాకర! దాశరథే!
జగదేక ధనుర్ధర! ధీరమతే!
రఘునాయక రామ రమేశ విభో
వరదో భవ దేవ దయాజలధే

తాత్పర్యం – పురుషుడు కోరదగిన సద్గుణములు కలవాడు, దశరథుని కుమారుడు, అద్వితీయుడైన విలుకాడు, కలత చెందని స్థిరమైన మనస్సు కలవాడు, రఘుకుల నాయకుడు, శ్రీరాముడు, సీతాదేవీ వల్లభుడు, కరుణా సముద్రుడు, అంతటా వ్యాపించినవాడు, విష్ణుదేవుడు అయిన వేంకటేశా! నేను కోరిన వరములను అనుగ్రహించిన వాడవు కమ్ము.

# ముక్తిమార్గము

భావానువాదం:
శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య





## సామంతం

సకల భూతదయ – కచాలఁగఁ గలుగుట
ప్రకటించి దేహసం – భవమైన ఫలము ||పల్లవి||

1. తలకొన్న ఫలవాంఛఁ – దగులకుండఁగఁ జిత్త
మలవరించుట కర్మి – యైన ఫలము,
పలు కర్మలలోన – బ్రహ్మార్పణపు బుద్ధి
గలుగుట హరికృప – గలిగిన ఫలము ||సకల||

2. ఎప్పుడుఁ దిరువేంక – టేశు సేవకుఁ డౌట
తప్పక జీవుఁడు – దానైన ఫలము,
కప్పిన సౌఖ్య దుః – ఖమ్ములు సమముగా
నొప్పట విజ్ఞాన – మొదవిన ఫలము ||సకల||



భావము:
శరీరము దాల్చినందుకు ముఖ్యప్రయోజనము సమస్త ప్రాణుల యందు మిక్కిలి దయ గలిగి ప్రవర్తించుటయే.
కర్మయోగము నాశ్రయించి పలు కర్మలొనర్చుటకు ముఖ్యప్రయోజనము ఆ కర్మఫలములపై ఆశపడకుండా మనస్సును స్వాధీనపరచుకొనుటయే.
కర్మయోగిపై శ్రీహరి కృప ప్రసరించినందులకు ఫలము ఆ కర్మఫలములను పరబ్రహ్మార్పణ మొనర్చు బుద్ధి యతనికి కలుగుటయే.
తాను జీవుడైనందుకు ఫలము ఎల్లప్పుడు తప్పకుండా శ్రీవేంకటేశ్వరునకు సేవకుడగుటయే.
తనకు విజ్ఞానము కలిగినందుకు ఫలము సుఖదుఃఖముల యెడ సమభావ మలవడుటయే.

# ప్రత్యక్ష భగవానుని పండుగ...

# రథసప్తమి పండుగ

చింతలపాటి శివశంకర శాస్త్రి

**శ్లో ॥ "త్రైగుణ్యం చ మహాశూరం బ్రహ్మ విష్ణు మహేశ్వరమ్**
**మహా పాపహరం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్"**

త్రిగుణాత్మకుడు, మహాశౌర్యశాలి, సృష్టిస్థితి లయలకు కారణమై, త్రిమూర్తుల శక్తి సామర్థ్యాలతో అలరువాడు, బహు జన్మకృత పాపహరుడైన సూర్యభగవానునకు నేను నమస్కరిస్తున్నాను.

భారతీయ సంప్రదాయంలో సూర్యభగవానుని స్థానం అద్వితీయం. సూర్యభగవానుడు మనకు ప్రత్యక్ష దైవం. సకల జగత్తుకూ కర్మసాక్షి. సాక్షాత్ భగవత్ స్వరూపుడు సూర్యభగవానుడు. సమస్త విశ్వచలనానికి ఆయన మూలశక్తి. నమస్కార ప్రియుడైన భాస్కరుడు ఐశ్వర్య ప్రదాత మాత్రమే కాదు, ఆపదలను నివారించేవాడు. సమస్త జీవులకూ ఆత్మ సూర్యుడే. అందుకే ఆయన ఆరోగ్య ప్రదాతగా కీర్తి గడించాడు.

సమస్త లోకాలకూ వెలుగును ప్రసాదించే సూర్యుడు అదితి, కశ్యపులకు ప్రభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘమాసం శుక్లపక్షం సప్తమి తిథినాడు ఆదివారంతో కూడిన అశ్వినీ నక్షత్రంలో జన్మించాడు. అదితి కుమారుడు కావటం వల్ల ఆదిత్యుడు అని, కశ్యపుని తనయుడు కావడం వల్ల కాశ్యపేయుడని ప్రసిద్ధిపొందాడు.

**శ్లో ॥ "ఉదయే బ్రహ్మస్వరూపాయ మధ్యాహ్నేతు మహేశ్వరః**
**సాయం ధ్యాయే సదా విష్ణుం త్రిమూర్తించ దివాకరః"**

ఉదయం బ్రహ్మ, మధ్యాహ్నం మహేశ్వరుడు, సాయంత్రం విష్ణురూపములతో తన తేజస్సుతో ప్రకాశిస్తుంటాడు సూర్యుడు. ఆ స్వామి రాకతో పగలు ఏర్పడటం వలన దినకరుడని, దివాకరుడని ప్రసిద్ధి. ఇలా త్రిమూర్త్యాత్మకుడైన స్వామి తనను గ్రహ నక్షత్ర రాశులు అనుసరిస్తూ సంచరిస్తుండగా లోకాలకు వెలుగులను ప్రసాదిస్తూ నిత్య ప్రయాణం సాగిస్తూ కనిపించే దైవంగా, కనికరించే దివ్యశక్తిగా, కిరణ సంస్పర్శతో ఆరోగ్యాన్ని, ఆహ్లాదాన్ని, ఆనందాన్ని అనుగ్రహిస్తూ శారీరక, మానసిక రుగ్మతలను దూరం చేస్తూ జీవకోటిలో చైతన్యస్ఫూర్తిని, జ్ఞానదీప్తిని నింపుతూ నిరంతరం ప్రయాణం సాగిస్తున్నాడు.

లోకములకు కర్త, ప్రభువు, సంహారకుడు అగువాడు,



కాంతులకు నిధి యగువాడు అయిన సూర్యభగవానుడు సప్తమి నాడు సాక్షాత్కరించడం చేతనూ, ఆ సమయంలో ఆకాశంలో తెల్లవారు జామున నక్షత్రాలు రథాకారంలో ఉండటం వలన 'రథసప్తమి' అను పేర వచ్చినట్లు శాస్త్ర వచనం. సూర్యగ్రహణం వలె రథసప్తమి పరమ పవిత్రమైనదని అంటారు.

సూర్యభగవానునికి ఇష్టమైన రథసప్తమి రోజున తెల్లవారు జాముననే స్నానం చేస్తే, సూర్యగ్రహణ సమయంలో చేసే స్నానంతో సమానమని పెద్దలు అంటుంటారు. ఈరోజున చెరువులో, ఏటిలో, కాలువలో లేక సముద్రమునందు స్నానము చేయాలి. అవేమీ అందుబాటులో లేనప్పుడు కనీసం బావి నీళ్ళతోనైనా స్నానము చేయాలంటారు. ఏడు జిల్లేడు ఆకులను, ఏడు చిక్కుడు ఆకులను తలపై పెట్టుకుని స్నానం చేయాలి. ప్రాతః కాలమున కానీ, ఏ సమయము నందైనా అనగా ఆరు, ఆరున్నర గంటల సమయములో స్నానం ఆచరించునప్పుడు ఈ క్రింది మంత్రమును చదవాలి.

**"యద్య జ్జన్మకృతం పాపం మయాజన్మ సప్తమ**
**తన్మే రోగంచ శోకంచ మాకరీహంతు సప్తమీ"**

జన్మజన్మాంతరాలలో, మనో వాక్కాయములతో తెలిసీ తెలియక చేసిన సప్తవిధ పాపాల వల్ల ఏర్పడిన రోగం, శోకం మున్నగునవన్నీ ఓ శుభప్రదమైన సప్తమీ! నిన్ను స్మరిస్తూ చేసే స్నానంతో నశించు గాక అని ప్రార్థిస్తూ సూర్యునికి ఎదురుగా నిలబడి–

**"సప్త సప్తి వహ ప్రీత సప్తలోక ప్రదీపన**
**సప్తమీ సహితో దేవ గృహాణార్ఘ్యం దివాకర"**

అంటూ సూర్యునికి అర్ఘ్యం ఇవ్వడం వల్ల జన్మ, జన్మాంతర శోక, రోగ రూపమైన పాపాలు, త్రికరణముల చేత తెలిసీ తెలియక చేసిన పాపాలు నశిస్తాయి. స్నానానంతరం ఇంటికి వచ్చి పూజామందిరంలో కానీ, పూజ చేయదలచుకున్న చోట ఏర్పాటు చేసుకున్న చోట కానీ, మండపంలో కానీ బియ్యపు పిండితో అష్టదళ పద్మం చిత్రించి, దానిపై బియ్యం పోసి కలశం ఏర్పాటు చేసుకోవాలి. కలశం ముందువైపు శ్రీసూర్యనారాయణుని చిన్న ప్రతిమను కానీ చిత్ర పటాన్ని వెనుకవైపు కానీ ఏర్పాటు చేసుకోవాలి. అలాగే కలశం లోనికి పవిత్రమైన నదులలోని నీటిని పోసి, మామిడాకులను వేసి రవికె గుడ్డతో త్రికోణాకారంలో అమర్చాలి. కలశానికి చందనం రాసి కుంకుమను అలంకరించాలి. కలశము ముందుభాగాన తమలపాకులను వేసి పసుపుతో చేసిన గణపతి ప్రతిమను ఏర్పాటు చేసుకుని అష్టోత్తరాలతో పూజించాలి. అనంతరం తులసికోట దగ్గర రథం ముగ్గు వేసి దానిపై గానీ, సమీపాన గానీ ఇటుకలతో నలుచదరంగా పేర్చి ఆవుపేడతో చేసిన పిడకలను అమర్చి అగ్నిని ప్రజ్వలింప చేసి దానిపై కొత్త పాత్రలో కొత్తబియ్యం, ఆవుపాలు పోసి పొంగలిని తయారు చేసి సూర్యునికి నైవేద్యంగా సమర్పించాలి. చిక్కుడుకాయలను పుల్లలతో గుచ్చి పందిరిగా చేసి రథాన్ని తయారు చేసి ముగ్గులో పెట్టాలి. 15 చిక్కుడు కాయలను, ఆకులను పరచి పాయసాన్ని ఉంచి అగ్నిహోత్రునికి, తులసికి, సూర్యునికి నివేదన చేయాలి. హారతి నివ్వాలి.

సూర్యుడు జగతికి చేసే మహోపకారాలను వివిధ రకాలుగా ప్రస్తుతించారు. వెలుగు కిరణాలను ప్రసరించేవాడు, ప్రాణ శక్తుల్ని చైతన్యవంతం చేసేవాడు, నీటిలోని రసాన్ని స్వీకరించి తిరిగి అందించేవాడు, ఆకాశంలో సంచరించేవాడు, లోకాన్ని సృష్టించేవాడు, ఆదిదేవుడు, సనాతనుడు, ప్రాణుల్ని నిత్యకర్మలు అనుష్ఠించడానికి ప్రేరేపించేవాడు. ఇవే కాకుండా సూర్యుడు లోకానికి అందించే సేవల ఆధారంగా ఆయనను వివిధ పేర్లతో కొలిచారు. మనకు ప్రముఖంగా ద్వాదశాదిత్యులు అనే మాట వినిపిస్తుంటుంది. సంవత్సరానికి పన్నెండు నెలలు. ఒక్కొక్క నెలలో సూర్యుణ్ణి ఒక్కో పేరుతో పిలవాలని జ్యోతిష్య శాస్త్ర నిపుణులు పేర్కొన్నారు. మిత్ర, రవి, సూర్య, భాను, ఖగ, పూష, హిరణ్యగర్భ, మరీచి, ఆదిత్య, సవిత, అర్క, భాస్కరుడనే వారు ద్వాదశాదిత్యులు. ద్వాదశాదిత్యుల నామాలను ప్రతిరోజూ ఉదయం స్నానానంతరం సూర్యునికి ఎదురుగా నిలబడి పఠించిన సకల శుభాలు కలిగి ఆరోగ్యం కుదుట పడుతుంది.

''ఆరోగ్యం భాస్కరాదిచ్ఛాద్'' – సూర్యుడు ఆరోగ్య ప్రదాత. ఆరోగ్యం కోసం సూర్యభగవానుని ఉపాసించాలి. మయూరుడు అను సంస్కృతకవి దీర్ఘవ్యాధితో బాధపడుతూ సూర్యుడి పేరు మీద మయూర శతకం రచించాడు. సూర్యుని అనుగ్రహంతో రోగ విముక్తుడయ్యాడు. శ్రీకృష్ణుని తనయుడు సాంబుడు. అతడికి మిక్కిలి అహంకారం. ఆ అహంకారంతో దూర్వాసుని అవమానించగా ఆయన కుపితుడై కుష్టువ్యాధిన పడమని శాపమిచ్చాడు. శాపవిమోచనం కోసం పరితపిస్తుండగా సూర్యుని ఆరాధిస్తే శాపవిమోచనం కలుగుతుందని శ్రీకృష్ణుడు సాంబునికి సలహా ఇస్తాడు. శ్రీకృష్ణుని సలహా ననుసరించి సాంబుడు సూర్యుని భక్తి శ్రద్ధలతో ఆరాధించి ఆయన అనుగ్రహంతో రోగవిముక్తుడవుతాడు. సూర్యోదయ సమయాన సూర్యునికి ఎదురుగా నిలబడి ముమ్మారు అర్ఘ్యమిచ్చిన ఎటువంటి అనారోగ్యమూ దరిచేరదు. సూర్యారాధన వల్ల ఆరోగ్యం, తేజస్సు, బలం కలుగుతుందని సామవేదము, జ్ఞానము సిద్ధిస్తుందని కృష్ణ యజుర్వేదము వల్ల తెలుస్తోంది. మరియు గ్రహ దోష నివారణ జరుగుతుంది. సమస్త వ్యాధులు, శోకాలు నశించి సుఖసంపదలు చేకూరుతాయని శాస్త్రోక్తి.

సూర్యుడు సర్వ విద్యాస్వరూపుడు మరియు విద్యా ప్రదాత రామభక్తుడైన ఆంజనేయుడు సూర్యుని వెంట తిరిగి సమస్త విద్యలను నవ వ్యాకరణాలను అభ్యసించాడు. హనుమంతునికే కాక యాజ్ఞవల్క్యునికి బ్రహ్మవిద్య, చాక్షుష్మతీ విద్య సూర్యానుగ్రహం వల్ల లభించాయి.

ప్రత్యక్షదైవం, జీవకోటి కర్మసాక్షి, ఆరోగ్యప్రదాత అయిన సూర్యనారాయణ మూర్తికి సంబంధించిన వ్రతాన్ని ఆచరించే విధానం గురించి తెలియజేయాల్సిందిగా ధర్మరాజు శ్రీకృష్ణుని ప్రార్థించగా శ్రీకృష్ణుడు రథసప్తమీ వ్రతాన్ని ఆచరించే పద్ధతిని తెలియజేస్తూ ఒక కథను ఇలా వివరించాడు.

పూర్వము కాంభోజము అను దేశాన్ని యశోవర్తనుడు అనే రాజు పరిపాలించేవాడు. అతనికి చాలాకాలం వరకు సంతానం కలగలేదు. అదృష్ట వశాత్తు ముదిమి వయసులో అతనికి సంతానం కలిగింది. సంతానం కలిగిందన్న ఆనందమును అతడు ఏనాడూ అనుభవించలేదు. దానికి కారణం ఆ సంతానం నిత్యం అనారోగ్యంతో బాధపడుతూ ఉండటమే. కుమారుని అనారోగ్యాన్ని చూసి రాజు కుమిలిపోతుండేవాడు. ఒకరోజు ''త్రికాల కోవిదులారా! నిరంతరం నా కుమారుడి అనారోగ్యం నన్ను కలచి వేస్తోంది. అతని బాధను నేను చూడలేకపోతున్నాను. దీనికి ఏదైనా కారణమున్నదా? ఉన్నచో అది ఏమిటి? దయచేసి

తెలుపగలరు'' అన్నాడు. త్రికాల కోవిదులు రాజుగారి ప్రశ్నకు సమాధానమిస్తూ ఇలా అన్నారు.

రాజా! నీ తనయుడు పూర్వ జన్మముల పాప ఫలితం అనుభవిస్తున్నాడు. అతడు పూర్వజన్మలో ఒక వైశ్యుడు. పరమ లోభి. దాన ధర్మములు ఏనాడూ చేసినవాడు కాదు. అదృష్టవశాత్తు అవసాన సమయంలో ఎవరో ఆచరిస్తున్న రథ సప్తమి వ్రతాన్ని చూశాడు తత్ఫలితంగా అతడు ఈ జన్మలో నీ కుమారుడిగా జన్మించాడు. లోభత్వ కారణంగా ఈ జన్మలో అనారోగ్యంతో బాధలనుభవిస్తున్నాడు. నీ కుమారుడు రథసప్తమీ వ్రతాన్ని ఆచరించాలి. దానివలన సూర్యభగవానుని అనుగ్రహానికి పాత్రుడై పాపాలు నశించి నిరోగి అవుతాడు. ఆ వ్రతాన్ని ఆచరించే విధానమును చెబుతాము. శ్రద్ధగా విను. మాఘ శుద్ధ షష్ఠి నాడు తెల్ల నువ్వుల పిండితో నలుగు పెట్టుకుని నది మున్నగు జలాశయములలో స్నానము ఆచరించాలి. పిదప సూర్యభగవానుని దేవాలయమునకు వెళ్ళి పూజలు చేయాలి. అతిథులను పూజించి భోజనము పెట్టాలి. ఆరోజు ఆహార పదార్థాలలో నూనె లేకుండా చూసుకొని ఆహారాన్ని భుజించాలి. రాత్రి సమయంలో భోజనం చేయరాదు. శక్త్యానుసారం బంగారంతో కాని, రాగితో కాని రథాన్ని, ప్రతిమను చేయించి బ్రాహ్మణునకు దానమివ్వాలి. ఈ వ్రతాన్ని శ్రద్ధా భక్తులతో ఆచరించిన వారికి సర్వ రోగముల నుండి విముక్తి, పుత్ర పౌత్రాభివృద్ధి, పుణ్యలోక ప్రాప్తి తప్పక ప్రాప్తిస్తాయి. త్రికాల కోవిదులు వివరించిన వ్రత విధానాన్ని విని వ్రతాన్ని నియమ నిష్ఠలతో తన కుమారుని చేత చేయించాడు. తత్ఫలితంగా రాకుమారుడు సంపూర్ణ ఆరోగ్యవంతుడయ్యాడు.

భారతావనిలో సూర్యారాధన అత్యంత ప్రాచీనమైనది. ఋగ్వేదంలో సూర్యుని స్తుతిస్తూ పది ఋక్కుల వరకూ ఉన్నాయి. సుప్రసిద్ధమైన వేదమంత్రం గాయత్రి సూర్యపరమైనదే. సూర్యస్తుతిలో సూర్యరథ ప్రస్తావన, అశ్వాల ప్రస్తావన ఉంది. సూర్యుడు ప్రత్యక్ష దైవం. అందరికీ దర్శనం ఇస్తాడు. ఆయురారోగ్య భోగ భాగ్యాలు ఇస్తాడు. అనంతమైన జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు.

**"రశ్మి మంతం సముద్యన్తం దేవాసుర నమస్కృతమ్**
**పూజ యస్య వివస్వన్తం భాస్కరం భువనేశ్వరమ్"**

ప్రశస్తములైన చరణములు కలవాడు, సురాసురులచే నమస్కరింపబడువాడు, కాంతులను ప్రసాదించువాడు, భువనేశ్వరుడైన ఆదిత్యుని పూజించి ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాదింప చేయుమని వేడుకుందాం.

★★★

# భీష్మ పంచకం

**– కౌతా నిర్మల**

కౌరవులు, పాండవులు కురుక్షేత్ర సంగ్రామంలో ఒకరికొకరు తలపడ్డారు. భీష్ముడు కౌరవుల తరపున రణరంగంలోకి వచ్చాడు. శస్త్ర విద్యలో ప్రావీణ్యుడైన అర్జునుడు భీష్మాచార్యులను పడగొట్టాడు. ఆయన నేలకొరగకూడదని, అనేక బాణాలతో ఆయనకు ఒక పడకను ఏర్పాటు చేశాడు. దానినే అంపశయ్య అంటారు. అంపశయ్య మీద భీష్ముడు శయనించాడు. అది దక్షిణాయన కాలం కావడం వల్ల తన మరణం అప్పుడు జరగకూడదని, ఉత్తరాయణ పుణ్య కాలంలో తాను మరణిస్తే, తనకు స్వర్గప్రాప్తి లభిస్తుందని నిశ్చయించుకున్నాడు భీష్ముడు. తనకు ఇచ్ఛా మరణాన్ని ప్రసాదించిన తండ్రి వరాన్ని ఉపయోగించుకోవాలనుకున్నాడు. భీష్ముడు తన చావుకు తానే ముహూర్తం పెట్టుకున్నాడు.

ఉత్తరాయణంలో మాఘశుద్ధ ఏకాదశి రోజున మరణించాలని నిశ్చయించుకుని ఉత్తరాయణం కోసం ఎదురు చూస్తూ అంపశయ్య మీదే ఉన్నాడు. మాఘ శుక్ల సప్తమి నుండి తన దేహం నుంచి రోజుకొక ప్రాణాన్ని విసర్జిస్తూ ఏకాదశి నాటికి పంచప్రాణాలనూ వదిలేసి భీష్ముడు ముక్తిని పొందాడు భీష్ముడు. ఆయన తనువు చాలించిన రోజయిన ఏకాదశిని భీష్మపంచకం అంటారు.


ధర్మం పాండవుల వైపే ఉన్నదని భీష్మునికి తెలిసే. శ్రీకృష్ణ భగవానునికి తన మనసులో చోటిచ్చినా, తన శరీరాన్ని మాత్రం కౌరవుల రాజైన దుర్యోధనుని సేవకై వినియోగించాడు. ధర్మం, న్యాయం, రాజనీతి పాండవులపైనే ఉన్నదని తెలిసినా, అధర్మపరులైన కౌరవులకు వినాశనం తప్పదని తెలిసీ మమకారానికి, అహంకారానికి మనస్సులో చోటివ్వకుండా పక్షపాత ధోరణిని అవలంబించకుండా మహాభారత యుద్ధంలో తన శక్తి మేర యుద్ధం చేశాడు. ఆ యుద్ధంలో కురువంశ నాశనం జరుగుతుందని తెలిసినా కూడా వారి వినాశనం విరక్తిని కలిగించి, ఆయనలో వైరాగ్య భావనను మేల్కొలిపింది.

పాండవులు తనను జయించలేకపోయినప్పుడు తన మరణ రహస్యాన్ని వారికి తెలిపాడు. తనకు జీవితం పట్ల విరక్తి కలిగిందనీ, జీవించాలన్న ఇచ్ఛ లేదనీ, శిఖండి తనతో యుద్ధానికి తలపడితే తాను అస్త్ర సన్యాసం చేసి, శిఖండి కారణంగానే మరణిస్తానని తెలిపాడు. అప్పుడు పాండవులు శిఖండిని అడ్డు పెట్టుకుని ఆయనతో యుద్ధం చేశారు. కురుక్షేత్ర యుద్ధంలో పదిరోజుల తర్వాత పితృదేవతా నక్షత్రమయిన అశ్వనీ నక్షత్రం నాడు కూలిపోయి, ఉత్తరాయణ పుణ్యకాలంలో ఇచ్ఛా మరణం పొందాడు. కార్తీక మాసం అమావాస్య నుండి కౌరవ పాండవుల మధ్య కురుక్షేత్రంలో యుద్ధం ఆరంభమయిందనీ, అంపశయ్యపై భీష్ముడు యాభై ఎనిమిది రోజులు ఉన్నట్లుగా భారత పురాణ గ్రంథం స్పష్టంగా తెలిపింది. మాఘ శుక్ల అష్టమిని భీష్ముని నిర్యాణ దినమని పద్మపురాణం తెలిపింది. భీష్మాష్టమి రోజున భీష్ముడికి తర్పణం వదిలితే, పిల్లలు లేనివారికి సంతానం కలుగుతుందని చాలామంది నమ్ముతారు.

### తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

# 23వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

## శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

### సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

### నిబంధనలు:

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మానుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగిన రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

### గమనిక:

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!

## శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ,
హైదరాబాద్ - 500007. ఫోన్: 040- 27175050

ఈ కార్యక్రమం గురించి
పూర్తి వివరాలకు సంప్రదించండి:
**93482 12354**



**23వ భాగము**


# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని
# దిశానిర్దేశం
## స్వామి వారి దివ్య లీలలు

**తెలంగాణలో మరో తిరుపతిగ
తన 'హరినామ క్షేత్రము'ను
ఏర్పాటు చేయుటకై తిరుమల
శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**— గోవింద దాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)**

**దిశా నిర్దేశం :** సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారిగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వార ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగ చేయుటకు వీలుగ స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగా ప్రస్తుతపు 23 వ భాగపు లీలల ప్రచురణ. **(డిసెంబర్ 2008 నుండి జులై 2009).**



డిసెంబర్ 2008 నుండి స్వామివారు మా దిశను మార్చుటకు ప్రయత్నించారు. ఒక్కొక్క అడుగు లక్ష్యం వైపు వేసేలా, అత్యంత విశ్లేషణాత్మకంగ అనుభూతులను ప్రసాదిస్తూ భవిష్యత్తులో నేను చేయబోయే పనుల సంకేతమిచ్చారు. కాని ఆ సమయంలో నేను వీటిని అర్థం చేసుకోలేదు. ఒక రకంగ నన్ను అమెరికాకు తీసుకెళ్ళి కర్తవ్యబోధ చేశారు.

స్వామివారు నన్ను ఎన్నుకుని ఏదో సాధించుటకు నాచే ఈ పనులు చేయిస్తున్నాడనే విషయం గ్రహించాను. కాని ఏమి సాధించాలనుకుంటున్నాడనేది తెలియదు. గత 8 సంవత్సరాల నుండి ఎన్నో అనుగ్రహాలను ప్రసాదించి రకరకాల సేవలను ఏర్పాటు చేశారు. ప్రతి అనుగ్రహం కంటె ముందు నన్ను ఆ అనుగ్రహం పొందేవిధంగ ఆర్తితో ప్రార్థింపచేసిన తరువాత మాత్రమే దానిని ప్రసాదించేవారు. ఇప్పుడు స్వామివారి పాదస్పర్శను అనుభవించాలనే బలమైన కోరికను కలిగించి ఆ భాగ్యాన్ని ప్రసాదించారు. దీనితో నాలో అనూహ్య మార్పు జరిగింది. నా కళ్ళకు స్వామివారి విరాట్ రూపము తప్ప మరోటి కనపడలేదు. మరియు ఈ భాగ్యాన్ని భవిష్యత్తులో భక్తులు పొందునట్లు ఏర్పాట్లు చేయుమని కూడ ఆదేశించారు. ఒక పర్యాయం నన్ను తన ఆత్మీయ భక్తునిగ తన నోటితో నేను వినేటట్లు అన్నారు. ఆనందంతో పరవశించిపోయాను. నా జీవితములో ఇది ఒక అద్భుతమైన కాలము.

నేను స్ట్రక్చరల్ ఇంజనీరింగులో మాస్టర్ డిగ్రీ చేసి, హైదరాబాద్ లో కనస్ట్రక్షన్ ను వృత్తిగా స్వీకరించి జీవిస్తున్నాను. 1990 నుండి 1999 వరకు అపార్టుమెంట్స్ కట్టాను. ఆ తరువాత ఇండిపెండెంట్ ఇళ్ళు కట్టుట ప్రారంభించాను. సం॥ 2002 లో శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠను స్థాపించి స్వామిసేవ మొదలు పెట్టినప్పటినుండి దిన

దినము నా ఆర్థిక పరిస్థితి దిగజారింది. ఒకానొక సందర్భంలో నేను హైదరాబాద్ పరిసర ప్రాంతములో వ్యాపారము చేయలేని స్థితి కలిగింది. రోజులో ఉదయము నా వ్యాపారాన్ని, సాయంత్రం పీఠం సంబంధించిన పనులు చూచుకొనుట నా దినచర్యగ పెట్టుకున్నాను.

## హరినామ క్షేత్రానికి భక్తులు రాగలరని సూచించుట

డిసెంబర్ 2008 ప్రాంతమున హైదరాబాద్‌లోని సైనిక్ పురి వెనుక నాకు అందుబా టు ధరలలో ఉన్న యాప్రాల్ ప్రాంతములో ఒక స్థలము కొని నాలుగు ఇండిపెండెంట్ ఇళ్ళను ప్రారంభించాను. ఆ సమయాన అక్కడ ఇళ్ళు ఎక్కువగ రాలేదు, అప్పుడప్పుడే డెవలప్ అగుచున్న కాలని అది. ముందునుండి కూడ అక్కడ ఇళ్ళు కడితే ఎలా అమ్మగలననే దిగులు ఉండేది. కాని విధిలేక నా వద్ద ఉన్న కొద్దిపాటి డబ్బుచే అక్కడనే కట్టవలసి వచ్చింది. ఈ వర్కు ఇప్పుడు సగము వరకు పూర్తైంది. ఈ మధ్యన హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ వ్యాపారము బాగా తగ్గింది. కొనేవారు అసలే లేరు, ధరలు పడిపోయాయి. ఈ విషయము ఈ రోజు టీవీ 9 లో రాత్రి గం.9.30 లకు 30 నిమిషాల కార్యక్రమములో, చాలా వివరంగా హైదరాబాద్ లోని నిర్మాణాల గురించి, రియలెస్టేట్ పడిపోవడం గురించి, నిర్మించిన ఇళ్ళు అమ్ముడు పోక కట్టినవారు పడే బాధల గురించి చక్కగ వివరించారు. దీనిని చూచిన నాకు, నేను కడుతున్న ఇళ్ళు ఏ విధంగ అమ్మాలి? పైగ అవి ఒంటరిగ పట్టణానికి దూరంగ ఉన్నవని దిగులు చెందాను. ఇంతకు ముందే భయంతో ఉన్నప్పటికి ఈరోజు మరింత భయం వేసింది. నేను ఈ 4 ఇళ్ళను పూరించిన తరువాత నా వద్ద చిల్లిగవ్వ ఉండదు, పైగ కొంత సొమ్మును అప్పు తెచ్చి కడుతున్నాను. ఒకవేళ వీటిని ఎవ్వరూ కొనక అలాగే నిలబడితే నా గతేమి? ఎలా జీవించాలి అనే బెంగ నన్ను బాధించింది. అలాగే ఆలోచిస్తూ... అంతా నా స్వామివారే చూచుకొందురని ఆయనపై భారము వేసి ధ్యానిస్తూ... పడుకున్నాను.

స్వామివారు ఈ సందర్భంగ ఒక చక్కని సందేశమిచ్చారు. పైకి ఇది నా వ్యవహారానికి సంబంధించిన దానిలాగా కనిపిస్తుంది. కాని విశ్లేషిస్తే దీని ఆంతర్యం బహు చిత్రంగ రాబోవు హరినామ క్షేత్ర లక్షణములతో ముడిపడి ఉన్నది. ఆ లీల ఈవిధంగ ఉంది.

**తేది 19-12-2008 కల** : నేను ఎక్కడో దూరంగ మా ఊరిలోని తోటబావి దగ్గర, అంటే నిర్మానుష్యమైన ప్రదేశంలో నాలుగు ఇళ్ళు కడుచున్నాను. ప్రస్తుతము అవి నిర్మాణపు మధ్య దశలో ఉన్నవి. ఒకరోజు అక్కడికి వెళ్ళిన నాకు వీటిని ఎవ్వరన్న కొంటరా? అనే అనుమానం కలిగింది. అసలు ఇంతదూరంలో నేను ఎలా మొదలుపెట్టానని చింతించాను. పట్టణం ఇంతవరకు ఎప్పుడు విస్తరించాలి, ఎప్పుడు నా ఇళ్ళు అమ్ముడుపోవాలి? అని చింతించాను. దూరంలో ఈలాంటి నిర్మాణాలు ఏమైనా ఉన్నవా? అని అక్కడున్న మావారిని అడిగాను. వారు కూడ అక్కడక్కడ ఉన్నవి కాని ఇవి చాల దూరంగ ఉన్నవని చెప్పారు. నేను ఏమి చేయాలో తోచక అక్కడిక్కడ తిరిగి చూచాను. చివరికి ఇంకా కొంచెము ముందుకు వెళ్ళి అక్కడి వ్యవసాయ పొలములను చూచి వచ్చాను. అంటే... కొంత సమయము గడిచింది. ఇంతలో ఈ ఇళ్ళ నిర్మాణము మరింత జరిగి పూర్తగు దశకు వచ్చాయి. తిరిగి వచ్చిన నేను వీటిని మరోసారి చూస్తానని వీటి ముఖద్వారము గుండా వెళ్ళి లోన చూస్తూ, ఆ ఇంటి వెనుక ద్వారము గుండా బయటికి పోయాను. అప్పుడు నేను అక్కడ ఆశ్చర్యకరమైన వాతావరణమును చూచాను. అదేమంటే! మా ఇంటి వెనుక రోడ్డుకు ఇరుప్రక్కల ఎప్పుడో కట్టిన చిన్న చిన్న గృహాలు ఎన్నో ఉన్నవి. వాటిలో నిండుగ జనము ఉన్నారు. చిత్రమేమిటంటే వీరందరూ నాకు తెలిసిన మా గ్రామస్తులే కావడం విశేషం. నేను కట్టిన ఇళ్ళు ఆ రోడ్డును మూసేవిధంగా ఉన్నవి. దీనిని చూచి నా




జన సంద్రంలో ఉన్నాననే భావన కలుగుట

హృదయంలో ఏమీ ఫరవాలేదు, నా ఇళ్ళు జన సంద్రములోనే ఉన్నవి, ఒంటరివి కావు, రేపు కొనేవారు భయపడవలసిన అవసరము లేదని, తప్పక అమ్ముడుపోవుననే దృఢ విశ్వాసం కలలోనే కలిగింది. ఈ విధంగ స్వామివారు నా చింతను దూరం చేసారు. ఇంతే కల.

ఇది మొత్తం నా వ్యవహారానికి సంబంధించినట్లు మొదట భావించాను. కాని దీనిని విశ్లేషిస్తే అసలు రహస్యం తెలుస్తుంది. స్వామివారు నన్ను తన హరినామ క్షేత్రమును చిన్నగుండవెల్లిలో, నిర్మానుష్యంగ, దారులు కూడ సరిగా లేని మా తోట బావి వద్ద నిర్మించమన్నారు. ఇక్కడ మనుష్యులు, నివాసాలు, రోడ్లు లేవని భయపడకు తరువాత రోజులలో నీవు సంతోషించే విధంగ జనాలు రాగలరని సూచించారు. ఇదే దీని అసలైన అర్థం అని నమ్మాను.

తరువాత రోజుల్లో ఈ ప్రాజెక్టు నన్ను మరో మలుపు త్రిప్పింది. ప్రతి ప్రాజెక్టును నేను ఏడెనిమిది మాసములలో పూర్తి చేస్తాను. కాని దీనిని పూర్తి చేయుటకు మూడు సం॥లు పట్టింది. చాల నష్టపోయాను. ఒక దశలో ఇక వ్యాపారము చేయకూడదనే భావము మొదటిసారి నా మనసులో ప్రవేశించింది.

## బలిచక్రవర్తి లాగ అనుగ్రహించుట

నాకు స్వామివారు ప్రసాదించు ప్రతి కల నిజమై తీరుతుంది. గతంలో నేను పొందిన ప్రతి లీల నిజమైంది. కలలు నిజమని వీటిని యాదృచ్ఛికములుగ భావించకుమని ఒక సందర్భంలో స్వామివారు స్వయంగ చెప్పారు. మరో సందర్భంలో, కలలను విశ్లేషించమని చెప్పుచూ, కలలో స్వామివారు నా శరీరాన్ని స్పృశించారు. ఆ స్పృశించిన భాగం వచ్చే 3 రోజులు మిగిలిన శరీర భాగాల కంటె భిన్నంగా ఉండునని కూడ చెప్పాడు, అది అట్లే జరిగింది. కాబట్టి అప్పటినుండి ప్రతి లీలను అనుమానించలేదు.

ఈ కలియుగ మానవుడు భగవంతుని సాక్షాత్కారము పొందగలడా? అనేది ప్రశ్న? ఈ కలియుగములో భగవంతున్ని అనుభూతి చెందగలము కాని పొందలేమని శాస్త్రము తెలిసిన చాలమంది పెద్దలు అంటారు, శాస్త్రము కూడ ఇదే చెప్పిందంటారు. కాని గతంలో శ్రీ హాథీరాంజీ బావాజీ మరియు తరిగొండ వెంగమాంబలు సాక్షాత్ తిరుమల శ్రీవేంకటేశ్వరుని సాక్షాత్కారం పొందినట్లు ఆనవాళ్ళు లభించాయి. హాథీరాంజీ బావాజీతో పాచికలాడినట్లు, ఇక తరిగొండ వెంగమాంబకు దర్శనమిచ్చి వెళ్ళు సమయమున ఆయన పంచెముక్క వెంగమాంబ వద్ద చిక్కినట్లు ఆధారాలు లభించాయి. వీరేకాక మరెందరికో స్వామివారి సాక్షాత్కారము లభించి ఉండవచ్చు, కాని ఏ భక్తుడు స్వామి ఆజ్ఞ లేకుండా బయటి ప్రపంచానికి పరిచయము కాడు. ఇక నాలాంటి ఒక అధమశ్రేణి వ్యక్తి తిరుమల శ్రీవేంకటేశ్వరుని సాక్షాత్కారము పొందగలడా? అది సాధ్యమా? అనే ప్రశ్నకు నాది ఒక్కటే జవాబు. స్వామివారిని పొందాలనే కోరిక నాదైతే అది సాధ్యము కాదు. కాని ఈ కోరిక సాక్షాత్ శ్రీవేంకటేశ్వరునిదైతే అందులో సందేహించవలసినదెంత మాత్రము లేదు. భగవంతుడు స్వయంగ తలచుకుంటే తప్ప ఆయన మనకు వశుడు కాడు, పొందలేమన్నది సత్యం. ఈ విషయాన్ని స్వామివారు స్పష్టంగ ఈ లీలలో చెప్పారు.

ఈ కలియుగంలో కేవలం సదా మీ నామస్మరణ చేయు వ్యక్తికి మీ దివ్య సాక్షాత్కార భాగ్యం లభించగలదని, అందుకు నన్ను నిదర్శనంగ ఎన్నుకొమ్మని ప్రార్థించే నా కల నెరవేరబోతుందని ఒక అత్యంత విశ్లేషణాత్మకమైన లీల ద్వార చూపెట్టాడు. ఇది ఒక అత్యంత అద్భుతమైన లీల. స్వామివారు నా జీవితంలో ఎన్నో ఆణిముత్యాలను, మరికొన్ని నా పూర్తి జీవితం ఋణపడే యోగ్యత కలవి ప్రసాదించారు. ఈ లీల కూడ నా పూర్తి జీవితం ఋణపడి ఉండగల యోగ్యత గలది. దీనికై మరో జీవితం కేటాయించుకున్నానంటే ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చు!

మానవుడికి ఆశ పెరుగుతూ ఉంటుంది. మన వద్ద నున్న డబ్బును రెట్టింపు చేయాలనే కోరిక ఎప్పుడూ కలుగుతుంది. ఇక నా వరకు, స్వామివారి ఇన్ని లీలలను చూచినప్పటికి మరిన్ని లీలలను చూడాలనే కోరిక మితిమీరింది. ఈ క్రమములో ఒకసారి స్వామివారి స్పర్శ సుఖమును అనుభవించాలనే కోరిక కలిగింది. ఒక పర్యాయం స్వామివారు నన్ను స్పృశించారు కాని అప్పుడు నేను భయంతో ఉన్నాను కాబట్టి ఆ స్పర్శ సుఖమును అనుభవించలేదు. అలాకాకుండ ఇప్పుడు స్పర్శ సుఖమును కలిగిస్తున్నాను అని తెలిపి ప్రసాదించమన్నాను. ముఖ్యంగ స్వామివారి పాదస్పర్శ సుఖమును ఆస్వాదించాలనిపించింది. అంతే... వెంటనే ప్రభూ! మీ పాదమును స్పర్శించినప్పుడు కలిగే అనుభూతిని ప్రసాదించమని వేడుకున్నాను. దీనికై పూర్వము మీరు బలిచక్రవర్తిని ఏవిధంగ అనుగ్రహించారో అదేవిధంగ నన్ను అనుగ్రహించమని తీవ్రంగ ప్రార్థించాను. ఎన్నోసార్లు దీనికై దుఃఖించాను. నా ప్రార్థన విన్న స్వామివారు పూర్వము బలిచక్రవర్తిని ఏవిధంగ వామనుడు నుండి త్రివిక్రముడుగ ఎదిగి తన పాదమును బలి తలపై పెట్టి అనుగ్రహించారో అదేవిధంగ ఈనాడు నన్ను అనుగ్రహించారు. ఈ నాడు నన్ను కూడ వామనుని నుండి త్రివిక్రముడుగ ఎదిగి తన మూడవ అడుగుగ తన రెండు పాదాలను నా తలపై పెట్టి ఆస్వాదించమంటు అదేవిధంగ అనుగ్రహించాడు. పరవశించిపోయాను. అప్పుడు నేను పొందిన అనుభూతి వర్ణనాతీతం. పైగ ఇది ఒక విశ్లేషణాత్మక లీల. ఆ లీల ఈ విధంగా ఉంది.


ఇది ధనుర్మాస కాలము. ఏ విష్ణు ఆలయములలో చూచిన ధనుర్మాస తిరుప్పావైని భక్తులు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు ఒక పాశురము చొప్పున చదువుచు శ్రీకృష్ణుడిని పొందుటకు

చేసే ప్రయత్నాలు, వ్రతాలు ఈ మాసంలో భక్తులు చేస్తుంటారు. వారి ఏకైక ఉద్దేశ్యము భగవంతున్ని పొందడమే! అదే నాకు ఈ కలలో జరిగింది. ఈ ధనుర్మాసంలో తిరుమలలో సుప్రభాతానికి బదులు తిరుప్పావై పఠించి స్వామివారిని శ్రీకృష్ణుడిగ భావించి మేల్కొలుపుట ఆనవాయితి. ఈ సమయంలో టిటిడి ఈఓగా శ్రీమాన్ కె.వి.రమణాచారి గారు మరియు ధర్మప్రచార పరిషత్ సెక్రటరీగ శ్రీమాన్ చిలకపాటి విజయ రాఘవాచారి గారు ఉన్నారు. వీరిరువురు నాకు పరిచయస్తులు.

**తేది 13-01-2009 కల :** ఒక ప్రాంతములో టిటిడి వారి ఆధ్వర్యములో కొత్తగ ఒక శ్రీకృష్ణుని ఆలయాన్ని నిర్మించి లేదా విస్తరించి ప్రారంభోత్సవం చేశారు. ఈ ప్రారంభోత్సవమునకు టిటిడి ఈఓ శ్రీమాన్ కె.వి.రమణాచారి గారు, ధర్మప్రచార పరిషత్ సెక్రటరీ శ్రీమాన్ రాఘవాచారి గారు మరియు ఇతర ప్రముఖులు హాజరైనారు. చాలా మంది బ్రాహ్మణులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. అయితే ఈ ఆలయమునకు భక్తుల భక్తి తత్త్వాన్ని తెలిపే ప్రత్యేకత ఉన్నదట.

నాకు ఈ ఆలయపు గోపురములు కనబడలేదు. బహుశా గర్భగుడిలో పూజాది కార్యక్రమములు నిర్వహించిన పిదప, ఉత్సవ మూర్తికి పూజాది కార్యక్రమాలు క్రొత్తగ నిర్మించిన ఒక పెద్ద ఫంక్షన్ హాలు లాంటి మండపములో జరిగినవి. ఒక 4' X 5' సైజు కలిగి రెండడుగుల ఎత్తు ఉన్న ఒక బల్లపైన చిన్నసైజు అంటే దాదాపు మూడు ఇంచుల పరిమాణము గల శ్రీకృష్ణుల వారికి ఈ పూజాది కార్యక్రమాలు జరిగినవి. వీరు మంచి వస్త్రాలు దరించారు, మణులతో పొదగబడిన కిరీటము, మెడలో దండ, ఒడ్డాణము, కర్ణాభరణములు ఇలా ఎన్నో బంగారు అలంకరణములు ధరించి ఉన్నారు. ఒక రకంగ ఈ విగ్రహము హరేరామ హరేకృష్ణ వారు, వారి స్టాల్లలో అమ్మే విగ్రహము లాగ చిన్నగ ఉన్నది. చేతులు మాత్రము నల్లగ ఉన్నవి. ముఖము కూడ విఠలుని లాగ నల్లగ, చక్కని నామము ధరించి విఠలుని ఫోజుతో అంటే తన రెండు చేతులను నడుముపై పెట్టుకుని ఉన్నాడు. క్రొత్తగ ప్రారంభించారు కాబట్టి పూజాది యజ్ఞ కార్యక్రమములు ఇప్పుడే జరిగినవి. ఎన్నో కలశములు చతురస్రాకారంగ అమర్చబడి ఉన్నవి. మరియు ఇతర పూజా ద్రవ్యములు స్వామివారి ముందు కనబడ్డవి. ఇలా ఒక మండపములో పూజా నిమిత్తమై ఒక బల్లపైన స్వామివారు ఉన్నారు. ఆయన ముందు పూజాది కార్యక్రమాలను టిటిడి బ్రాహ్మణులు అత్యంత వైభవంగ నిర్వహించారు. ఈ ఆలయము ఒక ప్రత్యేకమైన లక్షణము కలిగి ఉన్నదట. ఇక్కడి స్వామివారు మహిమాన్వితుడట. అందుకే ఈ ఆలయాన్ని నిర్మించారట. ఇది, భక్తులు వారి వారి భక్తి తత్త్వాలను నిరూపించుకొనుటకై ఉన్నటువంటి ప్రత్యేక ఆలయమట. టిటిడి వారు నాతో పాటు శ్రీవేంకటేశ్వరుని గొప్ప గొప్ప భక్తులను ఆహ్వానించారు. ఈ భక్తులచే స్వామివారిని ప్రార్థింప చేయించి, తరువాత ఆ ప్రార్థనలతో స్వామివారు కలిగించే అనుభూతులను చూచి వాటిని ప్రచారము చేస్తున్నారు. ఇలా టిటిడి వారు ఒకరిద్దరు భక్తులను పరీక్షించారు. శ్రీమాన్ చిలకపాటి విజయ రాఘవాచారి గారు కూడ స్వామివారిని ప్రార్థించి చూచారు. ఆయనకు మంచి గుర్తింపు వచ్చిందట. తరువాత నా వంతు వచ్చింది. ఇంతకుముందు శ్రీమాన్ రాఘవాచారి గారి వంతు వచ్చినప్పుడు టిటిడి వారు చాల మంది వచ్చి ఆహా... ఓహో... అంటు పెద్ద పెద్ద హట్టహాసములు చేశారు. టిటిడి ఈఓ గారు కూడ మెచ్చుకున్నారు. ఇది చాల ప్రచారము జరిగింది. కాని నా వంతు వచ్చేసరికి ఈ అట్టహాసములు లేవు. ప్రముఖులు పరీక్షించుకున్నారు కాబట్టి చాలామంది వెళ్ళిపోయారు, ఒకరిద్దరు భక్తులు మాత్రమే మిగిలారు.

నేను ఆ స్వామివారి ముందు దాదాపు ఒక ఏడు ఎనిమిది అడుగుల దూరములో వజ్రాసనములో కూర్చుండి ఆయన




"స్వామి వారు నా వద్దకు వస్తున్నానని తెలుపుట"




స్వామి వారు నన్ను చేరుట. బలిచక్రవర్తి లాగా అనుగ్రహించడం

వైపు ముఖము పెట్టి ప్రార్థించాను. ఇంతలో చిత్రము జరిగింది. ఆ మండపములోని పూజా బల్లపై ఉన్న మూడించుల చిన్నికృష్ణుడు ఏడు ఇంచుల వరకు పెరిగాడు. ఈ పరిణామానికి ఆశ్చర్యపోయాను. ఇప్పుడు స్వామివారు పెరిగారు కాబట్టి ఏడెనిమిది అడుగుల దూరములో ఉన్న నేను ఆ స్వామి వారిని స్పష్టంగ, తేజోవంతంగ చూడగలిగాను. ఇంతలో మరో చిత్రం జరిగింది. స్వామివారు నన్నే చూస్తూ, తన కుడిచేతి చూపుడువ్రేలును తన హృదయము పైకి తెచ్చి తిరిగి నావైపుకు చూపాడు. అంటే... నేను నీ వద్దకు రావలెనా? అని దీని అర్థం. నేను నీ వద్దకు రావలెనా...? అనే అర్థమును నాకు కలిగించే విధంగ తన చేయితో సైగ చేశాడు. ఈ దృశ్యమును చూచిన నేను నివ్వెరపోయాను. మొదట తను ఏడించుల వరకు పెరుగుట చూచి నివ్వెరపోయాను, తరువాత తన కుడి చేయితో తను నా వద్దకు రావలెనా? అనే అర్థం వచ్చే విధంగ సైగలు చేయుట చూచి మరల నివ్వెరపోయాను. ఈమధ్యన భక్తిభావం కొంత తగ్గి వ్యవహారములో చిక్కుకుపోయిన నేను ఈ సంఘటనతో తిరిగి మరింత భక్తిభావములోనికి వచ్చాను. హృదయము కంపించింది. ఇది చూచిన నేను అలాగే కూర్చుండి, రండి ప్రభూ! రండి ప్రభూ! అంటూ ఆయనను హత్తుకోవాలని నా రెండు చేతులను చాచుచు స్వామివారిని ప్రభూ... అని సంబోధిస్తూ... రండీ... రండీ... అని అరిచాను. నా మాటలు విన్న ప్రభు, తాను ఇంతకుముందు ఉన్న ఏడించుల ఎత్తు నుండి ఇంకా ఎత్తు పెరిగాడు. ఇప్పుడాయన దాదాపు రెండున్నర అడుగుల ఎత్తు వరకు పెరిగాడు. కాని ఆయన ఆ చిన్న విగ్రహము యొక్క ప్రతిరూపమే. కిరీటము, నగలు, ఆకారము, కాని ఎత్తు మాత్రము పెద్దది. ఇప్పుడు ఆయన ముఖము మరింత స్పష్టంగ కనబడ్డది. ఇలా నేను ఆ ప్రాణం ఉన్న శ్రీకృష్ణున్ని తనివితీరా చూచాను. ఆయన తన రెండు చేతులను తన నడుముపై పెట్టుకుని, ఏ నిమిషంలో ఎగిరి నామీద పడాలనే సంకల్పంతో ఉన్నాడనిపించింది. ఈ రకమైన హృదయాంతర భావంను పొందాను. స్వామివారు అదే చేసాడు. స్వామివారు రెండు అడుగులు ముందుకు ఆ పీఠపై నా వైపు వేశాడు. ఇప్పుడు స్వామివారు పీఠం చివర ఉన్నారు. ఇలా స్వామివారు నా వైపుకు నా కోసం రావడం చూచి మైమరచిపోయాను. అప్పుడు నా హృదయములోని భావాలు అంతా దైవికమే, శరణాగత భావమే, ఒళ్ళు జలదరించింది, నా స్వామితో నేను ఐక్యమైపోతున్నానన్న ఆనందము నిండుకుంది. బహుశా ఈ విధముగ చిన్న చిన్న అడుగులతో నడిస్తే ఆలస్యమైపోతుందని, స్వామివారు నన్ను సమీపించడానికి ఒక పెద్ద కుప్పిగంతు లాగ పీఠపై నుండి రెండు కాళ్ళతో ఎగిరి నాపై పడ్డాడు. నేను కూడ నా స్వామి నా వద్దకు, నన్ను చేరుటకు ఎగిరాడని చూచి నీవే దిక్కు ప్రభూ! నీ చరణ దాసుడను ప్రభూ అంటూ కళ్ళు మూసుకుని ఆయన కాళ్ళపై వంగి పడ్డాను. నేను ముందుకు పడడము ఆయన నా తలపై దుంకుట ఒకేసారి జరిగింది. తరువాత అయ్యో... నేను ఎందుకు కళ్ళు మూసుకున్నాను. ఆ దివ్య మంగళ రూపాన్ని ఇంకా చూస్తే బాగుండునని కలలోనే అనిపించింది. తరువాత అక్కడే ఒక ప్రక్కన ఉన్న ఒక వృద్ధ స్త్రీ భక్తురాలికి నాకు కలిగిన అనుభూతిని చెప్పాను. ఆమె కూడ దీనిని చూచానని అన్నది. ఈ విషయంను భక్తుల అనుభూతులను సేకరించుటకై వచ్చిన టిటిడి ఈఓ శ్రీమాన్ రమణాచారి గారికి, మరియు శ్రీమాన్ విజయ రాఘవాచార్యుల గారికి తెలియచేసాము. వారు అలాగేనని సమాధానమిచ్చారు. ఇంతలో కల చెదిరింది.

బలిచక్రవర్తి తలపై వామనుడైన శ్రీమన్నారాయణుడు కాలు పెట్టినప్పుడు, ఆ శ్రీహరి స్పర్శ తగిలి బలిచక్రవర్తి ఏవిధమైన అనుభూతిని పొందాడు, విభీషణున్ని శ్రీరామచంద్రుడు కౌగిలించుకున్నప్పుడు ఆ శ్రీరాముని స్పర్శను పొంది విభీషణుడు ఏ విధమైన ఆనందాన్ని పొందాడు, అలాంటి ఆనందాన్ని, అనుభూతిని నాకు ప్రసాదించండి ప్రభూ అని నేను నా స్వామి శ్రీవేంకటేశ్వరున్ని చాలసార్లు కోరుకున్నాను. ఆయన స్పర్శ సుఖము పొందాలనే కోరిక నన్ను చాల కాలం నుండి వెంటాడింది. పిచ్చివాన్ని చేసింది. చేసేది లేక స్వామి ప్రార్థనలతో సరిపెట్టుకున్నాను. కాని ఈ కలలో నేను ఆ స్వామివారిని స్పృశిస్తున్న సమయములో నేను పొందిన ఆనందము అనంతము. ఒళ్ళు జలదరించింది. హృదయం పొంగింది. ఎక్కడ లేని ఆధ్యాత్మిక ఆనందము నా శరీరాన్ని కబళించి కంపింపచేసింది. పైగ నేను నీ వద్దకు వస్తున్నాను అని చెప్పి ప్రసాదించాడు కాబట్టి మరింత తృప్తి పొందాను. ఇది మాటలతో చెప్పలేను. కేవలం అనుభవపూర్వకంగ మాత్రమే తెలుసుకోగలము. కాని ఇది కలలో జరిగింది నిజంగా జరుగాలని నా ప్రభువును వేడుకున్నాను. గతంలో నేను ఎన్నో స్వామివారి అనుగ్రహాలను చూశాను. ప్రతి అనుగ్రహ ప్రభావము ఒక పది రోజుల తరువాత చెదిరిపోయేది. కాని ఈ అనుగ్రహ ప్రభావము నా జీవితంలో చాల రోజుల వరకు ఉంది. ఒకటిన్నర సంవత్సరం వరకు ఎక్కడ చూచిన నాకు త్రివిక్రముడే కనిపించాడు. ప్రతి క్షణము శ్రీవేంకటేశ్వరునికి బదులుగా త్రివిక్రముడినే స్మరించసాగాను, అంతగా ప్రభావితున్నైనాను. ఈ సృష్టిలో నా స్వామిని మించిన వారు మరొక్కరు లేరనే దృఢ విశ్వాసం నరనరాలలో జీర్ణించుకపోయింది.

ఇక నా ప్రార్థన ప్రకారము స్వామివారు నాకు తన స్పర్శ సుఖముతో పాటు బలిచక్రవర్తి లాంటి అనుగ్రహాన్ని ఈ లీల ద్వార ప్రసాదించారు. ఇది పైకి కనబడేది, కాని దీని ఆంతరంగిక అర్థం ఇలా భావించాను. స్వామివారు నాకు కలిగించు ప్రతి లీల నిజమై తీరుతుంది. భగవంతుడు స్వయంగ తలచుకుంటే తప్ప

మనము ఆయనను పొందలేము. ఈ లీలలో నా ప్రార్థన ప్రకారం గోవిందుడు "నేను నీ వద్దకు రావలెనా?" అని ఎంతో ఇష్టంగ, ఆత్రుతతో అడిగి నా వద్దకు వచ్చాడు, నన్ను చేరాడు. అంటే భవిష్యత్తులో నేను తప్పక శ్రీవేంకటేశ్వరున్ని పొందుతానని, హరినామక్షేత్రం ఏర్పాటు చేస్తానని అర్థం. పూర్వం భద్రాచలం మరియు యాదగిరిగుట్ట క్షేత్రాల ఏర్పాటుకు కారుకులైన ఋషి భద్రుడు, ఋషి యాదగిరి లాగ నేను హరినామ క్షేత్ర ఏర్పాటుకు కారకున్ని కాగలనని దీని నిజమైన అర్థంగ భావించాను.

## ప్రసాదించిన సేవలను సరిగా చేయమనుట

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు నాకు ఎన్నో సేవలను ప్రసాదించారు. ఏప్రిల్ – 2007 నుండి **'నమో వేంకటేశాయ'** అనే ఒక మాసపత్రికను ప్రారంభించాము. దానిని జనవరి 2008 నుండి **'శ్రీవేంకటేశం'** అని పేరు మార్చి ప్రచురిస్తున్నాము. ఏప్రిల్ 2009న ఈ పత్రిక యొక్క 25వ సంచిక వెలువడనున్నది. దీనికి సంపాదకీయం వ్రాయుటను గత రెండు మూడు రోజుల నుండి ప్రయత్నించినప్పటికి సరైన విషయం దొరకక చింతించాను. చివరికి ఈ పత్రికను స్థాపించుటకు స్వామివారి అనుభూతులను "శ్రీవేంకటేశం ఆవిర్భావానికి శ్రీనివాసుని ఆదేశం" అనే టైటిల్ తో పాఠకులకు తెలపాలని భావించాను. మొదట సంపాదకీయం వరకే వ్రాయాలన్న ఈ లీలలను ఆ తరువాత రోజులలో ధారావాహికంగ తెలుపాలనిపించింది. ఇందుకు ఈ పత్రిక నిమిత్తమై నేను పొందిన అనుభవాలను మొదటి నుండి చివరి వరకు ఒకసారి చదివి చూచుకున్నాను. ఇది స్వామివారు నాకు ఇచ్చిన ఆజ్ఞ మాత్రమే కాదని, నా జీవన విధానము కూడ ఇలాగే ఉండాలనిపించింది. అసలు ఈ పని చేయుటకే నేను జన్మించానని, ఈ జన్మ కర్తవ్యం కూడ ఇలాగే ఉండాలని, మరోమారు నిర్ణయించుకున్నాను. అయితే ఒక సందేహం కలిగింది. ఇంతవరకు అంటే గత 25 నెలల నుండి నేను చేస్తున్న ఈ పని, నడిచే మార్గం, చేసే విధానం సరైనదేనా? కాదా? ఒకవేళ ఏదైన పొరపాటు ఉంటే, దానిని చాల దూరము పోయిన తరువాత తెలుసుకుంటే నష్టం కలుగుతుంది, ఫలితముండకపోవచ్చు. కాబట్టి నేను పయనిస్తున్న మార్గం సరైనదేనా? నాకు తెలుపుగలరని శ్రీవేంకటేశ్వరున్ని గత రెండు మూడు రోజుల నుండి వేడుకున్నాను. ఒకవేళ ఏదైన తప్పు చేస్తుంటే మీరు తెలియచేస్తే మార్చుకుంటానని కూడ చెప్పాను. ప్రభూ శ్రీవేంకటేశ్వరా! నాకు ఏ ఇతర గురువులు లేరు, మిమ్ములనే ప్రార్థిస్తున్నాను, నా ప్రార్థనను ఆలకించి ఏ విషయం తెలుపగలరని వేడుకున్నాను. అనుకున్నట్లే స్వామివారు ఒక చక్కని విశ్లేషణాత్మకమైన లీలను చూపారు. ఇది నా భావి జీవితాన్ని సరైన విధంగా మలచుకోవాలని సూచనలిచ్చిన లీల, ఆ లీల ఈ విధంగ ఉంది.

**తేది 06-04-2009 కల :** అది ఎన్నికల సమయమట. మంచి ప్రజాదరణ పొందిన ఒక నాయకుడు తమ గురించి ప్రజలకు ప్రచారం చేస్తున్నాడు. ఆయన ఒక వాహనముపై వెళ్ళుచు, అక్కడక్కడ ఆగుచు, మైక్ తో మాట్లాడుచున్నాడు. చాల మంది జనాలు ఆయన చుట్టూ ఉన్నారు. ఆ వాహనముపై ఆ నాయకుడి ముందు ఒక చిక్కు పడి ఉన్న పూలదండ కనబడింది. ఆ దండను నేను సరి చేస్తున్నాను. ఈ దండను సరిచేసి ఆయనకు వేయాలని నా కోరిక. కాని నాకు ఆ నాయకుడు అదృశ్య రూపములో ఉండుట వలన స్పష్టంగ కనబడలేదు, దండ మాత్రం స్పష్టంగ కనబడ్డది. వెంటనే నేను ఆ దండను ఒక్కొక్క పూవు తీసుకుని కుచ్చుచున్నట్లుగా అనిపించింది. కల చెదిరింది.

పూలను సరిగా కుచ్చుతేనే దండ సరిగా ఉండును లేదా సరిగా ఉండదని దీని అర్థం. దీని అసలైన అర్థం ఇలా ఉంది. నాయకుని మెప్పే లక్ష్యంగ దండను అందంగ కూర్చి వేయాలి. అంటే నాకు ప్రసాదించిన సేవలను చక్కగ నిర్వర్తిస్తూ, స్వామివారి మెప్పే లక్ష్యంగ పని చేయాలని దీని నిగూఢ అర్థం. మాస పత్రికలోని ప్రతి వ్యాసమును ఒంట పట్టించుకుని ఆ విధంగ జీవించమని దీని భావంగ భావించాను.

## శ్రీవేంకటేశం ఆవిర్భావానికి శ్రీనివాసుని ఆదేశం

ఏప్రిల్ 2009, శ్రీవేంకటేశం 25వ సంచిక నుండి ఈ పత్రిక ప్రారంభించుటకు స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ప్రచురిస్తున్నాను. ముందు ఏ విధంగ వ్రాయాలని దిగులు చెందిన నేను స్వామి ప్రసాదించిన అనుభూతులను మళ్ళీ ఒకసారి చదివేసరికి నాలో ఉత్సాహం ఉరకలేసింది. ఈ అనుభూతులను మళ్ళీ ఇప్పుడు క్రొత్తగ అనుభవిస్తున్నట్లు అనుభూతి చెందాను, పరవశించిపోయాను. వ్రాయాలి అనే తపన ఎక్కువైంది. దీనినే స్వామివారు ఒక లీలలో ఇలా చూపెట్టారు.

**తేది 26-04-2009 కల :** ఈ కలలో నేను నా అనుభూతులను ఒక వ్యాసము లాగ ధారాళంగ అంటే ఎక్కడా ఆగకుండ, ఏలాంటి ఆటంకములు లేకుండా వ్రాస్తున్నాను. పేపర్లపై పేపర్లు నిండుచున్నవి. ఎంతో ఆనందంతో ఈ రచన సాగుతుంది. ఇంతే కల.

## భూగోళాన్ని చూపుట

వరుసగా పది రోజులు స్వామివారిని కాని, వారి లీలలను కాని చూడంది ఉండలేను. అలాంటి సమయంలో ఆయన గురించి మరింత ప్రార్థించుట జరుగుతుంది. ఈ మధ్యన ఇలాగే జరిగింది. మా కుటుంబం మొత్తం నలుగురము తేది 28-06-2009 నాడు ఒక 45 రోజులు అమెరికా వెళ్ళుటకు టికెట్




భూగోళాన్ని చూపుట

బుక్ చేసుకున్నాము. మేము అమెరికా పోవుటకు ఆజ్ఞ ఇవ్వమని స్వామివారిని వేడుకున్నాను, మరియు నేను ఇక్కడ లేనప్పటికి మీ సేవలు, ముఖ్యంగ శ్రీవేంకటేశం పత్రిక నడుపుటలో లోటు రాకుండ చూడమని కూడ ప్రార్థించాను. కాని ఏలాంటి అభయము లభించలేదు. అందుకని గత మూడు రోజుల నుండి వేదనతో తీవ్రంగా ప్రార్థించాను. గత కొన్ని రోజులలో ఏవేవో కొన్ని లీలలను చూచాను. కాని అవి అంత గుర్తుపెట్టుకోదగినవి కావనిపించింది. ఈ రాత్రి మాత్రము ఒక చక్కని కల కన్నాను. ఇది కూడ అత్యంత విశ్లేషణాత్మకమైంది. ఒకరకంగ సృష్టి ఈవిధంగ ఉంటుందని చెప్పారు. ఇదే రోజు నాకు ఒకటి, నా భార్య సురేఖకు మరోటి మొత్తం రెండు కలలు వచ్చాయి. ముందు నేను పొందిన కల.

ఈ లీలలో ఈ భూమండలము మొత్తం స్వామివారే ఉన్నప్పటికి ఒకప్రక్క రాత్రి మరోప్రక్క పగలు ఎలా ఉన్నదో చూపారు.

**తేది 19-06-2009 కల :** నేను ఒక ఆలయానికి వెళ్ళాను. ఆ ఆలయంలో చాల దేవతల విగ్రహాలు ఉన్నవి. అన్ని కూడ నల్లగ దాదాపు ఒకటి నుండి ఒకటిన్నర అడుగుల ఎత్తువరకు మాత్రమే ఉన్నవి. ఇదే గుడికి మళ్ళీ రెండవరోజు వెళ్ళాను, కాని ఇంతలో ఆ ఆలయ అధికారులు, (లేక ఎవ్వరో) ఆ ఆలయమునకు మధ్యలో ఒక పది అడుగుల ఎత్తు గోడ కట్టారు. ఆ గోడకు ఒకవైపున చాల విగ్రహములు ఉన్నవి. వీటికి నమస్కారములు సమర్పించాను. తరువాత ఈ గోడకు రెండవ ప్రక్కకు వెళ్ళాను. ఆ ప్రక్కన ఒకే ఒక విగ్రహముంది, అది అత్యంత నల్లగ కేవలము ఒక అడుగు ఎత్తు వరకు మాత్రమే ఉన్నది. అది అమ్మవారి విగ్రహం లాగ కనబడ్డది, ఎవ్వరిదని సరిగా పోల్చుకోలేదు, కాని అమ్మవారిదని నా డైరీలో వ్రాసుకున్నాను. ఆమెకు నాలుగు చేతులున్నవి. పైన రెండు చేతులలో, ఒక దానితో పుష్పమును రెండవ దానితో మరొక దాన్ని పట్టుకొన్నది. క్రింది రెండు చేతులతో, ఒక దానితో అభయమిస్తుంది మరోదానిని కటిహస్తము మాదిరిగ చూపుచున్నది. నేను ఆమెను దర్శించునప్పుడు రాత్రివేళ చంద్రుని వెన్నెల స్పష్టంగ కనిపించింది. మరియు ఈ క్రొత్తగా కట్టిన గోడ యొక్క నీడ ఈ అమ్మవారిపై పడుటను స్పష్టంగ చూచాను. అందుకని అమ్మవారు నాకు సరిగా కనబడలేదు. ఆ అమ్మవారు నాకు సరిగా కనిపించలేదు కావున నేను ఆ అమ్మగారి దగ్గరకు వెళ్ళి అమ్మా... మీరు నాకు సరిగా కనిపించుట లేదని చాల బాధపడ్డాను. ఆమెను చూడక ఉండలేకపోయాను. ఎలా... ఎలా... ఎలా... అని అక్కడిక్కడ వెతికాను, భరించలేక పోయాను. దీనినంత అక్కడి ఒక పూజారి గమనించాడు. నేను ఆ అమ్మను ఎలాగైనా చూడాలని తహ తహ లాడాను. కల చెదిరింది.

ఇది నాకు వచ్చిన కల. దీనిలో మొత్తం భూగోళము చూపాడు. ఒక గుడిలో మధ్యన గోడ కట్టినట్లు ఒక వైపు వెలుతురు, మరోవైపు చీకటిగ ఉండునని సూచించారు. ఇక చీకటిగ ఉన్న వైపు అమ్మవారు నాకు కనిపించక నేను తపించిపోవుటను అమెరికాలో నా పరిస్థితికి అద్దం పట్టింది. అక్కడ నేను స్వామివారి కోసం తపించిపోవుటను చూపాడు. ఇది ముందు ముందు తెలుస్తుంది.

## అపచారము లేదనుట

ఇదేరోజు నా భార్య సురేఖకు వచ్చిన కల ఈ విధంగ ఉంది. మేము ప్రతి గోకులాష్టమికి రథయాత్ర నిర్వహించి, తిరుపతిలో జప సమర్పణ చేయుట ఆనవాయితి. తేది 15-10-2008 నాడు మా అమ్మ చనిపోయిన కారణంగ ఈ సంవత్సరం

అంటే సం॥ 2009 లోని గోకులాష్టమికి జప సమర్పణ జరుపకూడదని నిర్ణయించాము. దీనిని అమెరికా వెళ్ళి వచ్చాక కార్తీకమాసములో జరుపవలెనని అనుకున్నాము. కాబట్టి తేది 18-06-2009 నాడు అమెరికాకు వెళ్ళి తిరిగి 45 రోజులకు ఇండియా వచ్చేయాలని నిర్ణయించుకొని ఆ విధంగ టికెట్లు బుక్ చేసుకున్నాము.

**తేది 19-06-2009 కల :** ఈ కలలో సురేఖ తిరుపతిలోని ఎస్.వి. డైరీఫాంను చూచిందట. అందులో గోకులాష్టమి లాంటి ఉత్సవము జరుగుచున్నదట. ప్రతి సంవత్సరము మాదిరిగనే టిటిడి వారు చక్కని పందిరి వేసి అలంకరణ చేశారట. చాల మంది భక్తులు, కళాకారులు ఆడుతు పాడుతు ఉన్నారట. ఆ పందిరి క్రింద భక్తులు కూర్చుండుటకు వీలుగ చాల ప్లాస్టిక్ కుర్చీలు వేశారట. సురేఖ మరియు మా ఇద్దరు పిల్లలు ఈ డైరీఫాం గేటునుండి లోనికి ప్రవేశించారు. ఆ దారిలో ఈ పందిరికి కొంత ముందు ఎడమవైపున నెమళ్ళు, జింకలు ఉన్నవి. వాటికి రక్షణగ ఇనుప జాలిని చుట్టూ బిగించారు. వీరు ఆ జాలీ వద్దకు వచ్చి ఆ నెమళ్ళను, జింకలను, కుందేళ్ళను చూస్తున్నారట. నేను మాత్రము ఆ పందిరి క్రింద పూజ దుస్తువులు ధరించి ఒక కుర్చీలో కూర్చున్నానట. నేను ఆ డైరీఫాం సూపరింటెండెంట్ శ్రీమాన్ కె.హరినాథ్ రెడ్డి గారితో ఏదో మాట్లాడుచున్నానట. ఈ మాటలను ముగించిన తరువాత కుర్చీలోంచి లేచి, శ్రీవేంకటేశ్వర దివ్యమహామంత్ర స్థూపము వైపుకు పోవుచు, ఆ గేటు వద్దకు వెళ్ళానట. దీనిని గమనించిన సురేఖ దూరము నుండే అయ్యో! మనము లోనికి వెళ్ళకూడదు, వెళ్ళకండి వెళ్ళకండి అని అరుస్తున్నదట. ఇంతలో దీనిని గమనించిన ఆ డైరీఫాం రెండవ డాక్టర్ శ్రీమాన్ నాగరాజుగారు ఇలా అన్నారట. "ఏమి కాదు, మీకు ఏలాంటి తప్పు లేదు లోనికి వెళ్ళండి" అని అన్నారట. అంటే నన్ను మరియు మా కుటుంబమును శ్రీవేంకటేశ్వర మహామంత్ర స్థూపము వద్దకు వెళ్ళమన్నారు. ఉత్సవము చేసి జపసమర్పణ కావించవచ్చునన్నారన్న మాట. ఇంతే కల.

దీనర్థం మా అమ్మ చనిపోయిందని పొడగించక, యథావిధిగ గోకులాష్టమి నాడు జప సమర్పణ కావించవచ్చన్నారు. అపచారము కాదన్నారు. కాని అప్పటికే మేము అమెరికాకు టికెట్ బుక్ చేసుకున్నాము. మరియు కార్తీక మాసంలో ఈ సమర్పణ చేయ నిర్ణయించాము, కాబట్టి అలా నడుచుకోలేదు.


## నా మొదటి అమెరికా యాత్రలోని అనుభూతులు

నేను, నా భార్య సురేఖ, ఇద్దరు పిల్లలతో మొత్తం కుటుంబం తేది 28-06-2009 నాడు బయలుదేరి తేది 29-06-2009 నాటి సాయంత్రం ఇమ్మిగ్రేషన్ (గ్రీన్ కార్డు) వీసాతో అమెరికాకు పోయాము. అమెరికా వెళ్ళేముందు అక్కడికి వెళ్ళుటకు ఆజ్ఞ ఇవ్వమని శ్రీవేంకటేశ్వరున్ని ప్రార్థించినప్పటికి ఆయన నుండి ఎలాంటి సమాధానము రాలేదు. చివరికి కుటుంబముతో కలిసి చింతతోనే అమెరికాకు వెళ్ళాను. వెళ్ళే ముందు జులై మరియు ఆగస్టు – 2009 రెండు మాసములకు శ్రీవేంకటేశం మాసపత్రికకు కావలసిన ఆర్టికల్స్ సిద్ధం చేసి వెళ్ళాను. మిగిలిన పనిని ఇక్కడున్న మావాళ్ళని చూచుకొమ్మన్నాను.

## అమెరికాలో జరుగబోయే ఘట్టమును సూచించుట

నేను అమెరికాకు వెళ్ళానే కాని ఆయన ఆజ్ఞ లేనిది వెళ్ళాననే బాధతో ఉన్నాను. నీవు సృష్టించిన ఈ సృష్టిని చూడాలనే కోరిక ఉంది ప్రభూ, అందుకే ఈ దేశం వచ్చాను, కాని ఎప్పటికి ఈ దేశంలో ఉండిపోను అని ఎన్నోసార్లు అనుకున్నాను. నా స్వామి సేవను వదిలి ఉండలేనని భావించాను. నా ప్రార్థనకు జవాబు ఇవ్వనందున ఆయన నన్ను మరిచారని కూడ భావించి బాధపడ్డాను. ఇంతకు నేను అమెరికాకు వచ్చిన సంగతి మీకు తెలుసా ప్రభూ! అని ఒక సాధారణ మనిషి భావాలతో ఉండిపోయాను. కాని ఆయన ఓ... తెలుసు అన్నటుల తేది 02-07-2009 నాడు ఒక కలను ప్రసాదించారు. ఆ కలను చూచి కొంతవరకు భయపడ్డాను. ఆ కల ఈ విధంగా ఉంది.

**తేది 02-07-2009 కల :** ఈనాటి కలలో ఒక చిత్ర విచిత్రమైన సంఘటన జరిగింది. నేను ఇంతవరకు చూడని ప్రదేశము కనబడ్డది. నేను నా భార్య కలిసి మహా ఆనందంగ ఆడుకుంటున్నాము. కిల కిల నవ్వుచు ఏదో పరిహసించుకుంటు మహా ఆనందమును అనుభవిస్తున్నాము. ఒకరి వెనుక ఒకరము పరుగెత్తుచున్నాము, నవ్వుచున్నాము, చాల ఆనందంగ ఉన్నాము. ఇంతలో ఈ ఆనందం మాయమైంది. నాకు ఒక క్రొత్త రకమైన ప్రదేశం కనబడ్డది. పెద్ద పెద్ద రోడ్లు కనబడ్డవి. అలాంటి రోడ్లను నా జన్మలో ఇంతవరకు చూడలేదు. ఒకదాని ప్రక్కన ఇంకొకటి మొత్తం 3 పెద్ద పెద్ద లేన్లు కలిగిన రోడ్లు, నల్లని డాంబరుతో వేసి నున్నగ ఉన్నవి. ఆ రోడ్డులకు ఇరుప్రక్కల పచ్చని గడ్డి మొలిచి ఉంది. మొదటి రెండు రోడ్లను మధ్య మధ్యన కలుపుచు ఈ రోడు వేయబడ్డది. ఒక వ్యక్తి ఆ రోడ్డు నుండి ఈ రోడ్డుకు రాగలిగే విధంగ ఉంది (పటంలో చూపినట్లు). మేము ఒక కారులో మధ్యలోని రోడ్డు పైనుండి వెళ్ళుచున్నాము. దీనిలో జనాలు లేరు. కాని దీనికి ఎడమ వైపున గల రోడ్డుపై జనాలు అధికంగ ఉన్నారు. కాని మేము మధ్యరోడ్డు పైనుండి వెళ్ళుచున్నాము. ఇంతలో ఈ తప్పును గమనించాము. అయ్యో... ఈ రోడ్డుపై పోవుచున్నాము... ఈ రోడ్డుపై దొంగలుందురు ఆ ఎడమ వైపు రోడుపై వెళ్ళినచో బాగుండును. అక్కడ జనాలున్నారు, మనము




తప్పుదారిలో వస్తున్నామని బాధపడ్డాము. ఏ క్షణమైన దొంగలు రావచ్చని అనుకుంటున్నాము. ఇంతలో ఒక ఇద్దరు దొంగలు మా వద్దకు రానే వచ్చారు. వారు వచ్చిన వెనువెంటనే నా భార్య సురేఖను తీసుకొని పోవుటకు ప్రయత్నించారు. మేము వారిని ప్రతిఘటించాము. ఇంతలో ఆ దొంగలు అక్కడికక్కడనే ఒక పదిమంది పుట్టుకొచ్చారు. మా ప్రతిఘటనను లెక్కచేయక సురేఖను బలవంతంగ వారి వాహనములో ఎక్కించుకొని వెళ్ళిపోయారు. దీనిని చూచి నేను బాధపడ్డాను. ఇంతే కల.

తెల్లవారు లేచిన తరువాత ఈ కలను గుర్తు చేసుకొని మాకు ఏదో కీడు జరుగునని భావించాను. చేయునది లేక నా స్వామివారిని రక్షించమని వేడుకున్నాను. నా భార్య భయపడుతుందని, ఆమెకు చెప్పలేదు. కాని ఇది స్వామివారి లీల కాబట్టి ఎప్పుడో ఒకసారి జరుగక మానదని నాకు తెలుసు.

తేది 07-07-2009 నాడు టెక్సాస్ రాష్ట్రం లోని డల్లాస్ నగరము నుండి ఆస్టిన్ నగరానికి మా సురేఖ రెండవ అన్న శ్రీమాన్ విజయభాస్కర్ రెడ్డి తీసుకెళ్ళగ ఆయన ఇంటికి ఆయన కారులోనే ప్రయాణమై వెళ్ళాము. ఈ ప్రయాణ ప్రారంభంలో నేను నిద్రపోయాను. కొంతసేపైన తరువాత మేల్కున్నాను. నిద్ర నుండి లేచి చూచేసరికి మేము హైవేపై వెళ్ళుచున్నాము. అప్పుడు సరిగ్గా నేను కలలో చూచిన రోడ్డులు, మూడు రోడ్లు, మొదటి రోడుకు అక్కడక్కడ ఒక రోడు నుండి వేరొక రోడుకు వెళ్ళుటకు వీలుపడునట్లు కలుపుటను చూచాను. నేను కలలో చూచినవి అమెరికాలోని హైవే రోడ్లని వెంటనే గుర్తించాను. ఇంతలో మాకు ఏదో ఆపద కలుగునని భయపడ్డాను. స్వామిని స్మరించాను. చివరికి ఏమి కాకుండ సురక్షితంగ ఇల్లు చేరాము. స్వామివారు రక్షించారని భావించాను, భయము తీరింది. కాని స్వామి లీల జరుగక మానదని అప్పుడు గ్రహించలేదు.

## స్వామి పాదాలను అర్చించమని సూచించుట

ఇప్పటినుండి స్వామివారు నన్ను తన లక్ష్యం వైపు తీసుకెళ్ళారు. త్రివిక్రముడుగ ఈ సృష్టిలో తానే గొప్పవాడిననే జ్ఞానమును నా నర నరాలలో ఇమిడిపోయే విధంగ ఇంతకుముందే కలిగించాడు. ఆయన పాదస్పర్శతో ఎక్కడ చూచినా స్వామివారే కనబడసాగారు. ఇప్పుడు ఆయన పాదాలను నిత్యం సేవించిన వారు ధన్యులని, వారికి స్వామివారి కృప లభించునని చెప్పారు. మరియు భక్తులు స్వామివారి పాదములను నిరంతరము సేవించే విధంగ చేయమని నాకు సంకేతమిచ్చారు.

అమెరికాలో ఉన్నప్పుడు స్వామి సేవకు దూరమైన కారణంగ నా మనస్సు స్వామి వైపు అధికంగ లాగింది, తపించిపోయాను. బహుశా ఇదే కారణము చేత కావచ్చు నా జీవితంలో ముఖ్యమైన విషయాలను అమెరికాలోనే చెప్పారు. ఇప్పుడు కూడ ఒక అత్యంత ముఖ్య విషయాన్ని సూచించారు. ఆ రోజు దీని ఆంతర్యం గ్రహించలేదు కాని తరువాత రోజులలో తెలుసుకున్నాను. అత్యంత భక్తి శ్రద్ధలతో సాంప్రదాయ బద్ధంగ భజనలు చేస్తున్నవారు స్వామివారిని చేరుదురని విశ్లేషణాత్మకంగ తెలిపారు. ముఖ్యంగ స్వామి పాదాలను అర్చించాలనే విషయమును ఈ క్రింది లీలలో తెలియజేశారు.

**తేది 10-07-2009 కల :** ఈ కలను నేను ఆస్టిన్ నగరంలో ఉన్నప్పుడు పొందాను. ఇందులో నేను తిరుమల పూజారుల ఇంటికి వెళ్ళాను. నేను ఏ ఇంటికైతే వెళ్ళానో ఆ ఇంటివద్ద అప్పటికే చాలమంది పూజారులు సమావేశమై ఉన్నారు. అందరు చక్కని వేషధారణతో తిరునామం ధరించి ఉన్నారు. బహుశా నన్ను అభినందించుటకు ఏర్పాటు చేస్తున్నారనిపించింది. నేను వెళ్ళగనే చక్కగ గౌరవించారు, కూర్చొమ్మన్నారు. భజన నిమిత్తమై ఏర్పాట్లు చేస్తున్నారు. తరువాత అందరు కలిసి భజన చేసుకుంటూ స్వామివారి దర్శనమునకు వెళ్ళుటకు సిద్ధపడ్డారు. ఈ పూజారులందరూ తిరునామముతో, పంచెతో ఉత్తరీయము ధరించి ఉన్నారు. కల చెదిరింది. ఈ కల నాకు ఉదయం 5 గంటల ప్రాంతమున వచ్చింది. దీనర్థం : ఎవ్వరైతే భక్తితో, ఆత్రుతతో నిరంతరం స్వామి భజన చేస్తారో వారు తప్పక స్వామిని చేరగలరని భావించాను.

ఇదేరోజు ఆస్టిన్ నగరము నుండి ప్రయాణించి సన్ ఆంటోనియో నగరమునకు రివర్ వాక్ కొరకై పోయాము. ఆ నగరాన ఉన్న ముఖ్య ప్రదేశములు చూచిన తరువాత ప్రత్యేకంగ తీర్చిదిద్దిన ఒక నది ప్రక్కన ఉన్న విశాలమైన ప్రాంతమున కూర్చున్నాము. ఆ నదికి ఇరుప్రక్కల మంచి సుందరమైన కట్టడములు ఉన్నవి. ఇది ఒక ఎంటర్టైన్మెంట్

స్థలము, ప్రత్యేకంగ తీర్చిదిద్దారు. ఒక ముప్పై నలభై అడుగుల నది కాలువ ఈ స్థలము మధ్యనుండి పోవునట్లు కట్టారు. ఈ నది పాయకు ఇరువైపుల జనాలు నడుచుటకు వీలుగ ఒక ముప్పై అడుగుల వెడల్పుతో కారిడార్లు వీటికి ఒక వైపు షాపులు హోటల్స్ ఉన్నవి. రెండవ వైపు జనాలు కూర్చుండుటకు వీలుగ స్టేడియం మాదిరి చాల ఎత్తు వరకు ఏటవాలుగ మెట్లు ఉన్నవి. ఎంతోమంది ఈ మెట్లపై కూర్చున్నారు. మేము కూడ ఒక దగ్గర కూర్చున్నాము. ఇంతలో మెట్ల మధ్య ఒక పది అడుగుల పైన ప్రత్యేకంగ తయారు చేసిన ఒక స్టేజి ఉన్నది. ఆ స్టేజి పైన చైనా ముఖ కవళికలు కలిగిన ఒక ఐదారుమంది కళాకారులు ఆ దేశపు సంగీతమును వాయిస్తున్నారు. అక్కడ కూర్చున్న జనాలు ఒకప్రక్క నదీ ప్రవాహము, మరోప్రక్క వినసొంపైన సంగీతమును ఆహ్లాదభరితంగ ఆస్వాదిస్తున్నారు. ప్రక్కన కావలసిన షాపులు, తినుబండారాలు ఎన్నో ఉన్నవి. కాబట్టి ఇష్టమైన తినుబండారాలను తినుచు సంగీతమును ఆస్వాదిస్తున్నారు. మేము కూడ అందరిలాగ కుర్చీలలో కూర్చొని సంగీతమును వింటున్నాము, ఆనందిస్తున్నాము. ఇంతలో నా మనస్సులో స్వామివారు మెదిలారు. నేను మాత్రమే చూడగలిగే ఈ క్రింది లీలను ప్రసాదించారు.

**లీల:** నేను తిరుమలలోని స్వామివారి పాదాల మాదిరిగ వారి రెండు పాదములను ఆ స్టేజిపై చూచాను. సంగీతము వాయించు వారి స్థానములో ఈ రెండు పాదాలను చూశాను. అవి పది పన్నెండు అడుగుల పొడవు కలిగి దాదాపు ఆరేడు అడుగుల వెడల్పుతో రెండు పాదాలు ఒకదాని ప్రక్కన మరోటి ఉన్నవి. అంతటి సైజు ఉన్న పాదాలను కలిగి స్వామివారు విరాట్ రూపంగ ఆకాశంలో నిలుచున్నట్లు భావన ఏర్పడింది. వారి పంచె మాత్రము గాలికి వారి పాదాలను తాకుచున్నట్లు అనుభూతి పొందాను. కొన్ని అడుగుల ఎత్తు నుండి ఈ పంచె వ్రేలాడుచున్నట్లు భావన ఏర్పడింది. మొత్తం మీద పెద్ద సైజులో ఉన్న ఆయన నల్లని పాదాలను చూచాను. భక్తులు వాటిని చూస్తున్నారు, ఆనందపడుచున్నారు. వీటిని చూస్తూ భోజనాలు చేస్తున్నారు.

వెంటనే నా హృదయములో ఒక భావమేర్పడ్డది. నేను కూడ ఈ రకమైన స్వామివారి పాదాలను తయారు చేయాలని, భక్తులు ఆయన పాదాలను చూచి తరించాలని, అందరూ ఆయన పాదాలను సేవిస్తూ, భజన చేయాలని అందుకు నేను బాధ్యత తీసుకోవాలనిపించింది. నా జీవితములో ఎప్పుడైన దీనిని సాధించాలనిపించింది. ఇంతే లీల. వెంటనే ఈ భాగ్యాన్ని ప్రసాదించుమని శ్రీవేంకటేశ్వరున్ని కోరాను.

**దీనర్థం:** ఎవ్వరైతే స్వామి పాదాలను ఆర్తితో భజిస్తూ సేవిస్తారో వారు స్వామిని చేరగలరు. ఒక రకంగ హరినామ క్షేత్రంలో స్వామి పాదాలను భజనలతో, కీర్తనలతో ఆనందంగ అర్చించేటట్లు వాతావరణాన్ని కల్పించుమని, దీనిని సాధించమని స్వామి ఆజ్ఞాపించారు. ఈ విధంగ హరినామ క్షేత్రములోని ముఖ్య ఘట్టమును తెలియజేశారు.

**నా దశ :** స్వామివారి పాదస్పర్శ భాగ్యమును, బలిచక్రవర్తి లాగ అనుభవించాను. స్వామివారి పాదాలను భజనలచే అర్చించే భాగ్యమును భక్తులకు కల్పించమని ఆదేశించారు. నాకు ప్రసాదించిన సేవలను చక్కగ చేయమన్నారు.

**భాగవత ఆశీర్వాదము :** తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించే సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.


తిరుమల శ్రీ వేంకటేశ్వరుని
దిశానిర్దేశము



స్వామివారి 700 దివ్యలీలలు
మొదటి సంపుటము
తెలుగు మరియు ఇంగ్లీష్ భాషలలో లభించును.
12 భాగాలు కల
పుస్తకము ధర : 250/-

ప్రచురణ: శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం
గోవింద దాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)
ఇ.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ - 500 007.
ఫోన్: 040-27175050 (10.00 am to 6.30pm)
website: srivenkatesham.org, mail: srivenkatesham@gmil.com

పై అడ్రస్ నుండి పుస్తకమును పొందవచ్చును. లేదా... పోస్టు / కొరియర్ ద్వారా పొందగోరువారు పుస్తకము ధరతో పాటు రూ. 50/- రిజిస్టర్ పోస్టు / కొరియర్ కొరకు కలిపి మొత్తం రూ. 300/- ఫోన్ పే, గూగుల్ పే, పేటిఎం ద్వారా 93482 12354 నంబర్‌కు పంపగలరు. మరియు మీ అడ్రస్‌ను ఇదే నంబర్‌కు వాట్సప్ / మెసేజ్ ద్వారా పంపి పొందవచ్చును.

శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం, హైదరాబాద్



శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**గోవిందదాసు** (పుల్లగూర్ల సాయిరెడ్డి)
ఇ.నెం.1-1-53, వీధి నెం.1. హబ్సీగూడ,
హైదరాబాద్. ఫోన్: 040-27175050, 93482 12354



# భక్త ప్రియత్వమే శ్రీవేంకటేశ్వర తత్త్వం

– శ్రీమతి
వెలమకన్ని
పద్మావతి

భక్తవశ్యత, భక్తానుగ్రహశీలత, భక్తప్రియత్వం – ఇవే శ్రీవేంకటేశ్వర తత్త్వం. తన భక్తుల కోసం పాచికలు ఆడాడు. వెట్టి చాకిరి చేసి దెబ్బలు తిని గడ్డం మీద అయిన గాయానికి పచ్చ కర్పూరం అదుముకొని తన భక్త ప్రియత్వం చాటుతున్నాడు. తిరుమలలో నిత్యమూ జరిగే సేవలలో – ఉత్సవాలలో పాటించే సంప్రదాయాలలో అడుగడుగునా తన భక్తులకు గుర్తింపు గౌరవం సముచితమైన శాశ్వత స్థానం కల్పించి తన భక్తానుగ్రహ శీలతను తెలియచేస్తున్నాడు.

తిరుమల కొండపై రాయిగానో, రప్పగానో జన్మించినా జీవితం ధన్యమవుతుందని గానం చేసిన కులశేఖరాళ్వారు పేరు మీదుగా తిరుమల లోని ఆనంద నిలయపు గడపకు ''కులశేఖరపడి''గా గుర్తింపు దక్కింది. కాశీ యాత్రకు వెళుతూ కూర్మడనే విప్రుడు తన భార్యా పిల్లలను తొండమాన్ చక్రవర్తి ఆశ్రయంలో వుంచగా, రాజు వారి విషయం మర్చిపోగా వారు విగతులైనప్పుడు తన భక్తుని తప్పు దిద్దడానికి వారిని సజీవులను చేశాడు. తన భక్తుడు చేసిన తప్పుకు శిక్షగా తాను భక్తులకు ప్రత్యక్ష దర్శనమివ్వననీ ప్రత్యక్షంగా మాట్లాడననీ దండన విధించుకుని తన భక్తుడైన తొండమాన్ చక్రవర్తిని బ్రహ్మహత్యా దోషం నుండి కాపాడాడు. చక్రవర్తికీ సుదాముడికీ జరిగిన యుద్ధంలో తాను సుదాముడి పక్షం వహించవలసి వచ్చినా తన భక్తుడికి తన ఆయుధాలైన శంఖు చక్రాలు ఇచ్చాడు.


తిరుమల ఆలయానికి పది మైళ్ళ దూరంలో ఉన్న పాపనాశన తీర్థం నుండి స్వామివారి తీర్థ కైంకర్యానికి శ్రద్ధగా జలాన్ని తెచ్చే తిరుమల నంబికి బోయవాని రూపంలో కనిపించి తాతా అంటూ పిలిచి ఆలయానికి సమీపంలో ఆకాశగంగ జలాలను సృష్టించాడు. తిరుమలనంబి (శ్రీశైలపూర్ణులు) చేసిన తీర్థ కైంకర్య సేవలకు ప్రతిగా ఈనాటికీ తిరుమలలో ఈ సేవలో వారి వంశీయులే పాల్గొంటారు. శ్రీవారు పురవీధులలో

ఊరేగినప్పుడు తిరుమల నంబి ఆలయం (దక్షిణ మాడ వీధిలో ఉత్తరాభిముఖంగా ఉంది) వద్ద తొలి హారతి అందుకొంటారు. తన మేనల్లుడైన భగవద్రామానుజుల వారికి రామాయణ రహస్యాలు వివరించడానికి తిరుమల నుండి అలిపిరికి వచ్చేవారు తిరుమల నంబి. అదే సమయానికి తిరుపతి నుండి అలిపిరికి వచ్చేవారు రామానుజుల వారు. ఈ బోధనలో మధ్యాహ్న పూజకు విఘాతం కలుగుతోందని చింతిస్తున్న తిరుమలనంబి కోసం శ్రీవారి పాదాలను అలిపిరి వద్ద వెలయింప చేశాడు స్వామి. అలిపిరి పాదాల మండపంలోని ''శ్రీపాదాలు'' ఇవే.



తిరుమల నంబికి శ్రీవారు బోయవాని రూపంలో ప్రత్యక్షమై ఆకాశగంగ జలాలను సృష్టించినందుకు గుర్తుగా ప్రతి సంవత్సరం ''ఆకాశ గంగ తీర్థోత్సవం'' జరుగుతుంది.దీనినే ''తన్నీరు ముదు ఉత్సవం'' అంటారు. ప్రతి సంవత్సరం వైకుంఠ ఏకాదశికి 11 రోజుల ముందుగా ప్రారంభమై 14 రోజుల తరువాత ముగిసేలా అంటే 25 రోజుల పాటు అధ్యయనోత్సవం జరుగుతుంది. ఈ ఉత్సవంలో తిరుమలనంబి వంశీయులు వెండి కలశాలతో ఆకాశగంగ తీర్థం తీసికొని రాగా స్వయంగా శ్రీవారు బంగారు శ్రీ పీఠంపై ఛత్ర చామర బాజా భజంత్రీలతో ఊరేగుతూ ఎదురేగి తీర్థ కుంభములకు హారతులతో స్వాగతం పలికి ఆలయంలో ఆ కలశాలను సమర్పిస్తారు. ఈ జలంతో శ్రీవారి పాదపద్మాలనూ, శఠారినీ అభిషేకించి ధూప దీప చందనాలతో అర్చిస్తారు. మిగిలిన కలశాలను శ్రీవారికి పానీయంగా నివేదిస్తారు. పిదప తిరుమలనంబి వంశీయులను అర్చకస్వాములు చందన తాంబూల పురస్సరంగా సత్కరిస్తారు. తిరుమలనంబి కోసం అలిపిరి వద్ద శ్రీపాదాలను సృష్టించిన శ్రీవారు, తన భక్తుడికి శ్రమ తగ్గించడానికి ఆకాశ గంగ జలాలను సృష్టించారు. ఉత్సవాల సమయంలో ఊరేగింపులో తిరుమలనంబి ఆలయం వద్ద ప్రథమ హారతి స్వీకరిస్తూ ఆకాశగంగ తీర్థోత్సవం ద్వారా తిరుమలనంబికి తిరుమల ఆలయ కార్యక్రమాలలలో ప్రాముఖ్యాన్నీ ప్రాధాన్యాన్నీ శాశ్వత స్థానాన్ని స్వామి కల్పించాడు. పరమ నిష్ఠాగరిష్ఠులైన పాండితీ ప్రకర్ష కలిగిన తిరుమల నంబినే స్వామి అనుగ్రహించాడు. పరమ పామరుడు మట్టితో కుండలు చేసికొనే తన భక్తుడైన భీముడు సమర్పించిన బంకమట్టి పూలను ఆర్ద్రంగా అందుకొని అనుగ్రహించాడు. మట్టిమూకుడులో పెట్టిన సంకటి తిని అతని ఆతిథ్యాన్ని స్వీకరించాడు. వైకుంఠవాసం ప్రసాదించాడు. ఆ కుమ్మరే ''కురువనంబి'' లేదా కురవతినంబి''. ఆ కురువనంబి పెట్టిన సంకటిని మట్టిమూకుడులో తిన్నందుకు గుర్తుగా ఆ భక్తుడి మీద ప్రేమకు చిహ్నంగా నేటికీ తిరుమలవాసుడు ''ఓడు'' (విరిగిన మట్టి కుండ)లో 'మాత్ర' (ఆవుపెరుగు అన్నం) ను ఆరగిస్తాడు. ఏయే రకాల నైవేద్యాలు ఎన్నెన్ని గంగాళాలు చేసినా అవన్నీ కులశేఖరపడికి ఇవతలే ఉంచి నైవేద్యం పెడతారు. కానీ ఓడులో ఉంచిన మాత్రాన్నం మాత్రమే ఆనందనిలయంలోని స్వామి వద్దకు తీసికెళ్ళి నివేదన చేస్తారు. పామరుడైన పరమభక్తుడు బంకమట్టిపూలతో తనను పూజించినందుకు నేటికీ తిరుమలలో కుమ్మరి భీమునికి జరుగుతున్న సన్మానమిది.

భగవద్రామానుజుల శిష్యుడైన అనంతాళ్వాన్ గురువు అనుజ్ఞతో తిరుమలకు వచ్చి భార్యతో సహా శ్రమకోర్చి నూతులు తవ్వి ఉద్యానవనాలు పెంచి పుష్పకైంకర్యం చేసేవారు. గర్భిణిగా ఉండి తట్టలతో మట్టి మోస్తున్న అనంతాళ్వాన్ భార్య శ్రమను పంచుకుందామని బాలుని రూపంలో వచ్చి సాయం చేస్తున్న శ్రీనివాసుడిని, ఎంత వారించినా వినడం లేదనే కోపంతో గడ్డపారతో గాయం చేశాడు అనంతాచార్యులు. గడ్డం మీద నుంచి రక్తం కారింది. ఆ గాయానికి తన భక్తుని ప్రేమకు




గుర్తుగా చక్కగా పచ్చకర్పూరం చుక్క ధరిస్తూ నేటికీ మనకు దర్శనమిస్తున్నాడు స్వామి. ఆలయ మహా ప్రవేశ మార్గంలో కుడివైపు గోడకు ఈ గడ్డపారను ఎత్తుగా అమర్చి భక్తుల సందర్శనార్థం వుంచారు. అనంతాళ్వాన్ పెంచిన నందనవనాన్ని రోజూ రాత్రివేళ వచ్చి లక్ష్మీ శ్రీనివాసులు పువ్వులు కోసి, వనాన్ని చిందర వందర చేస్తుంటే తట్టుకోలేక, ఒక రాత్రి కాపు కాసి వాళ్ళని పట్టుకోవాలని ప్రయత్నించి, స్వామి పారిపోగా అమ్మవారిని బంధించాడు. తన తప్పు తెలుసుకొని అమ్మవారిని బుట్టలో పూలతో పాటు ఉంచి తిరుమల ఆలయంలో స్వామివారికి సమర్పించాడు. ఈ సంఘటనకు గుర్తుగా నేటికీ కన్యామాసంలో జరిగే బ్రహ్మోత్సవంలో ధ్వజావరోహణం రోజుకు మరునాడు ఆలయానికి అప్రదక్షిణంగా శ్రీవారి ''బాగ్ సవారి ఉత్సవం'' జరుగుతంది. దీనినే పురిశై తోట ఉత్సవం అని కూడా అంటారు. శ్రీవారు ఒక్కరే ఆలయానికి అప్రదక్షిణంగా ఊరేగుతూ అనంతాళ్వానుల తోటకు వచ్చి పూజలందుకొంటారు. స్వామివారి పూలదండను అనంతాళ్వాను బృందావనం మీది

పొగడ చెట్టుకి సమర్పించి శఠారిని సమర్పిస్తారు. ఇలా మరోమారు తరువాయి వారం రోజున శ్రీదేవి భూదేవులతో ఆలయానికి ప్రదక్షిణంగా ఊరేగుతూ తోటకు వచ్చి పూజలందుకొని పుష్పమాలలు – శఠారితో బృందావనాన్ని సత్కరిస్తారు. ఈ రోజే గోదాదేవి జన్మదినం కావడం మరో విశేషం. ప్రత్యేక ఉత్సవాల సమయంలో ప్రదక్షిణ మార్గంలో ఊరేగుతున్నప్పుడు నైఋతి మూలలో అనంతాళ్వానుల ఇంటి దగ్గర ఆగి కర్పూరహారతి అందుకొంటారు శ్రీవారు. నేటికీ అనంతాళ్వాను వంశీయులు ఈ హారతి కైంకర్యాన్ని కొనసాగిస్తున్నారు. రామానుజాచార్యులవారి పాదాలు కల్గిన శఠారి పేరు ''అనంతాచార్యులు''. ఎంతటి సమున్నత స్థానాన్ని ప్రసాదించారో ఆ శ్రీవారు. భూమి మీద సంచరిస్తున్న శ్రీనివాసుడిని పుట్టలో తొలిసారిగా దర్శించిన గోపకుడికి (గొల్లవానికి), ఆ సంఘటనకు గుర్తుగా తిరుమలలో తొలి దర్శనం సన్నిధి గొల్లకు లభిస్తుంది. పుట్టలో ఉండగా తనకు క్షీరధారలు కురిపించిన గౌతమి ధేనువుపై అనుగ్రహ సూచకంగా సుప్రభాత సమయాన మేల్కొన్న వెంటనే ఆవు పాలను స్వీకరిస్తున్నాడు. గోమాత రూపాన్ని ధరించి వచ్చిన బ్రహ్మదేవునకు బ్రాహ్మీ ముహూర్తంలో తనను అర్చించుకొనే భాగ్యాన్ని, దూడగా వచ్చిన పరమశివునకు క్షేత్ర పాలకత్వాన్నీ ప్రసాదించాడు.

తనతో పాచికలాడిన పరమ భక్తుడు హాథీరాం బావాజీపై అనుగ్రహ సూచకంగా ప్రతిరోజూ శ్రీవారి ఆలయంలో సుప్రభాత సమయంలో గోక్షీర నివేదన, నవనీత హారతి జరుగుతాయి. మహంతు మఠం వారు అప్పుడే పితికిన ఆవు పాలను, అప్పుడే తీసిన వెన్న కల్గిన గిన్నెను, పచ్చకర్పూర తాంబూలాన్ని ఒక పళ్ళెంలో వుంచి పట్టు వస్త్రం కప్పి సుప్రభాత వేళ స్వామికి అందజేసే భాగ్యం వారికి కలిగించాడు స్వామి. సుప్రభాత సేవానంతరం తాళ్ళపాక వారు, తరిగొండవారితో పాటు మహంతు మఠం వారికి కూడా తీర్థ చందన శఠారి మర్యాదలు జరుగుతాయి. బావాజీవారి సమాధి పూజా ఉత్సవాలలో భాగంగా, వెన్న కృష్ణుని విగ్రహాన్ని ఊరేగిస్తూ వేణుగోపాలస్వామి ఆలయానికి ఊరేగింపుగా వెళతారు. ప్రతి సంవత్సరం ఈ ఊరేగింపుకు రెండు గొడుగులు,



రెండు ఏనుగులు మంగళవాయిద్యాలూ తిరుమల ఆలయం నుండి మహంతు వారిపై గౌరవ సూచకంగా పంపబడతాయి. ఇదే బావాజీకి శ్రీవారు ప్రసాదించిన గుర్తింపు. తన ఆంతరంగిక భక్తురాలైన తరిగొండ వేంగమాంబ ముత్యాల హారతి సమర్పణతో ఏకాంతసేవ ముగుస్తుంది. ఆలయ ద్వారాలు మూసివేస్తారు. తన తదనంతరం కూడా ఈ ముత్యాల హారతి కొనసాగేందుకుగాను తరిగొండ వేంగమాంబ తన చెల్లెలు కూతురగు మంగమ్మను దత్తత తీసుకుంది. నేటికీ వారి వంశీయులే ముత్యాల హారతిని తీర్మానపు హారతిగా సమర్పిస్తున్నారు.



స్వామిపై 32 వేల సంకీర్తనలు రచించిన అన్నమయ్య వంశం వారే సుప్రభాత సమయంలో మేలుకొలుపు పాట, రాత్రి పవళింపు సేవలో జోలపాట పాడతారు. అలాగే నిత్య కళ్యాణోత్సవం స్వామివారికి ఏర్పాటు చేసిన అన్నమయ్య వంశీకులే నేటికీ కళ్యాణోత్సవంలో కన్యాదాతగా గౌరవం, సత్కారం పొందుతున్నారు. తరిగొండ వారి హారతి – తాళ్ళపాక వారి లాలి అనే నానుడి తిరుమలలో వినిపిస్తూనే ఉంటుంది.

ఇలా స్వామి తన భక్తులందరికీ తిరుమల సేవలలో ప్రముఖమైన స్థానం కల్పించాడు. తన భక్త ప్రియత్వాన్ని చాటి చెప్పాడు.

**వైకుంఠ వా పరిత్యక్ష్యే న భక్తాం స్త్యక్తు ముత్సహే**
**మేతి ప్రియా హి మద్భక్తా ఇతి సంకల్ప వానసి**

వైకుంఠాన్నయినా వదలి ఉంటాను కాని నన్ను ఆశ్రయించిన భక్తులను మాత్రం ఒక్క క్షణమైనా విడిచి ఉండలేను – అని అర్థం. ఇదీ శ్రీవేంకటేశ్వర తత్వం.

# కులశేఖరాళ్వార్లు

– డా॥ కూర్మాచలం శంకరస్వామి - 9703268858

**శేషాద్రివాసం శరదిందుహాసం**
**శృంగార మూర్తిం శుభదాన కీర్తిం**
**శ్రీ శ్రీనివాసం శివదేవ సేవ్యం**
**శ్రీవేంకటేశం శిరసా నమామి**
**లోకాంతరంగం లయకార మిత్రం**
**లక్ష్మీ కళత్రం లలితాబ్జనేత్రం**
**శ్రీవిష్ణు దేవం సుజనైక గమ్యం**
**శ్రీవేంకటేశం శిరసా నమామి**

శ్రీమహావిష్ణువు దశావతారాలలో నాలుగు అవతారాలు ప్రధానమైనవి. భక్త జనులకు అత్యంత ప్రీతిపాత్రమైనవి. అందులో మొదటిది కృతయుగంలో నరసింహస్వామి అవతారం. రెండవది త్రేతాయుగంలో శ్రీరామావతారం. మూడవది ద్వాపరయుగంలో వాసుదేవుడు (శ్రీకృష్ణావతారం). నాలుగవది కలౌ వేంకటనాయకం. కలియుగంలో శ్రీవేంకటేశ్వర అవతారాలు భక్తకోటిని రక్షించే అవతారాలని స్కాందపురాణం, భాగవతం, భవిష్య పురాణాలు పేర్కొన్నాయి. అందులో శ్రీవేంకటేశ్వర అవతారం అత్యంత ప్రశస్తమైనదని తరిగొండ వేంగమాంబ శ్రీవేంకటాచల మాహాత్మ్యం పేర్కొంటున్నది.

శేషాద్రి శిఖరంపై కొలువుదీరిన తిరుమల మందిర సుందరుడైన శ్రీనివాసుడు సుమధుర కరుణాసాగరుడు. ఏడుకొండల వాడు తన భక్తులను ఎంతో జాలితో దయతో ఆదరిస్తాడు. ఆపద మొక్కులవాడిగా, వడ్డీకాసుల వాడిగా, అనాథ రక్షకుడుగా, అనాది నాథుడు, ఆది మధ్యాంత రహితుడైన ఆ ఆనంద నిలయుడు శ్రీవేంకటేశ్వరస్వామి భక్తకోటి జేజేలు అందుకొంటున్నాడు. కలియుగ ప్రత్యక్ష దైవంగా, కోరికలు తీర్చే కొంగుబంగారంగా పూజలందుకొంటున్న పురుషోత్తముడు శ్రీవేంకటేశ్వరుడు.

అనంతాళ్వారులను, తిరుమలనంబిని, ఆత్మారాముణ్ణి, అన్నమయ్యను, తరిగొండ వేంగమాంబ మొదలగు భక్తులను కరుణించి మోక్షము ప్రసాదించిన మోహన రూపుడు శ్రీవేంకటేశ్వరుడు. అట్టి దయా సముద్రుణ్ణి శ్రీకృష్ణదేవరాయలు ఏడు మార్లు స్వయంగా దర్శించుకొని స్వామివారి కృపకు పాత్రులైనారు. లోకాంతరంగుడైన శ్రీవేంకటేశ్వరుని కృపకు పాత్రులైన వారిలో కులశేఖర ఆళ్వారులు ఒకరు.



**"కుమ్భే పునర్వసాజాతం**
**కేరళే చోళ పట్టణే**
**కౌస్తుభాంశం ధరాధీశం**
**కులశేఖర మాశ్రయే"**

కేరళ దేశంలో కొల్లి పట్టణము రాజధానిగా చోళరాజు ధృఢవ్రతుడు అను మహారాజు ఉండేవాడు. అతడు గొప్ప వైష్ణవ భక్తుడు. నిరంతరం హరి ధ్యానం చేసేవాడు. అతడు సంతానార్థం శ్రీవారిని ఆరాధించగా కలియుగంలో 28వ పరాభవ నామ సంవత్సరం, మాఘమాసం, శుక్రవారం, శుక్లపక్షం, పునర్వసు నక్షత్రం ద్వాదశి శుభ ఘడియలందు శ్రీమన్నారాయణుని కౌస్తుభాంశ తోటి ఒక బాలుడు అవతరించాడు. అతని గుణములను బట్టి మరియు వంశంలో శ్రేష్ఠుడవ్వాలని అతనికి కులశేఖరులని పేరిడి చిన్నతనంలోనే అతనికి రాజ్యభారం అప్పగించి ధృఢవ్రతుడు తపస్సు కోసం తపోవనానికి వెళ్ళాడు.

"ఘుష్యతే యస్యనగరే - రఙ్గయాత్రాదినే దినే
తమహం శిరసా వన్దే - కులశేఖర మాశ్రయే"

కులశేఖరులు చిన్నతనంలోనే రాజ్యభారము సిద్ధించినప్పటికీ ఏమాత్రం భయపడకుండా మంత్రుల సహాయంతో రాజ్యాన్ని చక్కగా పాలించాడు. తండ్రి లాగా కులశేఖరులు కూడా గొప్ప వైష్ణవ భక్తుడు. రాజ్యాధికారంలో ఎన్నో సుఖభోగాలున్నప్పటికీ వాటిని దరి చేరనీయకుండా అనునిత్యం ఆ శ్రీమన్నారాయణుని నామస్మరణలోనే మునిగి తేలేవాడు. తాను గొప్ప భాగవతోత్తముడే కాకుండా తన రాజ్యంలో గల భాగవతోత్తములను రావించి ఆ వైష్ణవ భక్తులను సేవించేవాడు. తనతోపాటు శ్రీరంగయాత్ర చేయాలని చాటింపు వేయించేవాడు. మార్గమధ్యంలో వైష్ణవ భాగవతులు ఎదురుపడగానే వారిని తోడ్కొని తిరిగి రాజ్యానికి వచ్చి వారిని సేవించేవాడు. దినే దినే అనగా ప్రతిరోజూ ఇలాగే జరుగుతుండేది.

అనునిత్యం భగవద్భక్తిలో మునిగి తేలేవాడు. వీరికి శ్రీరామచంద్రస్వామి అంటే అమితమైన భక్తి. ఇది గమనించిన మంత్రులు రాజాస్థానంలోనే భాగవత గోష్ఠిని ఏర్పాటు చేసి కొంతమంది పౌరాణికుల చేత నిత్యం రామాయణ పారాయణం చేయించే ఏర్పాటు చేశారు. అచంచల భక్తిపరుడైన కులశేఖరులు ఆ భాగవత గోష్ఠిలో పాల్గొని శ్రద్ధగా, తాదాత్మ్యం చెందుతూ శరీరం మనస్సు ఏకీకృతం చేసి వినుచుండెడివాడు.

ఒకనాడు పౌరాణికుడు రాముడు ఒక్కడే 14 వేల మంది ఖరదూషణాదులనే రాక్షసులతో యుద్ధం చేయుటకు ఉపక్రమించాడు అని చెప్పుచుండగానే వెంటనే కులశేఖరులు కోపోద్రిక్తుడై అయ్యో ఒక్క రామచంద్రునిపై ఇంతమంది రాక్షసులు వస్తున్నారని అతనికి అండగా నిలవాలని తన రాజ్యంలోని సైనికులను వెంట తీసుకుని అడవులకు వెళ్ళుచుండగా అది గమనించిన మంత్రులు రాజుకు భక్తి పిచ్చి పట్టిందని అతణ్ణి తిరిగి రాజ్యానికి తీసుకురావడానికి ఒక ఉపాయాన్ని ఆలోచించారు. "శ్రీరాముడు యుద్ధంలో ఖరదూషణాదులనే రాక్షసులను సంహరించి విజయంతో అయోధ్యకు తిరిగి వచ్చాడనే ఒక కల్పిత రాజపత్రాన్ని తయారు చేసి ఆ వార్తను భాగవతుల చేతికిచ్చి రాజుకు ఎదురుగా పంపించారు. ఆ వార్తను చదివిన రాజు ఎంతో సంతోషించి యుద్ధంలో నా రామయ్యకు విజయం కాక మరెవరికి దక్కుతుందని ఆనందంతో తిరిగి రాజ్యానికి వచ్చాడు.

మరొకనాడు ఇంకొక పౌరాణికుడు రాజు యొక్క భక్తి ఆవేశాన్ని గమనించకుండా సీతాపహరణ ఘట్టాన్ని వివరిస్తూ పంచవటిలో రామలక్ష్మణులు కొలువు దీరియుండగా బంగారు జింక రాగా సీతమ్మ కోరిక మేరకు శ్రీరాముడు లక్ష్మణులు వెళ్ళగా రావణుడు మాయారూపంలో వచ్చి ఒంటరిగా ఉన్న సీతను అపహరించి అనేక కష్టాలకు గురి చేస్తున్నాడని విని కులశేఖరులు సీతమ్మను కాపాడుతానని కరవాలము చేత బూని వేగంగా పరిగెత్తే అశ్వాన్ని అధిరోహించి సముద్రము వైపు వెళ్ళబోయాడు. అతని అమిత భక్తి ప్రపత్తులకు పరవశించి స్వయముగా శ్రీరాముడే సీతా లక్ష్మణ సమేతంగా అతనికి దర్శనమిచ్చి ఓ కులశేఖరా! ఆవేశపడకు. రావణుని సంహరించి సీతమ్మను తిరిగి అయోధ్యకు తీసుకు వచ్చానని ఇదిగో సీతమ్మ అని చూపించగా "హమ్మయ్య నా రామయ్య గాక మరెవరు గెలుస్తారని ఆనందభరిత వదనంతో అలాగే నిలబడి సీతారామలక్ష్మణులను చూస్తూ ఉండిపోయాడు. అతని పిచ్చి భక్తికి రాముడు కూడా ఆశ్చర్య చకితుడై "నాయనా కులశేఖరా ఏమిటి ఈ పిచ్చి భక్తి? లోకులంతా నిన్ను పిచ్చివాడిగా చూస్తున్నారని ప్రశ్నించగా, స్వామీ పాంచ భౌతిక సుఖాలపై వ్యామోహమున్న వాళ్ళకు నేను పిచ్చివాడిని, అనునిత్యం నీ ధ్యానంలో తరించే నాకు వాళ్ళు పిచ్చివాళ్ళుగానే కనిపిస్తారని కులశేఖరులు బదులివ్వగా అతన్ని ఆశీర్వదించి భగవంతుడు అంతర్ధానం కాగానే కులశేఖరులు తిరిగి రాజధానికి వచ్చాడు.

అనునిత్యం భాగవతోత్తముల సేవలోనే కాలం గడుపుతూ రాజ్యపాలనను పట్టించుకోని కులశేఖరులను పాలనవైపు దృష్టి మరల్చుటకు మంత్రులు ఆలోచించి కులశేఖరులు ఆరాధించే స్వామి మెడలోని హారాన్ని దాచిపెట్టి ఆ నిందను వైష్ణవ భక్తులపై వేసి వారిని రాజుకు దూరం చేయాలని ప్రయత్నించారు. కాని రాజుకు వైష్ణవ భక్తుల యందు అచంచల విశ్వాసము ఉన్నందున మంత్రుల మాటలు విశ్వసించకుండా తానే ఒక సత్య పరీక్షకు సిద్ధపడ్డాడు. ఒక కాలసర్పాన్ని తెప్పించి దానిని ఒక కుండలో పెట్టి మరొక హారాన్ని వేసి స్వహస్తాలతో ఆ హారాన్ని తీయాలని, దోషులను ఆ సర్పము కాటు వేస్తుందని, నిర్దోషులను ఏమీ చేయబోదని చెప్పగా వైష్ణవ భాగవతులు భయకంపితులు కాగా వారి బదులుగా కులశేఖరులే తన చేతితో సర్పము ఉన్న కుండలోంచి హారాన్ని బయటకు తీసి వైష్ణవ భక్తులు దోషులు కాదని నిందు సభ సాక్షిగా నిరూపించబడగానే మంత్రులు తాము చేసిన నిందారోపణలకు క్షమించమని కోరగా ధర్మాత్ముడైన రాజు వారు చేసిన పనికి క్షమించి వదిలేశాడు. వైష్ణవ భక్తులను అవమానించిన వారికి నరకలోక ప్రాప్తి కలుగుతుందని, వారిని పూజించిన వారికి స్వర్గలోకం లభిస్తుందని ప్రచారం చేయించారు. అత్యంత భక్తిపరులైన కులశేఖరులు తన రాజ్యాన్ని కుమారులకు అప్పగించి కొంతమంది వైష్ణవ భక్తులతో కూడి శ్రీరంగము చేరుకుని, నీళాదేవి అంశతో జన్మించిన తన కుమార్తె అయిన చేరకూరవల్లిని శ్రీరంగనాథునికి ధర్మపత్నిగా చేసి తరించారు. కులశేఖరుల నిష్కల్మష భక్తికి మెచ్చుకుని విశ్వాత్ముడైన శ్రీమహావిష్ణువు, కలియుగ దైవమైన శ్రీవేంకటేశ్వర స్వామి ప్రత్యక్షమై వరము కోరుకొనుమనగా "స్వామి సోపాన భూతస్థిత్వాహం" అనగా నిరంతరం నీ రూపాన్ని దర్శించుకునే ఆనంద నిలయంలో గడపగా ఉండే వరం కోరుకొనగా

స్వామివారు తథాస్తు అని అనుగ్రహించగా శేషాద్రిపైన ఆనంద నిలయంలోని ప్రధాన గడపగా మారాడు కులశేఖర ఆళ్వార్లు. ఇప్పటికి ఆ గడప కులశేఖర పడిగా ప్రసిద్ధి పొందుతోంది. అంతేగాక శ్రీరంగంలోని ప్రధాన ఆలయంలోని గడపకు కూడా కులశేఖర పడిగా ఇప్పటికే ప్రసిద్ధి పొందుతోన్న గొప్ప భక్తాగ్రేసరుడు కులశేఖర ఆళ్వారులు.

కులశేఖరులు దివ్యదేశములలో ఉన్న ఆలయాలను సందర్శించి అందలి ఆలయ దేవుళ్ళను సేవించాలనే కోర్కెతో వైష్ణవ గోష్ఠితో గూడి తీర్థయాత్రను కొనసాగించారు. ముఖ్యంగా శ్రీరంగం, తిరువేఙ్గడం (వేంకటాద్రి), అయోధ్య, చిత్రకూటము, తిరుక్కణ్ణపురము, చిదంబరం, కేరళలోని వారాహపురము, తిరువిత్తవక్కోదు మొదలగు దేశములు సందర్శించి ఆయా క్షేత్రాలలోని పెరుమాళ్ళపై అనేక పాటలు పాడారు. వీరు పాడిన 105 పాశురములను ''పెరుమాళ్ తిరుమెష్'' అనే దివ్య ప్రబంధముగా ప్రసిద్ధి పొందింది. ఇదే కాకుండా సంస్కృతంలో 40 శ్లోకాలతో కూడిన మరో దివ్య ప్రబంధం ముకుందమాలను రచించి బ్రహ్మదేశి పురాధీశుడైన శ్రీ రాజగోపాలుని సేవించుచు 67 సంవత్సరములు అచటనే యుండి పరమపదమును పొందిన పుణ్యచరితుడు కులశేఖరులు. వీరు రచించిన ముకుందమాల లోని శ్లోక పుష్పాలు మచ్చుకు కొన్ని.

**"శ్రీ వల్లభేతి వందేతి దయాపరేతి**
**భక్తప్రియేతి భవలుణ్ఠన కోవిదేతి**
**నాథేతి, నాగశయనేతి జగన్నివాసేతి**
**ఆలాపన ప్రతిపదం కురుమాం ముకున్ద"**

ముకుందుడు అనగా మోక్షాన్ని ప్రసాదించువాడు ఆ వాసుదేవుడు. మాల అనగా అర్చించే దండ. ఇక్కడ ముకుందమాల అనగా మోక్షానికి మార్గం చూపే శ్లోక పుష్పమాల అని అర్థం. ఈ 40 సంస్కృత శ్లోకాలు నిత్యానుసంధానం చేయవలసిన పవిత్రమైన శ్లోకాలు. ఇవి పరమాత్మకు అత్యంత ప్రీతిపాత్రమైనవి.


ఈ శ్రీవల్లభుడు వరాలిచ్చువాడని, అత్యంత దయాపయోనిధి అనగా సముద్రమంత దయ కలిగిన వాడని, భక్త జనులకు అత్యంత ప్రీతిపాత్రుడని, నాథులకే సనాతనుడని, సర్పాలను తల్పంగా ధరించువాడని, జగమంతా తన నివాసం కలిగిన వాడని, ఆ ముకుందుణ్ణి అనునిత్యం ఆలాపించాలని కీర్తించారు కులశేఖరులు.

**"జయతు జయతు దేవకీ నందోఽయం**
**జయతు జయతు కృష్ణా వృష్ణి వంశ ప్రదీప**
**జయతు జయతు మేఘశ్యామల! కోమలాఙ్గీ**
**జయతు జయతు పృథ్వీభారనాశో ముకున్ద!"**

ఈ శ్లోకం ముకుందమాలలో అత్యంత పవిత్రమైన స్తోత్ర పుష్పం. సాధారణంగా భగవంతుడు దర్శనమిస్తే నాకు ఇది కావాలని కోరుకుంటారు. కాని నిరాడంబర భక్తిభావ సంపన్నుడు కులశేఖరులు కాబట్టి తన గురించి కాకుండా దేవకీ వసుదేవుల తనయుడు, వృష్ణి వంశోద్ధారకుడు, నీలమేఘశ్యాముడు అయిన శ్రీకృష్ణ పరమాత్మకు నిత్యమూ జయం కలగాలని మంగళా శాసనం చేశారు కులశేఖరులు. అందుకేనేమో కలియుగ ప్రత్యక్ష దైవం, కరుణాసాగరుడైన శ్రీవేంకటేశ్వరుని కృపకు పాత్రుడైన భాగవతోత్తముడు కులశేఖరులు.

**"శ్రీచూర్ణ ఫాలం సుగుణాలవాలం**
**శ్రీ పుత్రితాతం శుకముఖ్యం గీతం**
**శ్రీ సుందరీశం శశిరాంతరంగం**
**శ్రీవేంకటేశం శిరసా నమామి"**

**జై శ్రీమన్నారాయణ**



**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా**

## గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు

## 76వ కళ్యాణం

తేది 10-01-2025, వైకుంఠ ఏకాదశి, శుక్రవారము రోజు జరిగింది. ఇది హబ్సీగూడ, కాకతీయనగర్‌లో, కాకతీయ రిక్రియేషన్ సెంటర్ లో సాయంత్రం జరిగింది. సాయంత్రం 6 నుండి 7 వరకు భజగోవిందం, 7.30 నుండి శ్రీనివాస కళ్యాణం జరిగింది. దీనిని కాకతీయనగర్, హబ్సీగూడ వాసులు నిర్వహించారు. వైఖానసాగమోక్తంగా, అన్నమయ్య కీర్తనల మధ్యన జరిగింది.



# ఆదర్శప్రాయుడు భీష్మాచార్యుడు

– చింతలపాటి
శివశంకర శాస్త్రి

శ్లో॥ "మేఘశ్యామం పీతకౌశేయవాసం – శ్రీవత్సాంకం కౌస్తుభోద్భాసితాఙ్గమ్
పుణ్యోపేతం పుణ్డరీయతాక్షం – విష్ణుం వందే సర్వలోకైకనాథమ్"

**'మఖ' నక్షత్రంతో కూడిన పూర్ణిమ గల మాసం మాఘమాసం. అఘం అనగా పాపం. పాపం నుంచి తొలగించే మాసం కనుక మాఘమాసమని అంటారు. శ్రీలక్ష్మీ నారాయణులకు, ఉమా మహేశ్వరులకు ఎంతో ప్రీతిపాత్రమైన మాసం.**

భారతదేశం ధర్మప్రధానమైన దేశం కనుక ఇక్కడ ధార్మిక పరమైన కర్మలకు ప్రాధాన్యత ఇవ్వబడింది. భారతీయ సనాతన ధర్మంలో మనం పాటించే సంప్రదాయాలు, ఆచారాలకు కార్యకారణ సంబంధం ఉంది. హైందవ సంస్కృతిలో నిర్వహించే ఆరాధనా ప్రక్రియలు అన్నింటా విశ్వశ్రేయోభావన, సమష్టి తత్వం అభివ్యక్త మవుతుంటాయి. భగవదారాధన, సామూహిక భక్తి చైతన్యం, ఐక్యతాభావన విశిష్ట పర్వదినాలలో ద్యోతకమవుతుంటాయి. ఆధ్యాత్మిక మార్గం వైపు అడుగులు వేయడానికి క్రమశిక్షణ, సత్సంకల్పం, క్షమ, దయ, దాన, శౌచం మున్నగునవి ఆచరించినప్పుడే పుణ్యప్రాప్తి కలుగుతుంది.

అన్ని జన్మల కన్నా మానవ జన్మ అత్యుత్తమమైనది. ఈ భరత ఖండంలో ఎందరో మహనీయులు పుట్టి, పెరిగి వారి విశిష్ట గుణాలతో జగద్విఖ్యాతమయ్యారు. వారు నడయాడిన ప్రదేశాలు, వారు బోధించిన దివ్యామృతాలు, వారి జీవన విధానం ప్రాతః స్మరణీయాలు. సాధువులు, సంతులు, ప్రబోధకులు, ఋషులు, మహర్షులు, కవులు, గాయకులు, పండితులు, పామరులు పాటించిన విలువలు, ఆచరించిన పద్ధతులు, సంస్కృతీ సభ్యతలు సదా ఆచరణీయాలు. వారు జన్మించిన ప్రదేశం ఏదైనా, పెరిగింది ఎక్కడైనా తమ విశిష్ట గుణాలతో విశ్వవ్యాప్తమవుతుంటారు. వారు చూపిన బాటలు నేడు – ఏనాడూ అనుసరణీయాలు. ఒక్కొక్కసారి వారి వారి జీవితాలలో జరిగిన సంఘటనలు నమ్మబుద్ధి కావు. పట్టుదల, కృషి, తామనుకునే ధర్మగుణాలకు బద్ధులై వారు సాగించిన జీవనయానం ఇతరులకు స్ఫూర్తిని కలిగింప చేస్తాయి.



మన భారత దేశంలో అలాంటి మహాత్ములు ఎందరో పుట్టి, పెరిగి, తమ సిద్ధాంతాలను ప్రజలకు అందించి సమాజాన్ని అశాంతి, అధర్మ మార్గాల నుండి కాపాడారు. సత్యానికి హరిశ్చంద్రుడు, దానానికి శిబి, బలి, దంతి, కర్ణులు, ధర్మానికి ధర్మరాజు, శ్రీరాముడు, భీష్ముడు మొదలైనవారు జాతి రత్నాల్లాంటివారు. అటువంటి వారందరూ మానవులందరికీ ఆదర్శప్రాయులయ్యారు. ధన్యజీవులయ్యారు.

మాఘమాస శుక్లపక్ష అష్టమి భీష్మాష్టమి. శుక్ల ఏకాదశి భీష్మైకాదశి. భీష్మాచార్యులు ముక్తి పొందిన రోజు భీష్మాష్టమి కాగా, ఆయన పంచక దినం భీష్మ ఏకాదశి అయింది. భారత



వీరాగ్రేసరుడు, ఆజన్మ బ్రహ్మచారి, మహాపరాక్రమశాలి అయిన భీష్మ పితామహుడు మాఘ శుద్ధ అష్టమి నాడు అస్తమించాడు. ఈ తిథిని భీష్మాష్టమి అన్నారు. ఈ రోజున భీష్మునికి తిలలు, జలంతో తర్పణం విడవాలి. ఒకవేళ తల్లితండ్రులు బతికున్నా తర్పణాలు ఇవ్వవచ్చు. ఈ దినమున తర్పణం విడిచి, శ్రాద్ధం పెట్టిన వారికి సుందరులు, గుణవంతులు అయిన సంతతి ప్రాప్తిస్తుందని హేమాద్రి గ్రంథంలో పేర్కొనబడింది.

**"మాఘమాసే సితాష్టమ్యాం సలిలం భీష్మతర్పణం**
**శ్రాద్ధంచ మే నరాః కుర్యుః తేస్యుః సంతతి భాగినః"**

అని పద్మపురాణ వచనం. అంతేకాదు మహాభారత వచనానుసారం మాఘమాస శుక్ల అష్టమి నాడు భీష్మునికి తర్పణం విడిచిన వారికి సంవత్సర కృత పాపం నశిస్తుందని చెప్పబడింది.

తిథులలో పదకొండవ తిథిని ఏకాదశి అని అంటారు. మనకు సంవత్సరంలో 24 ఏకాదశులు వస్తాయి. ఏకాదశి శ్రీమన్నారాయణునకు అత్యంత ప్రీతికరం. గంగతో సమానమైన తీర్థం, మాతృసమమైన గురువు, విష్ణు సమమైన దైవం, నిరాహారమును మించిన తపము, ఏకాదశిని మించిన తిథి లేదని పురాణాలు పేర్కొంటున్నాయి. ఏకాదశి విష్ణువుకు ప్రీతికరమైనందున 'విష్ణువాసరం' అని కూడా పిలుస్తారు. అయిదు కర్మేంద్రియాలు, అయిదు జ్ఞానేంద్రియాలు, మనసూ మొత్తం ఈ పదకొండింటి యందు భగవంతుని లగ్నం చేసి సేవించినవారికి తప్పక ముక్తి లభిస్తుంది. ఈ సత్యాన్ని తెలియజేసేందుకే ఏకాదశికి అంతటి ప్రాముఖ్యత కలిగింది.

మహాభారత వీధుల్లో మణిపూస భీష్ముడు. ఇంద్రియ నిగ్రహానికి, సత్యనిష్ఠకూ మారుపేరుగా నిలిచిన భీష్ముని గురించి తెలియని వారుండరు. భీష్మచరిత్రకు మహాభారతంలో సమున్నత స్థానముంది. ఎదురైన ప్రతి కష్టాన్నీ ఓ మెట్టుగా మలచుకున్న ధీరోదాత్తుడు. ధర్మాలన్నీ తెలిసిన మహానుభావుడు భీష్ముడు. ఉత్తరాయణ పుణ్యకాలం వరకు అంపశయ్యపై పరుండి తనువు చాలిస్తూ తన మరణ తిథిని పర్వదినంగా అనుగ్రహించమని శ్రీకృష్ణుని కోరాడు. ఆనాటినుండి మాఘశుద్ధ ఏకాదశిని 'భీష్మైకాదశి'గా పిలుస్తున్నారని నారద పురాణం చెబుతోంది. దీనికే 'జయ ఏకాదశి' అని మరోపేరు కూడా ఉంది.

భీష్ముడు హస్తినాపురానికి రాజైన శంతన మహారాజు కుమారుడు. పావన గంగానది ఇతని తల్లి. శంతన మహారాజు తమ కుమారునికి 'దేవవ్రతుడ'ని నామకరణ మొనరించి అల్లారుముద్దుగా పెంచుకోసాగాడు. యుక్తవయస్సు రాగానే భీష్ముడు దేవతల గురువైన బృహస్పతి దగ్గర శాస్త్ర, శస్త్ర విద్యను, పరశురాముని వద్ద అస్త్ర శస్త్ర విద్యలను అభ్యసించాడు. వసిష్ఠ మహర్షి వద్ద సకల విద్యలను అభ్యసించాడు. దేవవ్రతుడు (భీష్ముడు) ఎంతటి వీరుడో, అంతటి సదాచార సంపన్న ధార్మిక వ్యక్తి. యవ్వనుడైన దేవవ్రతుని శంతనుడు యువరాజుగా ప్రకటించాడు.

ఒక పర్యాయం శంతన మహారాజు వేటకు వెళ్ళి యమునా తీరంలో మత్స్యగంధి అనే ఒక నిషాద రాజు పుత్రిక అయిన సత్యవతిని చూసి మోహానికి లోనయ్యాడు. ఆ కన్య పరాశర మహర్షి వరప్రభావం చేత అపూర్వమైన రూప లావణ్యవతి అయింది. ఆమె

దేహం నుంచి వెలువడే సుగంధం ఒక యోజన దూరం వరకు ప్రసరించసాగింది. మత్స్యగంధి అందాలకు ముగ్ధుడైన శంతన మహారాజు ఆమెను తన భార్యగా చేసుకోవాలనుకున్నాడు. ఆ మత్స్యగంధి తల్లితండ్రుల వద్దకు వెళ్ళి మీ కన్యను నాకు ఇచ్చి వివాహం చేయమని అడిగాడు. రాజుగారి మన్ననను విని ఎంతో సంతోషించి తన కుమార్తె సత్యవతికి కలిగే కుమారునికి రాజుగా పట్టాభిషేకం చేయాలని షరతు విధించాడు. శంతనుడు అందుకు అంగీకరించక ఉదాసీనుడయ్యాడు. యువరాజుగా ప్రకటించిన దేవవ్రతుని దగ్గర నుంచి రాజ్యాన్ని, అధికారాలను లాక్కోవడం అనుచిత కార్యంగా భావించాడు. కానీ మత్స్యగంధిని మరువలేకపోయాడు. తత్ఫలితంగా రోగగ్రస్తుడయ్యాడు. తండ్రిగారి అనారోగ్యం, దానికి గల మూలకారణం దేవవ్రతునికి తెలిసింది. వెంటనే మత్స్యగంధి తల్లితండ్రుల దగ్గరకు వెళ్ళి మీ కుమార్తెను తన తండ్రికి ఇచ్చి వివాహమును జరిపించమని ఆమెకు పుట్టినవారే రాజ్యానికి రాజు కాగలడని, తాను ఎట్టి పరిస్థితుల్లోను రాజ్య సింహాసనం మీద కూర్చోనని, ఆజన్మాంతం బ్రహ్మచారిగానే ఉంటానని సమస్త దిక్కులు, దేవతల సాక్షిగా ప్రమాణము చేస్తున్నానని భీషణ ప్రతిజ్ఞ చేశాడు. తన తండ్రి కోరిక మేరకు అంతటి భయంకరమైన ప్రతిజ్ఞను గావించి సత్యవతితో తండ్రికి వివాహం జరిపించాడు. భీషణమైన ప్రతిజ్ఞ గావించి భీష్ముడయ్యాడు. కొడుకు త్యాగాన్ని చూసిన శంతనుడు భీష్మునికి స్వచ్ఛంద మరణాన్ని వరంగా ప్రసాదించాడు. మహారథిగా కీర్తిమంతుడయ్యాడు. ఒకేసారి పదకొండు వేల మంది విలుకాళ్ళు ఎదురొచ్చినా యుద్ధము చేయగల వీరుణ్ణి మహారథిగా పరిగణిస్తారు. ఆ వరం ఆధారంగానే రాజ్యపాలన అధికారం లేకపోయినా, కురుసామ్రాజ్య రక్షకునిగా మూడు తరాల పాటు నిలచి చివరకు కురుక్షేత్ర సంగ్రామం తర్వాత ఉత్తరాయణ పుణ్యకాలంలో తనువు చాలించాడు భీష్ముడు.

మాఘ శుద్ధ అష్టమి మొదలు ద్వాదశి వరకు గల అయిదు రోజులను భీష్మ పంచకమని అంటారు. అష్టమి నాడు ప్రాతః కాలముననే లేచి నిత్యకృత్యములు గావించుకుని నదికానీ, ఏదైనా ఒక జలాశయమునకు గాని వెళ్ళి అందు స్నానమాచరించి తిలలు, జలము తీసుకొని –

**"వైయాఘ్ర పదగోత్రాయ సాంకృత్య ప్రవరాయ చ**
**గంగాపుత్రాయ భీష్మాయ ఆజన్మ బ్రహ్మచారిణే**
**అపుత్రాయ జలందద్మి నమో భీష్మాయ వర్మణే"**

అని చెబుతూ తర్పణాలివ్వాలని ధర్మసింధువు అనే గ్రంథం నుడివింది. లోకహితం కోసం పాటుపడ్డ వారికి లోకమే సంతానం. పుత్రులు లేనివారికి తర్పణాలిస్తే సంతతి కలుగుతుందని శాస్త్రోక్తి. భీష్ముని సత్యనిష్ఠ అమోఘమైంది. ఎన్ని కష్టాలెదురైనా సత్యనిష్ఠకు దూరం కాలేదు. సత్యం కంటే ఏదీ గొప్పది కాదని భావించాడు.

''సత్యాన్నాస్తి పరో ధర్మః'' సత్యం కంటే గొప్ప ధర్మం లేదు. సనాతన ధర్మానికి మూల కారణం సత్య మే. సత్యానికి, ధర్మానికి అవినాభావ సంబంధం ఉందని ధర్మరాజుకి బోధించాడు. ఏది ధర్మం, ఏది అధర్మం అని నిర్ణయించడంలో ఆయన్ను మించినవారు లేరు. స్వయంగా శ్రీకృష్ణుడే ఆయన్ను మూర్తీభవించిన ధర్మంగా పేర్కొన్నాడు. ఆ జ్ఞాన సంపద ఆయనలోనే అంతరించిపోకూడదని, ముందు తరాలకు అందించాలని కృష్ణుడు భావించాడు.

యుద్ధరంగంలో ఆత్మీయులందరినీ కోల్పోయి విషాదంలో మునిగిపోయిన ధర్మరాజును వెంటబెట్టుకొని అంపశయ్యపై ఉన్న భీష్ముని వద్దకు వెళ్ళాడు. వర్ణాశ్రమ ధర్మాలు, రాజధర్మాలు, ఆపద్ధర్మాలు, మోక్ష ధర్మాలు, దానధర్మాలు, స్త్రీ ధర్మాలు – ఇలా సమస్త ధర్మాల గురించి ధర్మరాజుకు బోధింపచేశాడు. ధర్మరాజు సాధకుడు. పరిపక్వస్థితికి చేరిన సాత్వికుడు. సాత్వికునికి మరో భక్తుని చేత ఉపదేశం చేయించాడు. తాను అక్కడ ఉండి కూడా భీష్ముని చేత చెప్పించడం భగవంతుడు తన భక్తులకు ఎంతటి మహదవకాశాన్ని ఇవ్వగలడో అర్థమవుతుంది. అంపశయ్యపై ఉండికూడా విష్ణు సహస్ర నామంతో పరవశించిన భీష్మునికి మాఘ శుద్ధ ఏకాదశి తిథిని భగవానుడు భక్తునికి బహుమానంగా అందించాడు. అంతటి భక్తపుంగవునికి ఏ భక్తుడికీ లభించని అపూర్వమైన, అద్భుతమైన, అమోఘమైన వరాన్ని ప్రసాదించి మోక్షాన్ని కలిగింపచేశాడు. రోజులో పగటి సమయం, మాసంలో శుక్లపక్షం, సంవత్సరంలో ఉత్తరాయణం – ఈ మూడూ కాంతి మార్గాలని భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు తెలిపాడు. అంతటి పరమ ఘడియలు వచ్చేవరకు మరణం కోసం అంపశయ్యపై ఎదురు చూసిన భీష్ముడు అష్టమి నాడు పార్థివ శరీరాన్ని విడిచి వసులోకం చేరుకున్నాడు. భీష్ముని నోటివెంట వెలువడిన ఆ విష్ణు సహస్రనామ స్తోత్రతం సర్వదా మానవాళికి అవశ్యం పఠనీయం, ముక్తిదాయకం. విశ్వమే విష్ణువు, ప్రపంచమే ఉనికిగా కలవాడు. ఆ స్తోత్రంలోని ప్రతి నామమూ ఒక మంత్ర రాజమే. నామసంకీర్తనం చేసిన భక్తుల జన్మ సంసార బంధాలను తొలగించడానికి శ్రీమహావిష్ణువు ప్రభ విష్ణువుగా అవతరించి భక్తుల హృదయాలలో ప్రభగా (కాంతిగా) వెలుగొందుతాడు.

అపారమైన జ్ఞాన గరిమలో, అమేయమైన కృష్ణ భక్తితో సద్గురు లోకానికే ఆదర్శప్రాయుడైన భీష్ముని ఆదర్శంగా తీసుకొని ఆ మహానుభావుడు చూపిన మార్గంలో (ధర్మ మార్గంలో, భక్తి మార్గంలో) నడిచి మన జీవితాలను ధన్యం చేసుకుందాం.

**"శ్రీదః శ్రీశః శ్రీనివాసః శ్రీనిధిః శ్రీ విభావనః**
**శ్రీధరః శ్రీకరః శ్రేయః శ్రీమాన్ లోకత్రయాశ్రయః**
**వాసనాద్వాసుదేవస్య వాసితం భువనత్రయమ్**
**సర్వభూత నివాసోసి వాసుదేవ నమోస్తుతే"**

ధారావాహికం



# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

సాధు రావణా! అడవి లోని ఆడ ఏనుగుని గజరాజు వద్దకు చేర్చినట్లు నన్ను రామునితో చేర్చు.

**విదితః సహి ధర్మజ్ఞః శరణాగత వత్సలః ।**

**తేన మైత్రీ భవతు తే యది జీవితు మిచ్ఛసి ॥**

నీవు సుఖంగా జీవించాలనుకుంటే రామునితో స్నేహం చేసుకో. ఆ పురుషోత్తముడు మైత్రికి తగినవాడు. ధర్మజ్ఞుడు. శరణాగత వత్సలుడు అని ప్రసిద్ధి గాంచాడు. అలా స్నేహానికి సమ్మతింపవా చనిపోతావు. ఆ ఘోర మరణం రానివ్వకు.

పంచవటిలో సాధువేషంతో వచ్చాడు రావణుడు. అందుకే సాధు అని పిలుస్తోంది. రావణుడు దుర్మార్గుడు. దురభిమాని. శరణాగతికి అంగీకరింపడు. అహంకారం అడ్డొస్తుంది. అందుకే మైత్రి చేసుకో అంది సీతమ్మ. శరణాగతి చేస్తే రాముడు గొప్పవాడవుతాడు. స్నేహం చేస్తే ఇద్దరూ సములవుతారు. తాగు తిను రమించు సుఖించు అంటాడు రావణుడు. అది బతుకు కాదు. జన్మనిచ్చినవాడు పరమాత్మ. అతణ్ణి చేరడం మన గమ్యం. భగవత్ కళ్యాణ గుణ సంకీర్తనమ్ కర్తృత్వం భోగ్యత్వం. అదే ధ్యేయం. అదే గమ్యం.

మళ్ళీ అంటోంది మైథిలి. “రావణా! నన్ను రామునికి సమర్పించు. అది నీకు మేలు. ఇంద్రుని వజ్రాయుధం నిన్నేం చేయకపోవచ్చు. బహుకాలం యముడు నీ జోలికి రాకపోవచ్చు. లోకనాథుడు రాముడు ఆగ్రహిస్తే – రామ ధనుష్టంకారం త్వరలో వింటావు. రామలక్ష్మణ నామాంకితాలైన బాణాలు లంకలో పడతాయి. రాక్షసులందరినీ తునుమాడుతాయి. గరుత్మంతుడు సర్పాల్ని చిమ్మినట్లు – రామబాణం నిన్ను చంపేస్తుంది. రాముడు వస్తాడు. నన్ను తీసుకెళ్తాడు. జనస్థానంలో నీ సేనలు మట్టి కరిచాయి. అది నీ నాశనానికి నాంది. రామలక్ష్మణులు లేనప్పుడు వచ్చావు. వారి కంట పడివుంటే పెద్దపులుల వాసనకి కుక్క పారిపోయినట్లు – నువ్వు పరిగెత్తేవాడివి. నిలబడి వుంటే రాముడు అపుడే నిన్ను చంపేవాడు. ఇపుడు చావు మూడింది నీకు. కైలాసం (ఊర్ధ్వలోకాలకి) పోయినా వరుణుని (అథోలోకాలకి) సభకి పోయినా రామబాణం నిన్ను వదిలిపెట్టదు. పిడుగు పడ్డ చెట్టులా నేల కూల్చుతుంది నిన్ను”.

## రెండు నెలలు

విన్నాడు రాక్షసాధిపుడు. జనకరాజ సుతతో అంటున్నాడు. అతని స్వరంలో కాఠిన్యం గోచరించింది. “మగవాడు ఎంతగా బుజ్జగిస్తాడో అంతగా ఆడదానికి లోకువైపోతాడు. ఎంత ప్రియమైన మాటలు చెబుతాడో అంతగా అవమానింపబడతాడు. పరుగులు తీసే గుర్రాన్ని సారథి అదుపు చేస్తాడు. నీ మీది

కోపాన్ని నా కామమే అణచేస్తోంది. ఎవడు ఎక్కువగా ప్రేమిస్తాడో వాడిలో జాలి దయ స్నేహం వుంటాయి. నీ మాటలకి నిన్ను అవమానించాలి. చిత్రవధ చేయాలి. నీ కపట సన్యాసి వేషం నన్నాపని చేయనీయడం లేదు''.

అలా అన్నాడు కానీ కోపం కట్టలు తెంచుకుంది. ''సీతా! నీకు ఏడాది గడువు ఇచ్చాను. ఇక రెండు నెలలే మిగిలాయి. ఆ గడువు ముగిసేలోగా నీవు నా శయ్య మీదకి రావాలి. నాతో పడుకోవాలి. నన్ను భర్తగా ఒప్పుకోకపోతే నా వంట వాళ్ళు వస్తారు. నిన్ను తీసుకెళ్తారు. ముక్కలు ముక్కలుగా నరుకుతారు. నా ప్రాతఃకాల భోజనానికి సిద్ధం చేస్తారు'' – అలా బెదిరించాడు మైథిలిని.

రావణుని వెంట వచ్చారు దేవకన్యలు, గంధర్వకన్యలు. వాడి మాటలు విన్నారు. సీతమ్మని చూశారు. ఆ చూపుల్లో జాలి తొంగి చూసింది. బాధపడ్డారు వాళ్ళు. తక్కిన స్త్రీలు చూశారామెను. తమ పెదవులతో కన్నులతో ముఖాలతో సైగలు చేశారు. అవి జానకిని ఊరడించినట్లున్నాయి.

## సీతమ్మ కోపం

రాక్షసరాజుని చూసింది మైథిలి. అంటోంది ''నీవు ఇలా పాడుపనులు చేస్తుంటే ఒక్కడు నిన్ను అడ్డగించడం లేదు. ఈ లంకలో నీ మేలు కోరేవాడు లేడు. ఇది నిజం. నేను రాముని ధర్మపత్నిని. దేవేంద్రునికి శచీదేవి లాంటిదాన్ని. ముల్లోకాల్లో మనసులో కూడా నన్ను ఒక్కడూ కామించడు. నీవలా చేస్తున్నావు. నీది దుస్సాహసం. నన్ను నానా మాటలన్నావు. ఎక్కడికి పోయినా చావు తప్పదు నీకు. మదపుటేనుగుతో కుందేలు పోరాడినట్లు రామునితో పోరాడితే నీ గతి ఏమవుతుందో తెల్సుకో. నీ కళ్ళు నన్ను చూస్తున్నాయి. ఆ క్రూరమైన పాపపు కళ్ళు ఎందుకు రాలి పడలేదు? పాపకర్ముడా? ధర్మాత్ముడు రాముని భార్యను. దశరథుని కోడలిని – నన్ను కారుకూతలు కూశావు. నీ నాలుక చీలికలై పడలేదు ఎందుకు?

**అసందేశాత్తు రామస్య తపశ్చాను పాలనాత్ ।**
**నత్వాం కుర్మి దశగ్రీవ భస్మ భస్మార్హ తేజసా ॥**

''దశగ్రీవా! నా తపః ప్రభావంతో పాతివ్రత్య మహిమతో నిన్ను భస్మం చేయగలను. భస్మానికి అర్హుడవే నీవు. అయితే నాకు రామాజ్ఞ లేదు. బతికిపోయావు పో''. పాతివ్రత్య బలం దర్పం సీతమ్మని అలా మాట్లాడించింది. ఈ శ్లోకం రామాయణంలో ఒక రత్నం.

తనని తాను రక్షించుకోగలదు. ఆ శక్తి సీతమ్మకు ఉంది. భర్తే దైవం – అది పతివ్రత ధర్మం. అందుకే జనకరాజపుత్రి రావణుణ్ణి శపించలేదు. ఆ ప్రయత్నం విరమించుకుంది.

జీవుడు ఎప్పటికీ పరతంత్రుడు. సర్వస్వతంత్రుడు పరమాత్మ. భగవంతుడే ఉపాయం ఉపేయం అని నమ్మినవాడు జీవుడు. అందుకే స్వప్రయత్నం చేయడు. భారమంతా భగవంతునిదే అంటాడు. నీట ముంచినా పాల ముంచినా భారం నీదే అనే నానుడి వచ్చింది కూడా.

తపస్సు అంటే సన్యాసం తీసుకోవాలి. బంధాలు తెంచుకోవాలి. గడ్డం పెంచాలి. కాషాయ వస్త్రాలు కట్టాలి. రుద్రాక్ష తులసి మాలలు వేసుకోవాలి. దండ కమండలాలు ధరించాలి. అడవికి వెళ్ళాలి. ధ్యానించాలి. అది కాదు తపస్సంటే. సంసారంలో ఉండు. నీలో సంసారం ఉంచుకోకు అన్నాడొక మహానుభావుడు. నాది నాకోసం అనకు. నిరంతర భగవన్నామ స్మరణం చేస్తూ ఉండు. నిష్కామ కార్యాచరణ చాలు. నేను కాదు చేసేది. నా చేత భగవంతుడు చేయిస్తున్నాడు. అన్న కర్తృత్వాన్ని భోక్తృత్వాన్ని త్యజించాలి. సర్వప్రాణికోటిని ప్రేమించాలి. అదే తపస్సు. అపుడు పరమాత్మ రక్షకుడవుతాడు. ఇంకా బాగా చెప్పాలంటే కర్త కర్మ క్రియ సర్వమూ పరమాత్మే. అదే తపస్సు. సర్వం భగవదర్పితమే తపస్సు.

రావణుడు నరమాంస భక్షకుడా? కాదు. పానశాలలో హనుమంతుడు చూశాడు. రకరకాల జంతు మాంసాలున్నాయి. కానీ నరమాంసం కనిపించలేదు. సీతమ్మని బెదిరించటానికి అలా అని వుంటాడని భావించాలి.

మనలో మాట – రావణుడు మహా తపస్సంపన్నుడు. బ్రహ్మవర గర్వితుడు. వాడిని భస్మం చేసే శక్తి సీతమ్మకు వుందా? వుందని చెప్పాలి. హనుమంతుని తోకకు నిప్పు పెట్టారు. ఆ వార్త తెలిసింది మైథిలికి. శీతోభవ అంది. తోక కాలిపోలేదు. హతోభవం – దగ్ధోభవ అంటే రావణుడు దహింపబడేవాడు. అది ఆమె పాతివ్రత్య మహిమ. అదామె తపశ్శక్తి.

మళ్ళీ అంటోంది జానకమ్మ. ''నన్ను అపహరించడం నీవల్ల కాదు. విధి సంకల్పించింది. నన్ను ఎత్తుకుని వచ్చావు. ఇది నిజం. నీ చావు కోసం తెచ్చావు నన్ను. కుబేరుని తమ్ముణ్ణని, శూరుణ్ణని, అపార బలవంతుణ్ణని గొప్పలు చెప్పుకున్నావు. రాముణ్ణి దూరంగా పంపావు. భార్యా చౌర్యం చేశావు.

విన్నాడు రాక్షస రాజు. కన్నులు చింతనిప్పులైనాయి. ఉగ్రుడైనాడు. గుడ్లురిమి చూశాడు సీతను. వాడు నీలమేఘ శరీరుడు. పెద్ద పెద్ద భుజాలు. బలిసిన మెడ. సింహబలుడు, సింహగమనుడు. కళ్ళు నాలుక జ్యోతుల్లా ఉన్నాయి. కదులుతోంది కిరీటం. అంగరాగాదులు దాల్చినవాడు. ఎర్రని మాలలు వేసుకున్నాడు. ఎర్రని వస్త్రాలు ధరించాడు. మేలిమి భుజకీర్తులున్నవాడు. నల్లటి మొలత్రాడు, ఎర్రటి చెవుల కుండలాలు – సర్వాభరణాలతో అలంకరింపబడి ఉన్నాడు. వసంతుడా, కల్పవృక్షమా అన్నట్లున్నాడు. స్మశానంలోని మంటపంలా భయంకరంగా ఉన్నాడు. పాములా బుసగొట్టాడు. అంటున్నాడు మహాకోపావేశంతో.

సీతా! రాముడు నీతిలేనివాడు. ధనం లేనివాడు. రాజ్యం లేనివాడు. వాడే కావాలని వ్రతం పట్టావు. ఇంత మొండిదాన్ని ఇప్పుడే చంపాలని వుంది'' అన్నాడు. కాని చంపలేకపోతున్నాడు. కారణం ఆమె మీది వ్యామోహం. అక్కడున్న రాక్షస కాంతల్ని చూశాడు. ''ఈ జానకిని నాకు వశపడేటట్లు చేయండి. సామ దాన భేదోపాయాలతో ప్రయత్నించండి. కాకపోతే దండోపాయాన్ని ఉపయోగించండి. ఎలాగైనా ఈమెని లొంగదీసుకోండి అన్నాడు.

అపుడు ధాన్యమాలి వచ్చింది. రావణుణ్ణి కౌగలించుకుంది. ''మహారాజా! ఈ మనుష్యకాంత శోభాహీనురాలు. దీనురాలు. ఈమెతో నీకేం పని? దివ్య భోగాలనుభవించే రాత – బ్రహ్మ దేవుడు దీని నొసట రాయలేదు. తనపై ప్రేమ లేని దాన్ని కోరితే మగాడికి తాపమే మిగులుతుంది. కోరి వరించి వచ్చేదానితో సుఖం ఆనందం దక్కుతుంది. రాజా! రా నాతో! రమించు. సుఖించు'' అంది.

తర్వాత రావణుని పక్కకి తీసుకెళ్ళింది. విన్నాడు రావణుడు. అతని కోపం చల్లారింది. నవ్వాడు. తన భవనం వైపు నడిచాడు. దేవ గంధర్వ నాగ కన్యలు అనుసరించారు అతణ్ణి.

మనిషికి కోపం ఉండొచ్చు. దానికొక హద్దు ఉండాలి. హద్దు మీరితే ఒకర్ని చంపేంతగా ఉండరాదు. ఉంటే తన కోపమే తన శత్రువు అవుతుంది. విధి విచిత్రమైంది. దాని నడక ఇంకా విచిత్రమైంది. జీవితంలో ఎవరిని కలుసుకోవాలో, ఎవరితో విడిపోవాలో, మనతో ఎవరు ఉండాలో, ఎవరు ఉండరాదో ఆ విధి నిర్ణయిస్తుంది. సీతతో కలిసి ఉండాలని రావణుడు ఎంతగా గింజుకులాడాడో అంతగా దూరం చేస్తోంది ఆ విధి. అంతేకాదు సర్వనాశనం చేస్తుంది. కారణం వాడి కామం ధర్మవిరుద్ధం. సజ్జనులతో దుర్జనుడు మనలేడు.

## రాక్షసగణం

రెండు నెలలు గడువు అన్నాడు రావణుడు. మైథిలిని బెదిరించండి – అది రాక్షసరాజు ఆదేశం. వెంటనే రాక్షస స్త్రీలు వచ్చారు. సీతమ్మ చుట్టూ చేరారు. వాళ్ళు భయంకరంగా ఉన్నారు. నచ్చచెప్పడాలు, బెదిరింపులు, ఆగడాలు, ఆర్భాటాలు ప్రదర్శించారు. ఒక్కొక్కరు అంటున్నారు ఇలా.

ఏకజట – ప్రజాపతులు ఆర్గురు. అందులో పులస్త్యుడు ఒకడు. అతని మానసపుత్రుడు విశ్రవసువు. అతడు తేజస్సులో బ్రహ్మ సమానుడు. అతని కొడుకే రావణుడు. అరివీర భయంకరుడు. రాక్షసరాజు. లంకాధిపతి. అతనికి భార్యగా తగిన దానవు. నా మాట విను. ఒప్పుకో.

హరి జట – ముప్పయి మూడు కోట్ల దేవతలకి రాజు – దేవేంద్రుడు. అతణ్ణి, తక్కిన దేవతల్ని జయించాడు మా రావణుడు. మహావీరుడు. శూరుడు. శక్తి సంపన్నుడు. మహా పరాక్రమవంతుడు. అతనికి భార్యగా అర్హురాలివి. ఎదురు చెప్పకు. అంగీకరించు.

ప్రఘస – రాక్షసరాజుకి ఎందరో భార్యలు. అయితే అతని ప్రియురాలు మండోదరి. ఆ సౌభాగ్యవతిని విడిచేస్తున్నాడు. నిన్నే కావాలంటున్నాడు ఒప్పుకో.

వికట – దేవతలు, నాగులు, గంధర్వులు, దానవులు – తదితరులు ఎన్నోసార్లు ఓడిపోయారు రావణుని చేత. అంతటి వీరుడు నిన్నే కోరుతున్నాడు. భార్యగా ఇష్టపడవు ఎందుకు?

దుర్ముఖి – విశాలాక్షీ! మా రాజుకు సూర్యుడు భయపడతాడు. ఎక్కువ ఎండ కాయడు. వాయువు భయపడతాడు. ఎక్కువగా వీచడు. చెట్లు భయపడతాయి. పూలవాన కురిపిస్తాయి. రాజులకే రాజు మా రావణుడు. అంతటివాణ్ణి వద్దనకు. భార్యగా ఉండు. నీ మేలు కోరుతున్నాను. చెప్పింది విను. లేకపోతే బతికి బట్ట కట్టలేవు.

ఏం మాట్లాడలేదు సీతాదేవి. ఆమెకు మరింత దగ్గరగా చేరారు. 'నీవు మానవ కాంతవు. ఒక మానవునికి భార్య అనుకున్నావు. కాని వాణ్ణి చేరలేవు. అది అసాధ్యం. నీ మనసు మార్చుకో' అంది ఒకతె.

ఇంకొకతె అంటోంది – మంగళ స్వరూపిణీ! పూజ్యురాలా! నీవు కోరేవాడు రాజ్యభ్రష్టుడు. ఏ కోరికా తీర్చలేనివాడు. దీనుడు. వాణ్ణే కావాలంటావు. ఎంత తెలివి లేని దానవు?'

విన్నది సీత. కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. చూసింది వాళ్ళని. 'మీ మాటలు లోక విరుద్ధం. మనుష్య స్త్రీ రాక్షసునికి భార్య అవుతుందా? అది మీకు తోచటం లేదా? మీరు నన్ను చంపండి. తినండి. మీరు చెప్పినట్లు చేయను'.

**దీనోవా రాజ్య హీనోవా యోమే భర్తా సమే గురుః**

''దీనుడు కావచ్చు. రాజ్యహీనుడు కావచ్చు. నాకు భర్త ఎవరో అతడే గురువు. గౌరవింప తగినవాడు. సువర్చల సూర్యుణ్ణి – శచీదేవి ఇంద్రుణ్ణి – అరుంధతి వసిష్ఠుణ్ణి – రోహిణి చంద్రుణ్ణి – లోపాముద్ర అగస్త్యుణ్ణి – సుకన్య చ్యవనుణ్ణి – సావిత్రి సత్యవంతుణ్ణి – శ్రీమతి కపిలుణ్ణి – మదయంతి సౌదాసుణ్ణి – కేశిని సగరుణ్ణి – దమయంతి నలుణ్ణి అనుసరించారు. నేను రాముణ్ణి అనుసరిస్తాను.

శింశుపా వృక్షంపై ఉన్నాడు హనుమంతుడు. రావణుని బెదిరింపులు – రాక్షస మూకల మాటలు విన్నాడు. సీతమ్మని భయపెట్టడం చూశాడు. మెదలకుండా ఉన్నాడు. ఆకుల మధ్య దాగి ఉన్నాడు. అందరినీ చూస్తున్నాడు.

అంతలో మళ్ళీ బెదిరిస్తున్నారు రాక్షస స్త్రీలు. ఒక రాక్షసి పేరు వినత. వంకర టింకర కోరలు. ఎత్తైన పొట్టతో భయంకరంగా ఉంది. అంటోంది ''సీతా! నీ మగడిపై చూపిన ప్రేమ చాలు.

**సర్వత్రాతి కృతం భద్రే వ్యసనా యోప కల్పతే**

"అతిగా ఏదీ చేయరాదు. చేస్తే దుఃఖం కలుగుతుంది. నీ పాతివ్రత్యానికి సంతోషం. నీ మేలు కోరుతున్నాను. చెబుతున్నాను విను. రావణుడు సర్వ రాక్షసులకి రాజు. పరాక్రమం, రూపం, దాక్షిణ్యం, త్యాగం ఇంకా ఎన్నో గుణాలున్నాయి. రావణుణ్ణి భర్తగా పొందు. రాముడు మానవుడు, దీనుడు. వాణ్ణి వదిలెయ్. సర్వాభరణ భూషితవైపో. అగ్నిదేవునికి స్వాహా దేవిలా ఉండు. ఇంద్రునికి శచీదేవిలా ఉండు. రావణునికి దేవిగా ఉండు. నా మాట విను. లేకపోతే అందరం నిన్ను తినేస్తాం".

వికట అంటోంది — ఆ రాకాసి చన్నులు వేలాడుతున్నాయి. పొట్ట వేలాడుతోంది. చేతివేళ్ళు ముడిచింది. పిడికిలిగా చేసింది. గర్జించింది. భయం గొల్పేట్లు చూసింది. "నీకు బుద్ధి లేదు. నీ మాటలు విన్నాం. అన్నీ పనికిమాలినవే. ఏదో జాలి పడ్డాం. ఓర్చుకున్నాం. మైథిలీ! నీ మంచి కోరి చెబుతున్నాం. సముద్రం దాటి ఒక్కడూ రాలేడు. ఇది శత్రుభయంకరమైంది. ఇది రావణ రాజ్యం. గుర్తుంచుకో. సాక్షాత్ దేవేంద్రుడూ రాలేడు. నిన్ను రక్షించలేడు. ఇక ఏడుపు ఆపు. దీనంగా ఉండకు. నీవు బందీవి. మేం నీకు కాపలా. సీతా యవ్వనం శాశ్వతం కాదు. త్వరలో క్షీణిస్తుంది. అది నీకూ తెలుసు. యవ్వనం జారిపోకముందే రావణునితో రమించు. ఇక్కడ ఎన్నో తోటలున్నాయి. రావణునితో విహరించు. వేలకొద్దిగా ఉన్నాం మేం. నీకు పరిచారకులమవుతాం. నీ అధీనంలో ఉంటాం. నా మాటలు వినకపోయావో నీ గుండె చీల్చుతా. తింటా.

చండోదరి మరో రాక్షసి. కోపంతో చెలరేగింది. చేతిలో శూలం ఉంది. గిరగిరా తిప్పింది. అంటోంది. "సీతను చూశావా? జింకలా బెదురు చూపుల్తో ఉంది. రావణుడు ఎత్తుకు వచ్చినప్పుడు చూశాను. దీన్ని చూస్తూంటే నోరూరుతోంది. ఈమె యకృత్తు (గుండె కుడివైపు ఉండే మాంసం), ప్లీహం (గుండెకు ఎడమవైపు ఉండే మాంసం), గుండెను, అంత్రాలు (పేగులు), ఉత్పీతం (గుండె వైపు ఉండే మాంసం), తలని తినాలని కోరిక".

ప్రఘస అందుకుంది. "ఈ సీత క్రూరురాలు. ఊరికే చూస్తారేం? దీని గొంతు పిసికేద్దాం. చచ్చిందని రాజుగారితో చెప్పేద్దాం. అయితే తినేయండంటారు. అనుమానం లేదు".

అజాముఖి అంటోంది వెంటనే "దీని మాంసం కోసం గొడవ వద్దు. ముక్కలు ముక్కలు చేద్దాం. సరిసమానంగా పంచుకుందాం. తింటాం. త్వరగా మద్యం తెండి. నంజుకోడానికి పానీయాలు, లేహ్యాలు తెండి. విందు చేసుకుందాం".

మరో రాక్షసి పేరు శూర్పణఖ అంటోంది "అజాముఖి బాగా చెప్పింది. నాకు నచ్చింది. వెంటనే మద్యం తీసుకురండి. మానవ మాంసం తిందాం. నికుంభిలాదేవి (లంక పడమటి దిక్కున వుంది) ముందు నృత్యం చేద్దాం.

అలా భయంకరులు రాక్షస కాంతలు భయపెడుతున్నారు. ధైర్యం కోల్పోయింది సీతమ్మ. ఏడ్వసాగింది.

**(సశేషం)**



శ్రీ గోదా రంగనాథుల కళ్యాణోత్సవం సందర్భముగా...

## శ్రీ రంగనాథ స్వామి దేవాలయం

**(వానమామలై మఠానుబంధి), సికింద్రాబాద్**

**శరణుజొచ్చిన యెడల చిరకాలమున జనుల**
**కొరత బాపి వరములొసగు వీడు**
**హరిత వల్లభుడెపుడు మన తోడు నీడయై**
**భరితముగ కావునిక గరిమ మీరన్**
**సౌందర్యమావహించెను సరసిజనాభునిన్ నేడు**
**సారసదళ లోచనలిరువైపుల యుండన్**
**శరదిందు శీతలము మందహాసముననమర**
**సరళ శోభనల్ వెలయు శార్ఙ్గపాణిన్**

**- డా. మారంరాజు వేంకట మానస, హైదరాబాద్**

# పాపం - పుణ్యం

- ఎం. రాజ్యలక్ష్మి రంగాచార్య

పాపమంటే ఏమిటి? పుణ్యమంటే ఏమిటి? అన్న ప్రశ్నకు సమాధానం ఒక్కటే. పరులకు అపకారం పాపం – పరోపకారం పుణ్యం అని చెప్పవచ్చు. కారణం నువ్వు చేసే చెడు వల్ల ఎదుటివాడు బాధపడతాడు – నువ్వు చేసే మంచి వల్ల సంతోషిస్తాడు. ఎదుటివాడు నీ వలన పడే వేదననే నీకు పాపంలా పరిణమిస్తుంది. ఎదుటివాడి మోదమే నీకు పుణ్యమై రక్షిస్తుంది. ఈ పాప పుణ్యాలు రెండూ నీకు పురాకృతాలు. పూర్వం గత జన్మలోని కర్మఫలాలే మనకీనాడు సంప్రాప్తిస్తుంటాయి. జానకీదేవి అరణ్యంలో రామునితో నున్నప్పుడూ తాను పాపం చేశానని, ఆ పాపమే ఈ అరణ్యవాసమని ఊహకైనా అనుకోలేదు కానీ, శ్రీరాముడు మాయలేడికై వెళ్ళినప్పుడు వచ్చి అపహరించిన రావణాసురుని లంకలో బంది అయి ఉన్నపుడు మాత్రం 'అహో! మహోత్పాపం' అని తలపోసింది. ఈ రావణ చెర తాను చేసుకున్న పాపమేనని అనుకుంది. శ్రీరాముని నిందించలేదు. అత్తగార్లను ఆడిపోసుకోలేదు. తన కర్మలా భావించి అనుభవించింది.

లోకంలో అదృష్టవశాత్తూ అధికారులైన కొందరు తమను నమ్ముకొన్నవారికి, అన్ని అర్హతలూ ఉండి తమను ఆశ్రయించిన వారికి నమ్మబలికి మోసం చేస్తారు. డబ్బుల కక్కుర్తితో, అధికార వ్యామోహంతో స్వార్థానికి లోనై తమనే ఆశ్రయించిన వారిని వమ్ము చేస్తారు. అలా కొంతకాలం వారు పొందే లాభం కంటే పాపమే అధికంగా రౌరవాది నరకాలకు పోతారనడం నిస్సందేహం. నమ్మిన వారిని మోసం చేయడం మహాపాపం. అనృత దోషం వలన కలిగే కీడు అంతా ఇంతా కాదు. అందుకే మహాభారత యుద్ధంలో 'అశ్వత్థామ' చనిపోయాడని ఏనుగును ఉదహరించి అసత్యంగా ధర్మరాజుతో చెప్పమన్నా ధర్మం తప్పని మూర్తి అయిన ఆ ధర్మారాజు 'అశ్వత్థామ హతః నరోవా యా కుంజరోవా!' అని ద్రోణాచార్యునికి వినిపించేటట్లు పలకడం బట్టి చూస్తే అసత్యం వలన కలిగేది పాపమే అని ఖచ్చితంగా తెలుస్తుంది.

ఆవు – పులి కథలో పులికి ఆహారంగా ఇచ్చిన మాటమేరకు తిరిగి పులి వద్దకు ఆవు చేరుకోవడం, తన దూడకు చివరిసారిగా తన పాలను ఇచ్చి, ఆడిన మాట తప్పకుండా తన వద్దకు చేరుకున్న ఆవును చూసి పులి తనను చంపకుండా వదిలి వేయడమనే ఈ కథ కూడా పాప – పుణ్యాలను ఉదాహరిస్తుంది. సత్యంగా తిరిగి వచ్చిన ఆవును చూసిన పులికి తన క్రూరత్వమే మటుమాయమై దయాగుణం పొంగి, ఆవు తన సత్యాచరణతో పొందిన పుణ్యం వలన సంరక్షింపబడ్డట్లయింది.

పుణ్యమనేది ఒకే ఒక్క మంచి పని వలన సంప్రాప్తించేది కాదు. పాలలోని వెన్నలా, స్వచ్ఛమైన నెయ్యిలా నువ్వు చేసే అనేక మంచి పనుల సముదాయ ఫలితం. నీ జీవితాంతం మంచిని మాత్రమే ఆచరిస్తూ పుణ్యాన్ని ఆర్జించాలి. ఆ పుణ్యం నీ తరాల వారందరికీ దోహదం చేస్తుంది. నువు చేసే పాపపు పనుల వలన నీ వంశానికి చెడ్డపేరు కలుగుతుంది. ఏడేడు తరాల వారు నీ పాపం వలన శోకిస్తారు.

అందుకే లోకంలో మనకేం చెడు జరిగినా వెంటనే 'అయ్యో! పాపం!' అనే ఊత మాట వినిపిస్తుంది. అంటే చెడుకు కారణం మన పాపం – మన మంచికి కారణం మన పుణ్యం. అందుకే మనం ఇతరులకు ఏదైనా వాగ్దానం ఇచ్చేముందే మన శక్తి సామర్థ్యాలు ఆలోచించుకోవాలి. అప్పుడే మాటనివ్వాలి. ఆ మాట ప్రకారం నడుచుకోవాలి. నిత్యం బెల్లం అధికంగా తినే అలవాటున్న ఒక పిల్లవాడు తన తండ్రితో కల్సి స్వామి వివేకానంద వద్దకు వచ్చాడు. 'అయ్యా! నా కొడుక్కున్న నిత్యం బెల్లం తినే అలవాటును మానుకో అని చెప్పండి. మీలాంటి పెద్దలు చెపితే తప్పక వింటాడు' అంటూ తండ్రి వివేకానందుణ్ణి ప్రార్థించాడు. అప్పుడే వివేకానందుడు ఓ రెండు రోజులాగి రమ్మన్నాడు. ఈపాటి విషయానికి రెండు రోజులాగాలా? అని మనసులో అనుకున్నా తండ్రి చేసేది లేక "సరే! అలాగేనని రెండు రోజులాగి తిరిగి వచ్చి, మళ్ళీ వివేకానందుణ్ణి అదే విషయం అర్థించాడు. అప్పుడు వివేకానందుడు మరొక్కరోజు ఆగి రమ్మన్నాడు. తండ్రికి నిజంగానే కోపం వచ్చింది. ఒక్కమాటంటే ఒక్కమాట! నిత్యం బెల్లం తినడం పాడు అనే మంచి విషయం చెప్పటానికి స్వామీజీ ఎన్ని హొయలు పోతున్నాడనుకుని, శాంతం తెచ్చుకుని తిరిగి అబ్బాయిని తీసుకువెళ్ళి, ఒక్కరోజు ఆగి, మరునాడు మళ్ళీ తన అబ్బాయితో స్వామీజీ వద్దకు వచ్చాడు తండ్రి.

అప్పుడు స్వామీజీ ఆ అబ్బాయితో నవ్వుతూ "బాబూ! నిత్యం బెల్లం తినడం మంచిది కాదు" అని చెప్పాడు. ఇదే విషయాన్ని గమనిస్తున్న అక్కడి స్వామీజీ భక్తులు "అయ్యా! ఇదే ఒక్కమాట మొన్ననే చెప్తే పోయేది కదా!" అన్నారు అతి తెలివిగా. అప్పుడు వివేకానందుడు వారికిట్లా సమాధానమిచ్చాడు. "నాకు కూడా కొద్దిగా బెల్లం తినే అలవాటుండేది. దాన్ని ఈ రెండు మూడు రోజుల్లో పూర్తిగా మాన్పుకొన్నానని" అన్నాడు. అప్పుడు ఆ భక్తుల్లో జ్ఞానోదయమైంది. ఆచరణీయాత్మకమైన బోధనల ఫలితం అణిముత్యంలా ఉంటుందని, ఆ సత్యవాక్కు వలన పుణ్యం ఒనగూరుతుందని. అంటే పుణ్యం అనేది పాపం లాగా వెంటనే సంభవించేది కాదు. పాపం అనేది క్షణాల్లో చేయవచ్చు. ఆ పాపపు పని దావానలంలా ఒకే ఒక్క క్షణంలో విశ్వమంతా ప్రాకుతుంది. కానీ పుణ్యప్రచారం మెల్ల మెల్లగా జరుగుతుంది. చీకటి విస్తరించినట్లుగా వెలుగు విస్తరించదు. వెలుగు ముందు చీకటి మాత్రం ఓడిపోక మానదు.

అలాగే పాపపుణ్యాలు రెండూ సమాన లక్షణాలతో ఉన్నా పాపం భారం మాత్రం అంతా ఇంతా కాదు. మనల్ని సర్వత్రా సంరక్షించేది మన పుణ్యఫలమే. మన ప్రారబ్ధ కర్మలతో వెంబడించేది మన పాప ఫలితమే. అందుకే మనం జీవించినంతవరకు మన వలన ఏ ఒక్కరికీ ఇసుమంతైనా హాని కలగకుండా మనం వ్యవహరింపగలిగితే "అయ్యో! పాపం! నాకేం పాపం లేదే!" అనుకోవాల్సిందే.

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

వ్యాఖ్యాత : కె.వి.రాఘవాచార్యులు

వినా వేంకటేశం న నాథో న నాథః
సదా వేంకటేశం స్మరామి స్మరామి

## 339. కంసగ్రీవా నికృంతనాయ నమః

**-మేనమామ యగు కంసుని కంఠమును నరికినవాడు కృష్ణుడు.**


కంసుడు ఉగ్రసేనుని కుమారుడు. కృష్ణుని మేనమామ. ఇతడు పూర్వజన్మము నందు కాలనేమి అను రాక్షసుడు. ఈ జన్మలో కూడా అతడు రాక్షసునిగా ప్రవర్తించాడు. ఒకనాడు తన చెల్లెలు అగు దేవకిని వసుదేవునికి ఇచ్చి వివాహము చేసి ఆ వధూవరులను రథము మీద కూర్చుండ బెట్టుకుని తాను సారథియై ఉత్సాహముతో రథమును తోలుకొని పోవుచుండెను. ఆ సందర్భమున ఆకాశవాణి కంసుడా! నీ చెల్లెలి యొక్క ఎనిమిదవ సంతానము (కొడుకు) నిన్ను చంపును అని పలికింది. అంత కంసుడు మరణ భీతితో మనస్సు చలించగా దేవకిని చంపబోయినాడు. వసుదేవుడు పెక్కు విధముల వేడుకొనగా చెల్లెలిని చంపక ఆ దంపతులను చెరసాలలో బంధించాడు. ఆ కారణంగా దేవకికి పుట్టిన ఆరుగురు శిశువులను సంహరించాడు. దేవకి ఏడవ గర్భము ధరించి యుండగా యోగ మాయ ఆ గర్భస్థ శిశువును సంకర్షించి వసుదేవుని మరో భార్యయగు రోహిణి గర్భమున ప్రవేశపెట్టింది. రోహిణి యొక్క పుత్రుడే బలరాముడు. అతనికి సంకర్షణుడు అని పేరు కలదు. యోగమాయచే దేవకికి ఏడవ గర్భము దిగబడి పోయిందని తలంచి కంసుడు హూరుకున్నాడు. దేవకికి ఎనిమిదవ సంతానముగ కృష్ణుడు జన్మించాడు. అతడు జన్మించగానే వసుదేవుడు ఆ శిశువును అర్ధరాత్రే చెరసాల నుండి ఎత్తుకుని వచ్చి యమునా నదిని దాటి వ్రేపల్లెకు వచ్చి నందుని భార్య యశోదకు అప్పగించాడు. ఆ శిశువే యశోద తనయుడు కృష్ణుడుగా పెరిగి పెద్ద వాడయినాడు.

కంసుడు కృష్ణుని చంపదలచి మధురా నగరములో తాను నిర్వహించుచున్న అస్త్ర పూజా ఉత్సవమునకు రమ్మని ఆహ్వానించి, రామకృష్ణులను తీసికొని వచ్చుటకు అక్రూరుని కృష్ణభక్తుని పంపినాడు. వారికి అక్రూరుడు కంసుని దురాలోచనను చెప్పినాడు.

బలరామకృష్ణులు అక్రూరునితో మధురాపురి చేరినారు. వారు క్రీడాంగణమునకు వెళ్ళునపుడు ప్రవేశ ద్వారమున కువలయాపీడము అను మదపు టేనుగును ఉసికొలిపి దానిచే కంసుడు రామకృష్ణులను చంపదలంచినాడు. కృష్ణుడే కువలయా పీడమును చంపినాడు. తర్వాత కంసుడు చాణూర ముష్టికులతో మల్లయుద్ధము ఏర్పాటు చేసినాడు. ఆ ద్వంద్వ యుద్ధమున కృష్ణుడు చాణూరుని, బలరాముడు ముష్టికుని వధించినారు.

అంత కంసుడు తన సేవకులకు రామకృష్ణులను వసుదేవుని, నా తండ్రి ఉగ్రసేనుని హతమార్చుడని ఆజ్ఞాపించుచుండగా విని, కృష్ణుడు కోపముతో కంసుడు అధిష్టించి ఉన్న ఉన్నతాసనము మీదికి లంఘించినాడు. అప్పుడు సమయస్ఫూర్తి కలిగిన కంసుడు తన పాలిట మృత్యువైన కృష్ణుడు తన మీదికి వచ్చుచుండుట చూచి ఆసనము నుండి దిగ్గున లేచి, ఖడ్గమును డాలును చేత పట్టుకున్నాడు. అంతట ఖడ్గపాణి యైన కంసుడు కృష్ణుని చుట్టూ తిరుగుచూ అదును చూచి కృష్ణుని చంపుటకు ప్రయత్నించుచుండెను. వెంటనే కృష్ణుడు ఆ కంసుని ఒడిసి పట్టుకున్నాడు. అప్పుడు కంసుని కిరీటము క్రింద పడిపోయింది. అంతట కృష్ణుడు అతడు జుట్టు పట్టుకుని ఎత్తైన గద్దెపై నుండి రంగస్థలమున పడవేసి ఆ కంసునిపై దుమికినాడు. ఆ దెబ్బతో కంసుని ప్రాణములు గాలిలో కలిసిపోయినవి. అతని కళేబరమును కృష్ణుడు నేలమీద ఈడ్చినాడు. రంగస్థలమున వున్న ప్రజలందరు బిగ్గరగా హాహాకారములు చేసినారు. కంసుడు శత్రుభావముతో నిరంతరం కృష్ణ నామము స్మరించుచుండుటచే అతని ఆత్మ జ్యోతి స్వరూపముతో కృష్ణుని యందే లీనమయింది. కంసునికి సారూప్య మోక్షము ప్రాప్తించింది.

కంసుని వధించిన కృష్ణునిగ జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.



అన్ని నామాలూ నీవే అయిన
ఓ వేంకటేశా! నీకు నమస్కారము

## 340. ఉగ్రసేన ప్రతిష్ఠాత్రే నమః

**కృష్ణుడు కంసుని వధించిన పిమ్మట కంసుని తండ్రి యగు తనకు మాతామహుడగు ఉగ్రసేనుని రాజ్య సింహాసనమున ప్రతిష్ఠించినాడు.**

ఉగ్రసేనుడు వృష్ణి వంశములో ఆహుకుని కుమారుడు. కంసుని తండ్రి. మధురాపురికి రాజు. ఇతనిని చెరసాలలో బంధించి కంసుడు రాజయినాడు. కృష్ణుడు కంసుని వధించిన తరువాత చెరసాలలో ఉన్న దేవకీ వసుదేవులను, ఉగ్రసేనుని బంధ విముక్తులను చేసినాడు. కృష్ణుడు మధుర రాజ్యమునకు ఉగ్రసేనుని రాజుగా చేసినాడు.

ఉగ్రసేనుని సింహాసనమున ప్రతిష్ఠించిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 341. రత్నసింహాసన స్థితాయ నమః

**ద్వారకలో రత్న సింహాసనమున కూర్చున్నవాడు కృష్ణుడు.**

శ్రీకృష్ణుడు ద్వారకానగరమున సుధర్మ అను సభా మధ్యమున రత్నసింహాసనమును అధిష్ఠించి యున్నాడు.

బలరామ కృష్ణుల అవతార సమాప్తి తర్వాత అర్జునుడు ద్వారక నుండి హస్తినాపురమునకు వచ్చి ధర్మరాజును దర్శించినాడు. ఆ సందర్భమున ధర్మరాజు యాదవులందరి యోగ క్షేమములు విచారించి, దుఃఖితుడై కనిపించుచున్న అర్జునునితో సోదరా! అర్జునా! భక్తవత్సలుడు, బ్రాహ్మణుల హితము కోరువాడు, గో సంరక్షకుడు, ఆపదలో నున్నవారికి శరణు జొచ్చుటకు తగినవాడు, అధిపతి ప్రపంచమునకు క్షేమమును కూర్చువాడు, కొంగ్రొత్తగా వికసించిన పద్మ పత్రముల వంటి నేత్రములు కలవాడు, ద్వారకా నగరములో సుధర్మ అను సభా మధ్యలో నున్న రత్న సింహాసనము నందు కూర్చుని బలరామునితో సుఖముగ ఉత్సాహము గలవాడై యున్నాడా? అని అడిగినాడు.

## 342. కాలనేమి ఖల ద్వేషిణే నమః

**కాలనేమి యను దుష్టుడైన రాక్షసుడు కంసునిగా జన్మించాడు. కంస రూపమున వున్న దుష్టరాక్షసుడగు కాలనేమిని ద్వేషించినవాడు, వధించిన వాడు కృష్ణుడు.**

కాలనేమి తారక యుద్ధమున విష్ణువుచే సంహరింపబడినవాడు. ఇతడే మరు జన్మలో ఉగ్రసేనుని కుమారుడైన కంసునిగా జన్మించాడు.

ఖలుడైన కాలనేమిని ద్వేషించినవాడు, చంపినవాడగు కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

# తిరుప్పావై

**శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారు**

**గత సంచిక తరువాయి**



## 4వ పాశురము

**ఆళిమళై క్కణ్ణా ఒన్రు నీ కైకర వేల్**
**ఆళియుళ్ పుక్కు ముగన్దు కొడు ఆర్తేఱి**
**ఊళిముదల్వనురువమ్బోల్ మెయ్ కఱుత్తు**
**పాళి ర్దోళుడై ప్పఱ్పనాబన్ కైయిల్**
**ఆళిపోల్ మిన్ని వలమ్బురి పోల్ నిన్ద దిర్ న్దు**
**తాళాదే శార్ఙ్గ ముదైత్త శరమళై పోల్**
**వాళ వులగినిల్ పెయ్ దిడాయ్ – నాఙ్గళున్**
**మార్గళి నీరాడ మగిళ్ న్దేలో రెమ్బావాయ్!**

తాత్పర్యము – ఈ వ్రతమున ప్రవేశించిన వారికి దేవతలందరునూ తమ సేవలనందించెదరు రండి! ముందుగ వానదేవుని కలుసుకుందాము. గంభీర స్వభావము కల వర్షములకు అధి దేవతయైన ఓ పర్జన్యుడా! నీవేమీ వెనుదీయకుము. గంభీర సాగరము లోపలిదాక మునిగి నీటినంతా గ్రహించి, గర్జించి ఆకసమంతటా వ్యాపించి, సృష్టికి ఆదికారణుడైన శ్రియః పతి యొక్క శరీరము వలె నల్లని శరీరివి కమ్ము. ఆపై విశాల సుందర హస్తుడైన పద్మనాభుని కుడిచేతిలోని శ్రీ సుదర్శన చక్రము వలె తళ తళ మెరిసి, వామహస్తమందలి పాంచజన్య శంఖము వలె లోకములు అదురునట్లు ఉరమవలెను. ఆ వెంటనే స్వామి చేతిలోని శ్రీ శార్ఙ్గమనెడి ధనుస్సు విడిచిన శరవర్షమా! అనునట్లు లోకములు సుఖించునట్లు అంతటా వర్షించుము. అంతట మేమునూ ఈ మార్గశీర్ష వ్రతస్నానము నానందముతో చేతుము. ఇదియే కద మా వ్రతము.

విశేషార్థము – యుద్ధరంగంలో విరాట్ రూపాన్ని చూపాడు భగవానుడు. దేవతలందరూ తరించామని స్తుతించారు శ్రీకృష్ణుని. అతని కనుసన్నలలో మెలిగేవారు దేవతలంతా. అతని ప్రీతిని పొందడానికి వారెప్పుడూ ప్రయత్నిస్తారు. అతని భక్తులకు సేవ చేస్తే అతని మెప్పు పొందుట సులభమని వారికి తెలుసు. శ్రీకృష్ణ భక్తులైన గోపికలకు కొంతసేవ చేసి తరిద్దామని వరుణ దేవుడు వచ్చాడు. అతనికి ఎలా సేవ చేయాలో ఆండాళ్ వివరిస్తున్నది.

శ్రీకృష్ణ భక్తుల ప్రభావం చాలా గొప్పది. వీరికి దేవతలంతా ప్రణమిల్లుతారు. వీరి వద్దకు దైత్యులు రారు. వీరున్న చోట రాక్షసులు నశిస్తారు. శత్రువుల పీడ రాక్షసులని ఏమీ చేయలేదు. వీరు భగవన్నామ సంకీర్తన చేస్తారు కనుక ఆ శక్తి వీరికి లభిస్తుందని మాంగల్య వివృద్ధి స్తోత్రం, ధర్మశాస్త్రం తెలిపింది.

**'ద్రవంతి దైత్యాః ప్రణమంతి దేవతాః**
**నశ్యంతి రక్షాంసి అపయన్తి చారయః యత్ కీర్తనాత్...'**

అని. 'సర్వదేవతలకూ జీవులకూ భయమును పుట్టించే యమరాజు సైతము భగవద్భక్తుల వద్ద భయభక్తులతోనే మెలగును' అని శ్రీ పరాశర మహర్షి విష్ణుపురాణములోని అజామీళోపాఖ్యానంలో వివరించారు.

**"స్వపురుషం అభివీక్ష్య పాశహస్తం**
**వదతి యమః కిల తస్య కర్ణమూలే**
**పరిహర మధుసూదన ప్రపన్నాన్**
**ప్రభురహమన్య నృణాం నతు వైష్ణవానామ్ ||"**

పాశము ధరించి లోకము లోనికి బయలుదేరు తన భటుని పిలిచి రహస్యంగా చెవిలో 'పరమాత్మ నాశ్రయించిన ప్రపన్నుల జోలికి పోకండి. శ్రీకృష్ణ భక్తులను వదలివేయండి. అట్టి విష్ణుభక్తులను నేను శిక్షించదగినవాడిని కాను. వైష్ణవేతరులనే నేను శిక్షించగలను' అని తెలిపెనట. యముడే వీరి ప్రభావాన్ని ఇలా కీర్తిస్తే మిగిలిన దేవతలు చెప్పేదేమున్నది? అందుకే వరుణుడు వచ్చి సేవకు సిద్ధమైనాడు.

పెద్ద అధికారి మనమీద ప్రేమతో మనం కోరినదే తడవుగా మన ఇంటికి రావడానికి సిద్ధపడితే క్రింది యంత్రాంగమంతా మన ఇంటిలోని వసతులను సరి చేయడానికీ, ఆ అధికారి అనుగ్రహాన్ని పొందేందుకు మన చుట్టూ తిరుగుతారు కదా! సాక్షాత్తు శ్రీకృష్ణ పరమాత్మ ప్రసన్నుడై మన గోపికా జనానికంతటికీ ఆండాళ్ ద్వారా కోరిన పురుషార్థాన్నిస్తానన్నాడు కనుక, ఇక క్రింది యంత్రాంగమంతా తమ పదవులకు తగినట్టు సేవచేసి సత్తను పొందుదామని వస్తున్నారు. వారి ప్రతినిధిగా వరుణుడు వచ్చాడు. వీరికేమి కావాలో తెలుపమన్నాడు.

మన ధనుర్మాసం శ్రీకృష్ణ భగవానుని ప్రీతికై చేసే వ్రతం. తల్లి వేరుని తడిపితే మొక్క అంతా బ్రతుకుతుంది. అలానే జగత్తుకి మూలమైన శ్రీకృష్ణునికై ఏమి చేసినా అది లోకాలన్నింటినీ జీవింపచేస్తుంది. ఆ ఫలితం లోకులందరి క్షేమానికి అవుతుంది. 'కుచేలుడు రెండు పిడికెళ్ళ అటుకులిస్తే శ్రీకృష్ణుడు ఆరగించగానే లోకాలన్నీ తృప్తి చెందాయి. అలాగే మనం స్వామి ప్రీతికై ప్రేమతో, విశ్వాసంతో ఏ కొద్దిగా చేయగలిగినా' దానివల్ల భగవానుడు సంతసించి లోకానికంతకూ శ్రేయః పరంపరలను ప్రసాదిస్తాడు. ఆ భగవానుని యంత్రాంగమంతా కదులుతుంది. వాయువు అనుకూలంగా వీస్తుంది. వరుణుడు సకాలంలో తగినంతగా అవసరమైన పర్వత ప్రాంతాలలో వర్షిస్తాడు. అర్థాత్ ప్రకృతి అంతా అనుకూలమై కళ కళలాడుతుంది. లోకం సుఖించడానికి అదేకదా అవసరం.

భగవానుడే భక్తపరాధీనుడై వారి శాసనానికి లోబడి ప్రవర్తిస్తుంటే ఇక దేవతలు వారి ఆజ్ఞావశ వర్తులై ఉంటారని వేరే చెప్పాలా?

వచ్చిన వరుణదేవుని చూచి మన ఆండాళ్, అతని ఔదార్యాన్ని కీర్తిస్తూ 'మాకంటూ ప్రత్యేకించి ఏ సేవలూ అవసరం లేదు. శ్రీకృష్ణుని ఆనందమే మా ఆనందం. స్నానవ్రతం చేయాలని ఆజ్ఞ. దానికి సమృద్ధిగా నీరు కావాలి. అది తగినంతగా నీవు ఇస్తే మేము స్నానమాడుతాం. ఊరివారందరికీ నీటి సమృద్ధి ఏర్పడుతుంది. పంటలు పండుతాయి. అప్పుడు మా స్వామి ఆనందిస్తాడు. నీవాయనను ఆనంద పరచినవాడవవుతావు. కనుక అనుకూల వర్షాలు కురిపించు' అని ప్రార్థిస్తుంది.

వీరంతా చిన్ని గోప కన్నియలు కదా! వరుణుడనే పేరు తెలియదు. ఆతని పనిని బట్టే గుర్తించి పిలుస్తున్నారు. మండలాకృతిలో వర్షించే మేఘాలకు ప్రభువైన ఓ వానదేవా! నీ పదవి ఉదాత్తమైనది. సృష్టి రచనను బ్రహ్మకు కేటాయించి, చల్లని ప్రేమతో ప్రీతితో మీకీ రక్షణ కార్యాన్ని ప్రాణికోటికి జీవనాధారమైన వర్షమునకు నిర్వాహకమునిచ్చాడు.

రాజసూయ యాగంలో శ్రీకృష్ణుడు బాధ్యతలిస్తూ కానుకలు పుచ్చుకునే విభాగాన్ని దుర్యోధనునికిచ్చాడు. అడిగినవి అందించే విభాగాన్ని కర్ణునికిచ్చాడు. కర్ణుడు ఉదారుడు, దాత కనుక. నీవూ అంతటి ఉదారుడవు వానదేవా! లోకుల పుణ్యాలను చూచి రక్షించుట, పాపాలను చూచి శిక్షించుట స్వామి పని. మరి నీవో! ఈ లోకుల పుణ్యపాపాలను చూచి వర్షించవద్దు. అందరికీ సమానంగా జీవనాన్ని అందించాలి. కురిపించడం నీ బాధ్యత కనుక కురియాలి. ఉపయోగించుకోవడం కురిసిన స్థానం యొక్క యోగ్యతను బట్టి ఉంటుంది. క్షేత్రంలో వర్షిస్తే పంటలనిస్తుంది. సముద్రంలో కురిస్తే ఉప్పు ఇస్తుంది. ఎడారిలో కురిసి ఆవిరవుతుంది. నిప్పుపై కురిస్తే ఆర్పివేస్తుంది. ఆ తారతమ్యాన్ని నీవు చూడవద్దు. దాపరికం వద్దు.

ఆండాళ్ ఈ పాశురంలో మేఘం వర్షించే క్రమాన్ని వైజ్ఞానికంగా, అందంగా, వర్ణిస్తోంది.

ముందుగా సాగరమందు ప్రవేశించి అట్టడుగున గల నీటి దాకా పూర్తిగా పానం చేయాలి. లోకాలన్నింటికీ ఇవ్వగలిగినంత నీరు నీవు త్రాగినప్పుడే కదా మాకు ఇవ్వగలిగినది.

ఉపమానముగా చెప్పబడేది ఉపమేయము కంటే గొప్పది కావాలి. భగవానుని పొగుడుతూ కవులంతా 'మేఘవర్ణుడా!' అంటారు. జ్ఞానం లేని, వర్షిస్తే తెల్లబడిపోయి కొంతమేర మాత్రమే వ్యాపించి అస్తమానమూ లేని మేఘంతో భగవానుని పోల్చడం, అతణ్ణి గౌరవించడం కాదు. అవమానించడం అవుతుంది. ఎముకలవలె తెల్లగా తోమిన పలువరుసవలె నీ కీర్తి, మేఘమును కృష్ణునితో పోల్చింది. అంటే అది ఎగతాళి దూషణ కదూ! ఆండాళ్ సవరించింది.

ఓ మేఘమా! నీటిని నిండుగా కల నీవు సృష్టికర్తగా ఉండే శ్రీకృష్ణుని దివ్యదేహం లాంటి ఛాయను పొందాలి. స్వామివంటి నీలికాంతులీనాలి. ఒక్కసారి ఆకాశమంత ఎత్తు నీవు ఎదగాలి. క్రింద వర్షిస్తే కొంతమేరకే తడుస్తుంది. మా వూరికే కాదు, లోకానికంతటికీ నీ లాభం కలగాలంటే ఎత్తు చేరాలి. మా శ్రీకృష్ణుని చేయి అడిగినవారికి అడిగినవన్నీ ఇచ్చి పెరిగిన సుందర బాహువు. దానికి అలంకారంగా ఉన్న చక్రం వలె ముందు నీవు మెరవాలి. సుదర్శనుడవు నీవు కావాలి. స్వామి ఎడమచేతిలోని శ్రీ పాంచజన్యము వలె ఘనమైన గర్జన చేస్తూ ఉరమాలి. ముందు ఉరమడం తదుపరి మెరవడం అంటారు లోకులు. కాదని అమ్మ చెబుతోంది. కాంతి వేగం ఎక్కువ కనుక ముందు మనకు అది

కనబడుతుంది. అదే క్రమాన్ని తెలుపుతోంది. అది వింటూ ఆర్తితో ఎదురు చూపే మా కోరికలు తీర, మా స్వామి శార్ఙమనే ధనుస్సు నుండి వెలువడే శరపరంపర వలె నీవు వర్షించాలి.

శరములు కొందరిని హింసిస్తాయి. నీవా పని చేయవద్దని మా ప్రార్థన. ఆ వాన కూడా పర్వతాల వద్ద సహ్యలలో కురిస్తే లోకాలకు వలయు నీరు అవసరానికి ఆదుకునే నదులై పారుతుంది. పంటలు పండుతాయి. మేము మా శ్రీకృష్ణునితో స్నానమాడ వచ్చినప్పటిదాక నీరుండును. మాతో కలిసి ఆయన స్నానమాడితే అప్పుడు నీకు కురిసిన ప్రయోజనం సిద్ధిస్తుంది. అట్లా వర్షించమన్నది ఈ పాశురంలో.

సముద్ర జలాలను పీల్చి రుచికరమైన రీతిలో వర్షించే మేఘమే జ్ఞాని అయిన ఆచార్యుడు. శాస్త్రము, భగవంతుడనే సముద్రంలో మునిగి, తత్వత్యాన్ని, గుణాలను గ్రహించి. ఉన్నత పీఠాన్ని అధిరోహించి, భగవంతుని చిహ్నాలను ధరించి, శిష్య హృదయ తాపము బాపి, మనః కేదారముల ప్రేమ పంటలు పండునట్లు, ఆ శిష్యుల హృదయాలలో శ్రీకృష్ణుడు ప్రేమార విహరించునట్లు చేస్తాడు. ఆ ఆచార్యుడే భగవంతుని ప్రేమరూపం. అతడు విజ్ఞానమయుడు. అంతర్యామిగా వారిలో భగవానుడు ప్రకాశిస్తాడు. ఆచార్య మేఘాన్ని ఆండాళ్ ఈనాడు ప్రార్థించింది అనుగ్రహించి వ్రతమును జరిపించమని.

## 5వ పాశురము

మాయనై మన్ను వడమదురై మైన్దనై
తూయ పెరునీర్ యమునై త్తుఱైవనై
ఆయర్ కులత్తినిల్ తోన్ఱుమ్ మణివిళక్కై
తాయైక్కుడల్ విళక్కం శెయ్ త దామోదరనై
తూయోమాయ్ వన్దు నామ్ తూమలర్ తూవిత్తొళుతు
వాయినాల్పాడి మనత్తినాల్ శిన్దిక్క
పోయ పిళైయుమ్ పుగుతరువా నిన్ఱనవుమ్
తీయినిల్ తూశాగుమ్ శెప్పేలో రెమ్బావాయ్

తాత్పరము – మనమీ వ్రతము నాచరించి ఫలమందుటకు మన పాపములడ్డు వచ్చునని భయపడవలదు. అందులకు కారణము మన వ్రతమునకు నాయకుడు శ్రీకృష్ణుడే. ఆతడు ఆశ్చర్యకరములగు గుణములు, చేష్టలు కలవాడు. ఉత్తర మధురా నగరికి నిర్వాహకుడుగ ఆవిర్భవించెను. నిర్మలమై గంభీరమైన జలము గల యమునా నది యొక్క తీరవాసియై మనకై గొల్ల కులమందవతరించి ఈ కులమును ప్రకాశింప చేసిన మంగళదీపము. మరియు తన పుట్టుకచే యశోదా గర్భమును కాంతివంతము చేసిన పరత్వము కలిగి కూడా ఆమెచే కట్టబడిన సులభుడు. కావున మనము సందేహములనే మలినములు లేక నిర్మలులమై, ఆతనిని చేరి చేతులారా నిర్మల హృదయ పుష్పాన్ని సమర్పించాలి. నోఱార పాడాలి. మనసారా ధ్యానము చేయాలి. ఆ వెంటనే నిల్వయున్న పాపరాశి, రాబోవు పాపరాశి కూడా నిప్పునబడ్డ దూదిపింజవలె భస్మమై మన వ్రతమున కడ్డు తొలగును. కనుక రండి భగవన్నామాన్ని చెప్పెదము.

విశేషార్థము – వేసవిలో దాహం కలవానికి వాతావరణంలో తేమ ఉన్నా దాహం ఆ తేమతో తీరదు. మేఘాల్లో నీరు నిలవ ఉంటుంది. అందదు. భూమి పొరల్లో ఉంటుంది. పైకి అందదు. కాలువలలో వర్షాలు పడినప్పుడే నీరుంటుంది. తరువాత ఉండదు కనుక వాటివల్ల కూడా అన్నివేళలా దాహం తీరదు. మరి ఆ దాహం తీరేదెలా? కాలువల్లో ఎప్పుడో నీరు వస్తే, చెరువులు త్రవ్వి నిలువ చేస్తే అది అవసరానికి ఆదుకొంటుంది. ఆ చెరువుల్లోంచి ఎన్నో అవసరాలకు వాడుకొంటారు. అసలు దాహమంటే? పంచభూతాలతో తయారైన శరీరంలో, జలమనే భూతం తగ్గితే దాన్ని పూరించుకోవాలని శరీరంలో కోరిక కలుగుతుంది. ఆ కోరికనే దాహమని, పిపాస అని అంటాము. నీరు పోస్తే పిపాస తగ్గుతుంది.

శరీరంలో జీవునికి కూడా అప్పుడప్పుడు దాహం వేస్తుంది. ప్రాపంచిక క్లేశాలవల్లనో, వాసనల వల్లనో అది కలుగుతుంది. ఏది సత్యం? నేనెవరు? నాకెవరు? ఇలాంటివి తెలుసుకోవాలనే కోరిక రూపంలో కలుగుతుంది ఆ దాహం. అది మామూలు జలం వల్ల తీరేది కాదు. మరి అది తీరేదెలా? జ్ఞానజలం పోయాలి. ఆ జ్ఞానజలం ఇచ్చేవారే జ్ఞానులైన ఆచార్యులు. అఖండ జ్ఞానానంద స్వరూపుడైన పరమాత్మ నుండి వారు, ఆ జలాన్ని తీసి ఇస్తారు. జిజ్ఞాస తీరుస్తారు. అలా జ్ఞానాన్ని యోగ్యత తెలిసి పంచనేర్చిన ఆచార్యుల కోసం చెరువుల్లో నీరు పట్టినట్టు భగవత్తత్వాన్ని ఆలయాల్లో అర్చామూర్తిగా ఉంచారు.

ఎక్కడిదీ అర్చామూర్తి? తేమ వాతావరణంలో అంతటా ఉన్నట్లు సమస్తమూ వ్యాపించి నిలిపే భగవద్రూపాన్ని 'పరవాసుదేవ' రూపమంటారు. అది కనబడదు. మేఘజలం అందనంత ఎత్తులో ఉంటుంది. అట్లే పరవాసుదేవుడే పాల్కడలిలో 'వ్యూహ'ముగా దిగుతాడు. అదీ మనకు అందదు. భూమిలోని నీటివలె ప్రాణులందరి హృదయాలలో దగ్గరగా ఉంటున్నా ఆ అంతర్యామి బొత్తిగా తెలియదు. వామన రామాది అవతారాలెత్తి ఈ లోకంలోకి దిగి వచ్చినా, వానాకాలపు కాలువల వలె, ఆనాటి వారికి ఉపకరించాయంతే. ఆ విభవావతారాలు తర్వాతి వారికి కన్పడవు. కానీ ఆ కాల్వల నుండి పుట్టిన చెరువుల నీరు, తరువాతి అవసరాలను ఆదుకొన్నట్టే, విభవావతారాలను ఆధారం చేసుకొని ఋష్యాదుల ద్వారా ఏర్పడ్డ అర్చామూర్తులే అన్ని కాలాలలోనూ దర్శనమిస్తూ ఆర్తుల అవసరాలు తీర్చుతాయి.

ఆకాశజలంలోని ప్రాణశక్తి, గ్లాసులోని నీటిలోనూ ఏ కొరతా

లేకుండా ఉన్నట్లే పరవాసుదేవుని జ్ఞానశక్తులు ఆలయాల్లోని అర్చామూర్తులకు కూడా పూర్ణంగా ఉంటాయి. ''పూర్ణమిదం పూర్ణమదః'' అనే శాంతి మంత్రం ఈ విషయాన్ని ధృవపరుస్తోంది. ఒక దీపం నుంచి వెలిగిన దీపాలన్నీ సమాన కాంతితో ఉంటాయి కదా! అలానే భగవన్మూర్తులన్నీ అఖండ జ్ఞానానందాలతో నిండి ఉంటాయి. విశ్వాసంతో కోరితే తప్పక అన్నీ ఇస్తాయి అని శ్రీ ఆండాళ్ ధనుర్మాసం ద్వారా దీన్ని నిర్ధారణ చేసింది లోకానికి.

మొదటి నాలుగు పాశురాలలో పర, వ్యూహ, విభవ, అంతర్యామి రూపాలను కీర్తించి ఇక ఈనాడు అర్చామూర్తిని ఎలా పిలవాలో, ఎంతవాడై ఇలా ఆలయాల్లోకి వస్తాడో, ఏ పేర్లతో కీర్తిస్తే మన సకల పాపరాశిని పటాపంచలు చేస్తాడో సమస్త పుణ్యఫలాలు ప్రసాదిస్తాడో ఆ రహస్యాన్ని బహిర్గతం చేస్తోంది శ్రీ ఆండాళ్.

ఇది స్నాన వ్రతం, దీని ఫలం శ్రీకృష్ణుని కృపా ప్రాప్తి, కోరిక కలవారంతా దీనికి అర్హులు. వారు రాగప్రేరితులై నిస్స్వార్థంగా కొన్ని నియమాలు పాటిస్తారు. కలిగే ఫలితాలను సకల శ్రేయస్సులనూ లోకులకే ఇచ్చేస్తారు. వ్రతం వల్ల లోకులకు అవి లభిస్తాయి. ప్రకృతి దేవతలు అలాంటి వారికి సదా తోడ్పడుతారు. గోపికలంతా ముముక్షువులు. నడవండ్రా అంతా అంటూ ఆండాళ్ అనగానే ఆ గోపకన్యకలకు కొన్ని సంశయాలేర్పడ్డాయి.

''దశరథుడంతటివాడు రామపట్టాభిషేకం సంకల్పిస్తే అది పాడైపోయిందే! 'శ్రేయాంసి బహు విఘ్నాని' అంటే అదే కదా! ఇక మనకెంత? మంచి పనులకెప్పుడూ ఆటంకాలెక్కువ. మన వ్రతం సాగునో లేదో' అన్నది ఒక గోపిక. ఇంకొకతె ఆమెను సమర్థించింది. ఒక ఉదాహరణ చూపుతూ...కొలనులో ఒక పద్మం ఉంది. దాని తేనె త్రాగి అందులో ఆదమరిచి నిదురించిందొక తుమ్మెద. రాత్రి కాగానే ముడుచుకుపోయింది పద్మం. ఆ తుమ్మెద అర్ధరాత్రి మేల్కొంచి జరిగిన దానికి చింతించి, తెల్లవారి పద్మము తెరచుకోగానే పోదామని ఎదురు చూస్తుండగానే ఒక ఏనుగు ఆ పద్మాన్ని తొండంతో పీకి నేలపై వేసింది. నీటిలోనుండి బయటికి విసిరివేయబడిన పద్మం ఇక సూర్యోదయమైనా తెరుచుకోలేదు. తుమ్మెద బయటకు రాలేదు. అనుకొన్నది ఒకటి, అయినది ఒకటి. మన గతీ అంతేనేమో...! అని ఆమె కూడా భయపడింది.

మరొకామె వేదాన్తం చదివింది. 'స్వామిని చేరితే పాపాలన్నీ అవే తొలగుతాయి' అని ధైర్యం పలికింది. 'మన పుణ్య పాపాలు చేరనిస్తే కదా' నాన్చింది ఇంకొకతె. 'అవును అవశ్యం అనుభవించవలసిందే' మరొకామె భయం ప్రకటించింది. వేదాన్తి చెప్తోంది 'పుణ్యపాపాలంటే? మనం చేసే పనులే, వాటివల్ల ఏవో పుట్టేవి కావు. స్వామి చెప్పింది చేస్తే వానికి కలిగిన ప్రేమే మన పుణ్యం. విపరీతంగా చేస్తే అతనికి కలిగే కోపమే పాపమంటే. చెప్పినట్లు చేద్దాం కోపం పోతుంది' అని ధైర్యం చెప్పింది.

వీరికి ధైర్యం చాలలేదు. 'స్వామిని చేరితేనే కదా ప్రేమ కలిగేది. మనం చేరలేమేమో!' అని నసిగింది మరొకామె. మన ఆండాళ్ లేచింది. 'పూర్తి నమ్మకంతో అతని నామం పాడితే చాలును. చేరాల్సిన పని లేదు. ఎన్నెన్ని పాపాలున్నా నిప్పులో వేసిన దూదిలా నశిస్తాయి. నామమే కదా ద్రౌపది మానాన్ని కాపాడింది. అంతేకాదు ప్రేమించినవారి కోసం పట్టనన్న ఆయుధం పట్టాడు. పగలును రాత్రిగా మార్చాడు. ఏమి చేయలేదు? శ్రీరాముడుగా తన కిరీటం వదలి, విశ్వసించిన విభీషణ, సుగ్రీవులకు కిరీటాలు పెట్టి అప్పుడు తాను కిరీటి అయ్యాడు. అనవసరమైన సంశయాలు మాని అతని గొప్ప నామాలు చెప్పండి. నడవండి' ప్రోత్సహించి ముందుకు నడిపింది. ఏవి ఆ నామాలు?

1.'మాయావీ!' అంటే ప్రకృతిని, జీవులను కలిపి సృష్టి చేసి రక్షించు ఆశ్చర్య శక్తి కలవాడా!

2.'ఉత్తర మధురానగర బలశాలీ!' అంటే పరమపదం కంటే ఈ ఊరిమీదే ప్రేమ. తనకి ఆటస్థలం కదా అని వామనుడు ఇక్కడే అవతరించాడు. మధురయే సిద్ధాశ్రమం. వికారాలు లేనివానికి పుట్టుక కలిగేటట్టు చేసింది ఈ వూరే. జైలులో చూపించుకున్నాడు తనని. పిల్లవానిగ పుట్టగానే తల్లిదండ్రుల సంకెళ్ళు ఊడదీశాడు. ఆయనని స్మరిస్తే మన కర్మ సంకెళ్ళూ తొలగిస్తాడు.

3.'పరిశుద్ధ జల యమునాతీర విహార రసికా!' జీవప్రవాహమే యమున, కాలమే దాని ప్రవాహం. అహంకారమనే కంసుని ఊరు, మనస్సనే మధుర ఇది యమునకు ఒక తీరం. రెండవతీరం నందవ్రజం. నందవ్రజం అంటే ఆనందమిచ్చు ఊరు. నందుడే ఆచార్యుడు. నందవ్రజమే జ్ఞానులైన గురువుల సన్నిధి. అక్కడ ఉండే స్వామి ఈ సంసారంలో తనని పిలిస్తే రక్షిద్దామని ఎదురు చూస్తుంటాడు. ప్రేమించిన జీవులే గోపికలు.

4.'నందవ్రజ మణిదీపమా! మణివలె సహజ కాంతి కలవాడు, ఉదారుడు, సులభుడు. పుట్టింది మధురే అయినా, లోకంలో ప్రకాశించింది నందవ్రజం నుండి. అంతటా ఉన్న భగవానుడు ఆచార్య కులాన్ని తన ప్రభావంతో ప్రకాశింపచేస్తాడు.

5.'మాతృగర్భ ప్రకాశ దామోదరా!' మంత్రమే మాత. అందు విహరిస్తాడు తల్లి ప్రేమకు రోట కట్టబడినట్లే, ఆచార్యుని జ్ఞానము ప్రేమ త్రాటిగ మారగ వారి హృదయాలలో కట్టబడి ఉండి, వారి సంబంధమే తన గుర్తింపుగా చేసుకుంటాడు.

ఈ అయిదు నామాలు మనం పరిశుద్ధులమై పాడుదాం. మనిషికి పరిశుద్ధి, స్నానాదుల వల్ల కంటె, పుండరీకాక్షుని నామ సంకీర్తన వలనే కలుగుతుంది. ప్రేమ నిండిన హృదయ పుష్పాన్ని ఎలాగో అలాగ స్వామి పాదాల చల్లి నోరార పాడుదాం. మనసారా స్మరిద్దాం. ఏది ముందైనా ఫర్వాలేదు. ఇక మనకి ఆటంకాలంటే భయం లేదు. అవన్నీ నిప్పులో పడిన దూది వలె నశిస్తాయి. మరి పలకండి. పలకండి. స్వామి నామాన్ని! అంటోంది ఆండాళ్.

# 6వ పాశురము

**పుళ్ళుమ్ శిలుమ్బినగాణ్ పుళ్ళరైయిన్ కోయిలిల్,**
**వెళ్ళై విళిశఙ్గిన్ పేరరవమ్ కేట్టిలైయో?**
**పిళ్ళాయ్! ఎళుందిరాయ్! పేయ్ ములై నంజుండు,**
**కళ్ళచ్చగడమ్ కలక్కళియ క్కాలోచ్చి,**
**వెళ్ళత్తరవిల్ తుయిలమర్ న్ద విత్తినై,**
**ఉళత్తుకొండు మునివర్ గళుమ్ యోగిగళుమ్**
**మెళ్ళవెళున్దు అరియెన్ర పేరవమ్,**
**ఉళ్ళమ్ పుగున్దు కుళిర్ న్దేలో రెమ్బావాయ్.**

తాత్పర్యము – ఈ అనుభవమును అందరితో కలిసి అనుభవించుట శ్రేయస్కరము గాన మిగిలిన వారందరునూ లేపి, వారితో కలిసియే అనుభవించెదము. ఒక్కొక్కరిని క్రమముగ లేపెదము రండు. తెల్లవారినదని పక్షులు కలకలలాడుచు కదలిపోతున్నవి సుమా! ఆ పక్షుల రాజైన గరుడునికి కూడా స్వామియైన శ్రీమన్నారాయణుని కోవెలలో, ఆరాధనా సమయమును సూచించు ప్రభాత శంఖారావము స్వచ్ఛముగా బిగ్గరగా రమ్మని పిలుచుచున్నది. ఏమమ్మా చిన్నపిల్లా వినబడుటలేదా? లేచిరావమ్మా. మేమెట్లు లేచివచ్చితిమో తెలియునా? పూతనా స్తనములందలి విషము నారగించి, దొంగబండిగ చంపదలచిన శకటాసురుని కీళ్ళూడునట్లు శ్రీపాదములు జాపిన మన శ్రీకృష్ణుడే, క్షీరసాగరమున ఆదిశేషునిపై యోగ నిదుర చేయు జగత్కారణుడని మన గోశాలలో ఉన్న మునులు, యోగాభ్యాస పరులు కూడా ఆ శ్రీకృష్ణుని తమ తమ మనస్సులలో అంతర్యామిగా చూచుకొనుచు ఆ మనస్సులోని స్వామికి శ్రమ తగలనట్లు మెల్లగా లేచి హరి హరి అని స్తోత్రము చేయగ వీరందరి గొంతులు పెద్ద ధ్వనియై మా మనసులలో చల్లగా ప్రవేశించి లేపివేసినది. ఇపుడు నీవును వింటివి గాన లేచి రావమ్మా!

విశేషార్థము – ధనుర్మాసం భగవంతుని యొక్క ప్రేమని పండించుకోవడానికి అత్యుత్తమమైన కాలం. జన్మ సార్థకం కావడానికి ఆచరించే ఉత్తమమైన అనుష్ఠానమే ఈ ధనుర్మాస వ్రతం. లోకంలో ఒక్కొక్క ఫలం ఒక్కొక్క దేవత ఇస్తుందని చెప్పిన సుబాలోపనిషత్ 'సర్వలాభాయ కేశవః' అంటూ కేశవుణ్ణి ఆరాధిస్తే అన్ని ఫలితాలు లభిస్తాయి అని చెప్పింది. అటువంటి కేశవుణ్ణి ఆరాధించే వ్రతమే స్నానవ్రతం. అతడే సాధనమని, ఫలము అతడేనని విశ్వసించినవారికి అన్ని శ్రేయస్సులు కలిగిస్తాడు. అతనిని అర్చామూర్తిగా ఉపాసించిన ఆండాళ్ వ్రత ఫలితాన్ని పొందింది. దీనికి ప్రధాన ఫలం కృష్ణానుగ్రహం. స్నానం అంగం నోము అనేది కేవలం వ్యాజం. ఇది యావజ్జీవం చేయదగింది.

పరశ్రేయస్సును సమృద్ధిని చూచి అసూయ చెందకుండా ఉండడమే యోగ్యత. తోటివారందరూ సుఖం పొందాలనే పరహిత చింత దీనికి ప్రధానం. పెద్దల హితవచనాలు వినడం, మననం చేయడం, ఆచరణలో పెట్టడంలో అభిరుచి ఉండాలి. వేదమార్గావలంబులై శిష్యుల హృదయ తాపాన్ని పోగొట్టే జ్ఞానులే కదా పెద్దలు. అటువంటివారి ద్వారా భగవానుని ఆశ్రయించుట తరించడానికి తేలికైన మార్గం. శ్రీకృష్ణునిచే ప్రేమించబడ్డ గోపికలను ముందిడుకొని స్వామి అనుగ్రహాన్ని పొందగోరినది ఆండాళ్. వ్రతానికి పూర్వరంగం అంతా సిద్ధమయింది.

ఫలప్రదాత అయిన భగవానుని స్వరూపం తెలిసిన తరువాత, అతని కృపను మనపై ప్రసరింప చేయగల సత్పురుషులను గుర్తించి వారి దయను పొందాలి. అందమైన కథను చెబుతూ వాని వెనుక గంభీరమైన ఉపనిషద్రహస్యాలను ఆండాళ్ తెలియజేస్తోంది.

వ్రేపల్లెలో 5 లక్షల ఇళ్ళున్నాయి. ఇంటికొక గోపిక చొప్పున 5 లక్షల మంది గోపికలు ఈ వ్రతానికి సిద్ధపడ్డారు. అందరూ చేరారా లేదా అని చూచిన గోదాదేవికి పదిమంది తక్కువైనట్లు తెలిసింది. వారు లేకుండా తాము కృష్ణానుభవానికి పోలేక, ఆనాటినుండి ఒక్కొక్కరిని లేపి తమతో చేర్చుకుంటారు. వారి వారి వసతులకు పోయి మేలుకొలపడానికి కొన్ని ప్రాభాతిక చిహ్నాలను తెలుపుతారు. ఇందులో ఒక ఉపనిషద్రహస్యం ఇమిడి ఉంది.

కృష్ణునికి అందరిపైన ప్రేమ సమానం. వీరికి కూడా స్వామిని చేరాలనే ఆర్తి సమానంగానే ఉంది. అయితే ఎవరికి వారు వేరు వేరుగా పోరు. అది నియమ విరుద్ధం. అందరూ కలిసి కృష్ణుణ్ణి చేరాలనేది నియమం. భగవదనుభవం ఒక వేగం కల జలప్రవాహం వంటిది. ఒంటరిగా దిగితే ప్రమాదం. ఆ ఆనందంలో ఉన్మస్తకం కావడమో, మైమరచుటో జరుగుతుంది. పదుగురితో అనుభవం ఒంటపడుతుంది.

కృష్ణుడు కూడా భక్తులను గూర్చి తెలుపుతూ, వారంతా కలిసి పరస్పరం 'తమ అనుభవాలను తెలుపుకొనుచు తృప్తితో ఆనందింతురు అన్నాడు'. అందుచేతనే ఎందరు అధికంగా భక్తులుంటే అంతటి ఆనందం అనుభావ్యమగునని మేల్కొల్పుతున్నారు. కృష్ణ ప్రేమ అందరికీ తీవ్రమే. అయితే కొందరు నిదురించకుండా త్వరపడుతుంటే మరికొందరు కృష్ణుని వద్దకు పోవడం మరచి నిద్రించడం తగనదా అని అనిపిస్తుంది. అదొక రహస్యం. భగవంతునిలోని కళ్యాణగుణాలు భక్తులని పరవశింప చేస్తాయి. కొందరిని నవ్విస్తాయి. కొందరిని ఏడ్పిస్తాయి. కొందరిని ఆడిస్తాయి. కొందరిని పరుగెత్తిస్తాయి. మరికొందరు మత్తుగా పడి ఉండేలా చేస్తాయి. అవి స్వామిలోని గుణాల స్వభావమే కాని వీరి దోషం కాదు. అందుచేత నిదురించు వారిని అట్టి స్థితిలో లేపవచ్చు.

అయినా వారి నిద్ర తామస నిద్ర కాదు. సాత్విక నిద్ర. నిద్రలో ఇంద్రియ ప్రవృత్తులుడిగి జీవుడు తనలో నున్న పరమాత్మను చేరతాడు. అది సుషుప్త దశ. ఆ దశలో జీవుడు ఆనందపడును. అయితే కర్మవశాన తిరిగి పరమాత్మనుండి విడుతూ ఉంటాడు. అపుడు మేల్కొని విషయ సుఖాలలోకి పోతూ ఉంటాడు. తను కలిసిన పరమాత్మ జ్ఞాపకం ఉండదు. వీరికి ప్రాపంచిక సుఖాలలో తెలివి ఉంది. పరమాత్మ విషయాలలో నిద్ర ఉన్నది అని అర్థం.

జ్ఞానుల ప్రవృత్తి దీనికంటె భిన్నంగా ఉంటుంది. వారికి ప్రాపంచిక విషయాలు కనబడవు. లోని పరమాత్మ ఎల్లప్పుడూ వారు చేరి ఉంటారు. అట్టివారికి పరమాత్మ విషయంలో తెలివి, ప్రాపంచిక విషయంలో నిద్ర ఉంటుంది. నిద్ర అంటే ప్రవృత్తి లేకుండా ఉండటం. జ్ఞానులను లేపడమంటే, వారనుభవించే భగవదనుభవాన్నుండి బయటకు వచ్చి ఒకసారి, మనకూ ఆ అనుభవానందాన్ని ప్రసరింప జేయమనుటే తప్ప కేవలం నిద్ర మేల్కొల్పుట లాంటిది కాదు.

వారి చూపు మనలోని చీకట్లను తొలగిస్తుంది. తత్వాన్ని చూపుతుంది. అటువంటి జ్ఞాన దశలోని వారే లోపల పవ్వళించిన పదిమంది గోపికలు.

వారి దశా విశేషాలను చూపుతూ, అలాంటి నిష్ఠ కలుగజేయడానికి లేచి రమ్మంటుంది మన ఆండాళ్.

ఆ పది మందిని లేపటంలో మరో తాత్విక రహస్యం ఉంది. తత్వాలు మూడు ఉన్నాయని ముముక్షువులకు తెలియాలి. 1.పరమాత్మ 2.జీవుడు 3.ఈ ప్రకృతి, భూమి, నీరు, తేజస్సు, వాయువు, ఆకాశము, మనసు, బుద్ధి, అహంకారము ఎనిమిది రకాలుగా ఉంటుంది. ఎనిమిది రకాల ప్రకృతి, జీవుడు, పరమాత్మ కలిసి మొత్తం పది. ఈ పది దశా విశేషాలు కలిగిన జ్ఞానులే ఈ పదిమంది గోపికలు. వీరు ఈనాటినుండి మేల్కొల్పబడుతున్నారు.

మొదట గోపిక భగవదనుభవానికి క్రొత్త పదుగురితో చేరితే ఆనందం పోతుందేమోనని భ్రమించి బయటకు రాలేదు. అది ఆ లోపలి గోపిక విలక్షణతను సూచిస్తుంది. అందరితో కలిస్తేనే అది సరి అయిన భగవదానందమని చెప్పారు.

'వ్రత నియమం లేని పక్షులు సైతం కాలము తెలిసి మేల్కొని కిలకిలా రావములతో ఆహారాన్వేషణకై పోవుచున్నవే'. శ్రీకృష్ణ సేవయే ఆహారముగా, దానికై మనమూ పోవద్దూ! లే! అని మొదటి గోపికను లేపారు. ఈ గుర్తు తెల్లవారినట్లు కాదనుకున్నట్లున్నది. మరొకటి చెప్పడం ప్రారంభించారు. 'ఆ పక్షిరాజైన గరుడవాహనుని మందిరంలో సేవకు రండి అంటూ పిలిచే తెల్లని శంఖపు పెద్ద ధ్వని విన్పడలేదా?' ఆరాధనకు వేళైంది లే అన్నారు. ఆమె పలుకలేదు. తామెట్లు మేల్కొనిరో చెబుతున్నారు. కృష్ణుడు వస్తాడని గోశాలలో మకాం వేసిన మునులు, యోగులు ఉషః కాలంతో లేచి పాడిన హరి కీర్తనలు మా చెవిని సోకాయి. పూతన విషస్తన్యం పానం చేసిన హరీ,' 'శకటాసురుని సంధులూడదన్నిన పాదము చాపిన హరీ', 'పాల్కడలిలోని సర్వరూప బీజస్వరూపుడా! హరీ! అంటూ వారు పాడారు. ఆ పెద్ద ధ్వని నిదురించిన వాడి చెవిలో శీతల జలములు పోసినచో ఎట్లు ఉలిక్కిపడునో అట్లు మమ్ము చేయవచ్చితిమి. ఆ నామములు నీకు మెలుకువ తెప్పించుటలేదా! అని మూడు గుర్తులు చెప్పారు.

పక్షులు మేల్కొనుట మొదటి గుర్తు. తాము ముందు లేచి మేల్కొల్పునవి పక్షులు. అవి రెండు రెక్కలతో ఆకాశంలో విహరిస్తాయి. పక్షులే జ్ఞానులు. జ్ఞానానుష్ఠానములనే రెక్కలతో వీరు ఉంటారు. ఆ – అంతటా, కాశ – ప్రకాశించు; పరమాత్మలో వీరు సంచరిస్తూ లోకులకు సాత్విక కాలంలో మేల్కొని కర్తవ్యం పాటించాలని చెబుతారు. జ్ఞానశృతికి పక్షులే ఆచార్యులై తత్వజ్ఞానాన్ని కల్గించాయి.

రెండవది ఆలయ శంఖధ్వని. శంఖాన్ని ఉపనిషత్తులు ప్రణవంగా గుర్తించాయి. ఇది వేదసారం. దోష రహితం.

మూడవది హరిశబ్దం. హరి అనే రెండక్షరాలు అన్నవారి పాపాలను హరిస్తాయి. ఏమి హరించాలో మునులు, యోగుల నామాలలో ఉన్నాయి. పూతన స్తన్యాన్ని త్రాగి దాని ప్రాణాలను స్వామి హరించాడు. తల్లివలె వచ్చి మోసగించ చూచి తానే నశించింది. పూతనయే ప్రకృతి. ఇది విషము కంటె ప్రమాదకరమైన విషయ సుఖాలనిచ్చి, భగవంతుని మనం మరచేటట్లు చేస్తుంది. అహంకార మమకారాలే దాని స్తనాలు. ప్రకృతినే మనం నిజమైన తల్లిగా భావిస్తున్నాం. శ్రీకృష్ణుని అక్కడ చేరిస్తే ప్రకృతి ప్రభావాన్ని దూరం చేస్తాడు.

2.శకటాసురుని సంధులు తొలగించినవాడు. శకటము మన శరీరం. దీనిని నడిపే చక్రాలు పుణ్యపాపాలు. అవి రెండూ ఉన్నంత వరకూ మనకు కృష్ణుడు అందడు. స్వామి పాదం సోకితేనే పుణ్య పాపాలు బాధించవు.

3. పాల్కడలిలోని జగత్కారణ బీజము కళ్యాణ గుణములే ఉపనిషత్తులు అందించు పాలు కాగా, వాటిని ప్రేమించిన జ్ఞాని ఆదిశేషుడు. వానిలో స్వాతి బీజము లాగా శయనించాడు.

జ్ఞానులకు ప్రకృతి బంధమును రూపుమాపి, పుణ్య పాప రూపకర్మములు అంటకుండా చేసి భక్తుల హృదయంలో ప్రేమసాగరంలో వలె శయనించినాడు. అతనిని స్మరించి పరవశించువారు మునులు, యోగులు, మననశీలురు. నేటి గోపబాలిక భగవత్తత్వాన్ని లక్షించిన పై లక్షణాలు కల జ్ఞాని వంటిది. కనుక తమతో చేరి తమకు కూడా అట్టి దశ కలిగించమని అంటున్నారు.

**(సశేషం)**

# ముకుందమాల

- డా॥ భువనేశ్వరి మారేపల్లి, 9550241921

ధారావాహికం



## 27 శ్లోకం

**మజ్జన్మనః ఫలమిదం మధు కైటభారే**
**మత్ప్రార్థనీయ మదనుగ్రహ ఏష ఏవ ।**
**త్వద్భృత్య భృత్య పరిచారక భృత్య భృత్య**
**భృత్యస్య భృత్య ఇతి మాం స్మర లోక నాథ ॥ 27 ॥**

ఓ మధుకైటభారీ! ఓ లోకనాథా! నువ్వు నామీద చూపించ వలసిన అనుగ్రహమేదో తెలుసునా! నీ సేవకు యోగ్యత లేనివాడనైతే, కనీసం నీకు భక్తులైనటువంటి వారికి అయినా సరే దాసాను దాసులకు కనీసం ఏడవ దాసుడనయ్యే అవకాశాన్ని అనుగ్రహించుము ఇదే నా జన్మకు ఫలము. ఆ శ్రీమన్నారాయణుడే హయగ్రీవునిగా విభవావతార రూపము దాల్చి చతుర్ముఖ బ్రహ్మకు అజ్ఞాన నిర్మూలన చేసి, వేద విజ్ఞానాన్ని అందించిన స్వామి కదా! అలాగే "పరిత్రాణాయ సాధూనాం" అన్నట్లు అవతారం ఎత్తినప్పుడు దుష్టసంహారం కూడా గావించి ధర్మ ప్రతిష్ట చేస్తాడు స్వామి. అలాగే వేద విజ్ఞానానికి భంగం కలిగించి నటువంటి మధుకైటభులనే అసురులను సంహరించి బ్రహ్మ పునర్విజ్ఞానం కలిగించనటువంటి పరమాత్మ హయగ్రీవుడు. కైటభుడు తమోగుణ ప్రవృత్తి కలది, మధు అనేది రజోగుణ ప్రవృత్తి కలది అంటే రజోతమో గుణములతో జ్ఞాన విహీనులైన వారికి జ్ఞానజ్యోతి వెలిగించేవాడు హయగ్రీవ అవతారం.

పరమాత్మలో ఉన్నటువంటి అన్ని కళ్యాణ గుణాలు పర, వ్యూహ, విభవ, అర్చ, అంతర్యామి రూపాలలో ఎల్లప్పుడూ ఉన్నప్పటికీ, కొన్ని రూపాలలో కొన్ని కొన్ని గుణాలు మనకోసం సులభంగా ప్రకటమయి లభ్యమవుతాయి.

హయగ్రీవావతారంలో విద్యాప్రధానము, అజ్ఞాన నిస్తరణము, అందుచేత మన పూర్వాచార్యులెందరో హయగ్రీవ భగవానుడిని ఉపాసన చేసి లబ్ధి పొందారు. సమస్త విద్యలకు విజ్ఞానానికి మూలం హయగ్రీవావతారం. ఇటువంటి స్వామిని మన ఆళ్వార్లు, పూర్వాచార్యులు కూడా స్తుతించారు. ఎలాగంటే!

మన ''నమ్మాళ్వార్లు'' తమ తిరువాయి మొళిలో ''మావాకి యామైయాయ్'' అని మావాకి అనగా

''హయరూపమును పొంది'' అని పెరుమాళ్ళను కీర్తించారు.

యామునాచార్యుల వారు తమ స్తోత్ర రత్నములో "మధు జిదంఘ్రి సరోజ తత్త్వ జ్ఞాన" అన్న సందర్భంలో అలాగే "వేదాపహార" అన్నచోట హయగ్రీవ పెరుమాళ్ళను ప్రస్తుతిస్తారు.

పెరియ వాచ్చాన్ పిళ్ళై "తన్నైత్తాళవిట్టు హయగ్రీవనాయ్, నిన్ఱాయిత్తు ఉపదేశిత్తదు సారథి యాయ్" అని హయగ్రీవ, శ్రీకృష్ణ భగవానులిద్దరికీ సామ్యాన్ని చెబుతారు.

భగవద్రామానుజులకు కాశ్మీరములో సరస్వతీదేవి బ్రహ్మసూత్ర భాష్య గ్రంథానికి తన ఆమోదాన్ని తెలియజేస్తూ దానికి "శ్రీభాష్యము" అని నామకరణము చేసి భగవద్రామానుజులకు సరస్వతీదేవి తాను ఆరాధించుకొంటున్న లక్ష్మీ హయగ్రీవ మూర్తిని అనుగ్రహించగా, ఆ మూర్తి రామానుజుల అవతారానంతరము తిరుక్కురుగైప్పిరాన్ పిళ్ళై వారికి సంక్రమించింది. అలా కొన్నాళ్ళకు ఆ మూర్తి మైసూరులో పరకాల మఠములో వేంచేసేరు. పరకాల మఠ జీయర్ స్వాములు హయగ్రీవోపాసకులు "హయగ్రీవ దివ్య పాదుకా సేవక" బిరుదాంకితులు.

అలాగే వేదాంత దేశికులకు గరుడ భగవాన్ సాక్షాత్కరించి

ప్రసాదించిన యోగ హయగ్రీవ మూర్తి "తిరువహీంద్ర పురము"లో దేశికుల సన్నిధిలో ఉన్నది. ఓ లోకనాథా! అటువంటి అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతున్న మమ్మల్ని జ్ఞానవంతులని చేసి అనుగ్రహించుము. అనేకమైనటువంటి అపచారములు చేసి నిన్ను సేవించుటకు యోగ్యత లేని వారము అయితే కనీసం నీకు సన్నిహితమైన నీ భక్తులయందు అయినా దాసులుగా ఉండేలా అనుగ్రహించండి. అలా దాసులకు దాసులుగా ఉండేవారిలో ఏడవ దాసుడిగా ఉన్నా అత్యంత ఆనందం స్వామి. అని కులశేఖరాళ్వార్లు పరమాత్ముడిని ఉచ్ఛస్థితిలో అలాగే భాగవతుల తోటితో సమదృష్టి కాకుండా నీచత్వాను సంధానము కలిగి ఉండాలని నేర్పుతున్నారు. నీచత్వము అంటే శేషశేషి భావము కలిగి ఉండాలి.

పరమాత్మ! సర్వశేషి, నేను అతడి శేషభూతుడను జ్ఞాపకం ఉంచుకుని ప్రవర్తించాలి. ప్రపన్న జన కూటస్థులగు నమ్మాళ్వార్లు కూడా "అడియారాడియార్ తమక్కడియార్" అని ఏడు ఇంతలు తగ్గించుకుని దాసాను దాసులకు దాసులైన వారికి దాసుడినైనా చాలు అలా అనుగ్రహించుము పరమాత్మా అని సాయిస్తారు. భగవంతుడి యందు కంటే భాగవతులయందు పరిచారిక నిష్ఠ కలిగి ఉంటే తరించుట సులభమని తెలియజేస్తున్నారు కులశేఖరాళ్వార్లు.

భగవానుని పొందే అత్యున్నత సాధన ప్రేమ, భక్తి ద్వారానే. "స్వచ్ఛమైన ప్రేమ లేని ధనం, తపస్సు, విద్య వల్ల ఏమి ప్రయోజనం" అంటుంది భక్తి సంప్రదాయం. కాబట్టి భగవంతుడిని చేరుకోవడానికి మరియు దివ్యమైన ఆనందాన్ని పొందేందుకు, ప్రాపంచిక ఆస్తులన్నింటినీ విడిచిపెట్టి, స్వచ్ఛమైన ప్రేమ భక్తిలో మునిగిపోవాలి, అది ఖచ్చితంగా కృష్ణ దర్శనానికి దారి తీస్తుంది. నిజమైన దాహంతో భగవంతుని కోసం హృదయపూర్వకంగా ఏడ్చే వ్యక్తి ఖచ్చితంగా ధన్యమైన ఆత్మ.

పండరీపూర్‌కు సమీపంలో "సించిరునిపురం" అని పిలువబడే ఒక చిన్న గ్రామం ఉంది. మరియు పాండురంగనికి గొప్ప భక్తుడైన గంగాధరుడు అనే ధనవంతుడు నివసించేవాడు. అతను నిజాయితీపరుడు, సత్యవంతుడు, సూటిగా ఉండే వ్యక్తి. అతని భార్య కమలాబాయి కూడా గొప్ప భక్తురాలు. ఆ దంపతులకు చాలా ఏళ్లుగా సంతానం లేదు. ఒక రాత్రి పాండురంగడు వారికి కలలో కనిపించి, వారికి త్వరలో అందమైన ఆడపిల్ల పుడుతుందని ఆశీర్వదించాడు. దీంతో వారిద్దరూ సంతోషించి పాండురంగని స్తుతించి, ఆయనపై అనేక కీర్తనలు పాడారు. వెంటనే కమలా బాయి ఆడపిల్లకు జన్మనిచ్చింది. ఆమెకు సక్కుబాయి అని పేరు పెట్టారు. చాలా చిన్న వయస్సులో సక్కు బాయి భజన్లు పాడటం ప్రారంభించింది. కొన్నిసార్లు దైవ పారవశ్యం కారణంగా ఆమె నృత్యం చేసి కన్నీళ్లు పెట్టుకునేది. ఆమె భక్తిని, అందాన్ని చూసి, ఆమె మధురమైన గాత్రాన్ని విని అందరూ ఆశ్చర్యపోయారు.

★★★

ఒకనాడు సక్కుబాయి ఇసుకలో కూర్చుని ఆలోచిస్తూ అప్రయత్నంగా ఇసుకతో గుడి కట్ట సాగింది. చేతులతో గుడి నిర్మాణం చేస్తూ మనసులో భావమందిరాన్ని నిర్మించుకుంటూ ఉంది. తాను ఈ ఇసుక గుడిని నిర్మిస్తున్నట్లే, ప్రపంచంలో మానవులు సంసార ఆలయాలు నిర్మించు కుంటూ ఉన్నారు. తన ఇసుక గుడి ఎంత శాశ్వతమో, ఈ మాయా నిర్మిత సంసారాలు కూడా అంతే శాశ్వతము. కదలిపోయే ఇసుక గుడిపై పెంచుకున్న మమతలకు మిగిలేదేమిటో, చెదిరి పోయే సంసారాలపై ఉంచుకున్న మమకారాలకు కూడా మిగిలేది అదేనని చింతిస్తూ ఉంది. ఇంతలో సదానంద స్వాముల వారు అనే యతివరేణ్యుడు ఆ దారిన వెళుతూ చూడకుండా ఆ ఇసుక గుడిపై తన పాదము ఉంచాడు. గుడి చెదిరిపోయింది. తన ఊహకు అనుగుణంగానే జరిగి నందుకు ఆశ్చర్యపోతూ సక్కుబాయి స్వాముల వారిని చూసింది. తాను పాడు చేసిన గుడిని నిర్మించినది సక్కుబాయి అని గ్రహించిన సదానంద స్వామి, మందహాసము చేస్తూ అమ్మా! గుడి పాడైనందుకు చింతించకు. చెడి పడిపోయే, పడి చెడిపోయే గుడి నిర్మాణం కాదు చేయవలసింది. చెడని హృదయంలో, చెడని గుడిని నిర్మించుకో కాలిపోయే శరీరాలతో రాలిపోయే మందిరాలు నిర్మించి సాధించేదేముంది. మృణ్మయ శరీరాలతో మృణ్మయ మందిరాలు నిర్మించడం కాదు. చిన్మయ చైతన్యంతో తన్మయ మందిరాలు నిర్మించాలి. ప్రయత్నించు నీ గుడిని పాడు చేసి నందుకు పరిహారం చెల్లించి వెళతాను అంటూ పాండురంగని దివ్య మంత్రాన్ని ఉపదేశించి ధ్యానించి, తరించమని చెప్పి వెళ్ళిపోయాడు.

సక్కుబాయిలో లక్ష్యసాధనకై అవ్యక్తంగా జరుగుతున్న ప్రయత్నానికి ఆధారం లభించింది. తన కాలాన్నంతా మంత్ర జపంలో ఖర్చు చేయసాగింది. అంతర్ముఖ జీవనానికి బాగా అలవాటు పడిపోయింది. సక్కు ప్రవర్తనను చూసిన తల్లిదండ్రులు కలత చెందారు. ఇలాగే ఉంటే సక్కు తమకు దక్కదు అని భావించారు. వివాహం చేయడమే ఉత్తమ మార్గము అని భావించారు. కృష్ణా నది తీరంలో ఉన్న కరవీరపురము అనే గ్రామంలో మిత్ర కాంతుడు అనే వానికి సక్కుని ఇచ్చి వివాహం చేశారు.

సక్కును అత్తవారింటికి పంపారు. శరీరానికి స్థానభ్రంశమే కానీ, చిత్తం మాత్రం గోవిందుని పవిత్ర పాదముల యందే స్థిరంగా ఉండిపోయింది. సక్కు కాపురానికి వెళ్లిన అత్తగారి గృహము ఆవేదనాలయం. సక్కుబాయి అత్తగారు ఒక విచిత్రమైన వ్యక్తి. అభినవ మంథర అని భావించ వచ్చు. పరనిందతోనే ఆవిడ ఆకలి తీరుతుంది. కపటం నాటకాలతో కాలాన్ని వెళ్ళబుచ్చుతుంది. సక్కు భర్తలో తల్లి పోలికలే ఎక్కువగా ఉన్నాయి. అతడికి

ప్రాపంచిక విషయ భోగముల యందు అభిరుచి ఉంది కానీ ఆధ్యాత్మిక జీవనమునందు ఆసక్తి కొంచెం కూడా లేదు.

సక్కుబాయి పతిసేవే పరమాత్మ సేవగా భావించి జీవించేది. అత్త మామలను సేవిస్తూ, అతిథి అభ్యాగతులను ఆదరిస్తూ, ఆదర్శ జీవనం గడుపుతూ ఉన్నది. సదా భగవదారాధన బుద్ధితో జీవించు సక్కుబాయి ప్రవర్తన అత్తగారికి నచ్చలేదు. భగవద్భక్తి అనేది ఒక అనాచారమని, నిత్య పూజలు జరిగే గృహం దరిద్ర దేవతకు ఆలయం అని తెలియజేసింది. పాండురంగడే ఆమెకు సర్వస్వం. పాండురంగని ఆరాధనే ఆమెకు జీవము. తనకు పాండురంగని యందు ఉన్న అపార భక్తి విశ్వాసాలను అత్తగారికి తెలియజేస్తూ వాటిని వమ్ము చెయ్యద్దు అని ప్రార్థించింది. సక్కు ప్రార్ధనను అత్తగారు అంగీకరించలేదు. అలాగని భగవదారాధనను సక్కు కొనసాగించడం మానలేదు.

ఒకనాడు బ్రహ్మముహూర్త కాలంలో సక్కుబాయి తన పూజ మందిరంలో అర్చనాదులను పూర్తిచేసుకుని, సంకీర్తన చేస్తూ ఉంది. సక్కుబాయి సంకీర్తన వలన తనకు నిద్ర భంగం అయినది అని అత్తగారు రుద్రకాళి లాగా విజృంభించింది. సక్కుబాయి పూజా మందిరానికి వచ్చి ఏమిటి అసహ్యపు కేరింతలు? ఇది గృహమా? లేక సంతా? ఈ ఇంట్లో ఇక ఎవ్వరు నిద్రించనవసరం లేదా? దారిద్రానికి మూలహేతువైన ఈ దౌర్భాగ్యపు భక్తిని విడనాడమని నీకు ఎన్నిసార్లు చెప్పాను అని గద్దించింది. సక్కుబాయి వినమ్రతతో చేతులు జోడించి అత్తగారికి నమస్కరిస్తూ క్షమించండి, బ్రహ్మ ముహూర్త పుణ్యఘడియలలో జీవనాధారమైన జగన్మోహనుని ఆరాధించాలి అని ఆత్రుతపడ్డానే గాని మిమ్మల్ని శ్రమ పెట్టాలని, మీకు నిద్రాభంగం చేయాలని నేను భావించ లేదు. దేవతలు, ఋష్యాది మహాత్ములు ఏకశృతితో శ్రీహరిని స్మరించు బ్రహ్మ ముహూర్త సమయాన ఒళ్ళు మరచి నిద్రించుట అపచారము. తపస్సుతో తరించవలసిన శుభ సమయంలో తమస్సులో పడి ఉండుట అనాచారం అత్తగారూ! క్షమించండి నేను బిగ్గరగా సంకీర్తన చేయుట వలన మీకు నిద్రాభంగం అయినది ఇకమీదట మీరు నిద్రలేచేవరకు నేను మౌన జపములో కాలం గడుపుతాను. శోకభూయిష్టమైన సంసార జీవనంలో ఉన్నను శ్రీనాధుని పద పంకజముల చెంత చిత్తము ఉంచిన వారు తప్పక తరించగలరు. విష్ణువును మరచుటయే ఆపద, శ్రీహరి స్మరణయే నిజమైన సంపద అని సక్కు భావగర్భంగా పలికింది.

★★★

సక్కు ప్రబోధంతో కోపించిన అత్తగారు నీ అర్థరహిత ప్రసంగాన్ని ఆపు నీ వ్యర్ధ పూజలన్నీ ఈ ఇంట్లో కొనసాగడానికి వీల్లేదు. నీవు అత్తగారింటికి వచ్చింది కాపురం చేయడానికి గాని కైంకర్యాల్లో కాలాన్ని వృథా చేయడానికి కాదు అంటూ సక్కు పూజ చేసుకునే శ్రీకృష్ణదేవుని దివ్య మంగళ విగ్రహాన్ని పూజా పీఠం నుండి కదిలించి, పెరట్లోకి వెళ్లి అక్కడున్న బావిలో మురళీ మనోహరుని విగ్రహాన్ని పడేసింది. అది చూసిన సక్కుబాయి మూర్ఛ పోయింది.

సక్కుబాయి కొంతసేపటికి మూర్ఛనుండి తేరుకొని పరిగెత్తుకుంటూ పూజా మందిరానికి వెళ్ళింది. అక్కడ గోపాలుడు కనిపించలేదు హే కృపానిధీ! పాండురంగా! నేను చేసిన నేరం ఏమిటి? దయాస్వరూపా! సౌమ్య రూపా! ఈ దీనురాలను కరుణించు. అంటూ ఆవేదనతో పూజా పీఠంపై పడిపోయింది. వెంటనే ఆమె పవిత్ర హస్తాల మధ్య శ్యామసుందరుని విగ్రహం నిలిచింది. సక్కుబాయి కళ్ళు తెరిచి చూసింది. ముకుందుని చూసి మురిసిపోయింది. కరుణించావా తండ్రి! ప్రేమ హృదయాలలో నివసించే నువ్వు నా కొరకు జలకూపంలో పడ్డావా నాలాంటి దౌర్భాగ్యపు భక్తుల వల్ల నీకు బాధలు తప్పడం లేదు అంటూ సక్కుబాయి విలపించింది.

ఇంతలో అయ్యో! అయ్యో! చేతులు కదలడం లేదు మండుతున్నాయి. నేను ఈ బాధను భరించ లేను అని ఏడుపు వినిపించింది. సక్కుబాయి పరిగెత్తుకుంటూ వెళ్ళింది. తీవ్రమైన బాధను అనుభవిస్తున్న అత్తగారిని చూసింది తట్టుకోలేకపోయింది. పరిగెత్తుకుంటూ వెళ్లి అత్తగారిని కౌగిలించుకుంది. అంతే! సక్కుబాయి చల్లటి అమృత ఆలింగనముతో అత్తగారి బాధ అడుగంటి పోయింది. అత్తగారు మామూలుగా ఆరోగ్యవంతురాలు అయ్యారు. సత్యనాధుని కూపంలో పడవేయడం వలన కలిగిన పాపము సక్కుబాయి ఆలింగనం వలన పరిహారం అయ్యింది.

సక్కుబాయి మహా భక్తురాలు అని, దైవంశ సంభూతురాలు అని ఇరుగుపొరుగువారు అత్తగారితో చెప్తూ ఉండేవారు. దానితో ఆవిడలో కోపం మరింత పెరిగింది. ఎలాగైనా సక్కూను సమాజంలో బలహీనం చేయాలి అని భావించింది. అందుకు అనుగుణంగా ఒక పెద్ద జొన్నల మూటను గదిలో ఉంచి సక్కుబాయిని పిండి చేయమని చెప్పింది. ఆరోజు ఏకాదశి పర్వదినం అయినందున సక్కుబాయి ఉపవాస వ్రతం చేస్తూ ఉన్నది. సక్కుబాయి అత్తగారు ఇరుగుపొరుగు వారిని సంప్రదించి తన కోడలు ఏకాదశి పర్వదిన సందర్భంగా వ్రత దీక్షలో ఉన్నది అని. ఆమె భక్తి మహిమతో ఈ రాత్రికి జొన్నలను పిండి చేయగలదు అని చెప్పి ఇరుగుపొరుగు వారి నుండి కూడా పిండి చేయటానికి జొన్నలను ప్రోగు చేసుకొని తీసుకుని వచ్చి, వాటిని అన్నింటిని ఒక గదిలో ఉంచి సక్కుబాయిని ఆ గదిలో పెట్టి తాళం వేసింది. తెల్లవారేసరికి జొన్న మూటలన్నీ పిండి చేయాలి అని ఆజ్ఞాపించింది.

సక్కుబాయికి పరిస్థితి అర్థం కాలేదు. తిరగలి దగ్గర కూర్చుంది. పిండి చేయడానికి ప్రారంభించింది. ఫలితం అగమ్యంగా గోచరించింది. హే భక్తవత్సలా! మరల నూతన



పరీక్షకు గురి చేశావా? నీ పాదపద్మాలకు అంకితమైన నీ భక్తులకు మానావమానాలు ఉంటాయా జయాపజయాలు స్ఫురిస్తాయా! కరుణాపారీణా! కమలనయనా! కాపాడు తండ్రీ! ఆర్తత్రాణ పరాయణుడవన్న నీ బిరుదును సార్థకం చేసుకో అని ప్రార్థిస్తూ సక్కుబాయి మైమరచి నిద్రపోయింది. ఆహా! మహాద్భుతం! పాపపు మూటలనే పిండి చేయు జగన్నాథునికి జొన్నల మూటలను పిండి చేయుట కష్టమా! క్షణకాలంలో జొన్నల మూటలన్నీ పిండిగా మారాయి. సక్కుబాయి నిద్ర నుండి మేలుకొని భగవానుడు తనపై కురిపించిన దయామృతాన్ని దర్శించింది. హృదయము ఆనందంతో నిండిపోయింది. నేత్రముల వెంట ఆనంద భాష్పాలు రాలాయి. గగుర్పాటు చెందుతున్న మేనును కదిలించి గది తలుపు తెరిచింది. అత్తగారు అపహాస్యం చేస్తూ, సక్కూ! ఇరుగుపొరుగు వారు కూడా వచ్చి ఉన్నారు నీ భక్తి విశేషముచే తయారైన జొన్న పిండిని చూసి తీసుకోవాలని వచ్చి ఉన్నారు పిండి చేయడం పూర్తయిందా అని ప్రశ్నించింది.

సక్కుబాయి చేతులు జోడించి నమస్కరిస్తూ అత్తగారు మీరు పెద్దలు. మీరు నాపై చిందించే ప్రేమానురాగాలకు నేను ఋణగ్రస్తురాలనై ఉన్నాను. నలుగురికి నా భక్తి శ్రద్ధలను వివరించాలని మీరు సంకల్పించి నాకీ పరీక్ష పెట్టారు. మీ ఊహకు అనుగుణ్యము గానే జరిగింది. పాండురంగని అదృశ్య హస్తం పనిచేసింది. దైవప్రసాదం పిండి రూపంలో నిలిచింది అని వినమ్రతతో తెలిపింది. ఇరుగుపొరుగు తల్లులతో కలిసి సక్కూ అత్తగారు గదిలోకి వెళ్లి చూశారు. వారి కళ్ళను వారే నమ్మలేకపోయారు. జొన్నలన్నీ పిండిగా మారి ఉండటం చూసి సక్కుబాయి పాదాలపై పడ్డారు. ఇరుగు పొరుగు తల్లులు ఆమె భక్తి ప్రపత్తులను కొనియాడుతూ వెళ్లిపోయారు. సక్కుబాయి అత్తగారి మనస్సు కలత చెందింది. దానితో సక్కుబాయిపై తనకున్న అసూయ ఆకాశానంటింది.

★★★

ఒకనాడు సక్కుబాయి ఆలయానికి వెళ్ళి తిరిగి వస్తూవుండగా, తన చిన్నతనంలో తనకు మంత్ర దీక్షను ఇచ్చిన సదానంద స్వాములవారిని దర్శించి ఎంతో ఆనందించి, తన ఇంటికి వచ్చి ఆతిథ్యమును స్వీకరించి, మమ్ములను ఆశీర్వదించండి అని ప్రార్థించింది. ఆమె ప్రార్థనను మన్నించి ఆమె ఇంటికి చేరి, శిష్యులతో కలిసి భిక్షను స్వీకరిస్తూ వుండగా, సక్కూ అత్తగారు వచ్చి అనరాని మాటలు మాట్లాడడంతో, స్వాములవారు సక్కూబాయి పరిస్థితి తెలుసుకుని, "అమ్మా! సక్కూ! అర్థమయింది తల్లీ! ప్రహ్లాదుని విశ్వాసముతో, ధ్రువుని ధైర్యముతో జీవిస్తూ, శబరి లాగా నిరీక్షిస్తూ వుండు. భగవానుడు నిన్ను తప్పక తరింప చేస్తాడు అని శిష్యులతో కలిసి స్వాములవారు వెళ్లిపోయారు.

ఈ సంఘటన ఆధారంగా అత్తగారు సక్కూని మరింత వేధించడం మొదలుపెట్టింది. ఆ బాధలు అన్నింటినీ ప్రశాంతంగా అనుభవిస్తూవుంది సక్కూబాయి. నిరంతరం పాండురంగని దర్శించాలని ఆమె మనస్సు తపిస్తూ వుంది. ఒకరోజు సక్కూబాయి చెరువునుండి నీళ్లు తీసుకుని వస్తూ వుండగా, దారిలో పాండురంగని నామస్మరణ చేస్తూ కొందరు భక్తులు పండరీక్షేత్ర దర్శనానికి వెడుతూ ఉండటాన్ని చూసింది. "మహాత్ములారా! వందనములు, పాండురంగని దర్శనమునకు నోచుకోని ఒక అభాగ్యురాలను. దయచేసి నన్ను మీతో తీసుకువెళ్లి ఆ పాండురంగని దర్శనము చేయించండి" అని వేడుకుంది సక్కూబాయి. అమ్మా! నీవు మహాభక్తురాలు వలే కనపడు తున్నావు. నిన్ను మా వెంట పండరీకి తీసుకొని వెళ్ళుట మహాభాగ్యంగా భావిస్తున్నాము. ఆ పాండురంగని దివ్య దర్శనమునకై పరితపించే హృదయమెంత పవిత్రము అంటూ, ఆ సక్కూబాయిని వెంట తీసుకుని ఆ భక్త బృందం కదిలింది.

సక్కుబాయి పండరికి వెడుతున్నదని విన్న ఆమె అత్తగారు అంతులేని కోపంతో లేనిపోని చాడీలు చెప్పి, కుమారునిలో కూడా కోపాన్ని రగిల్చింది. తల్లీకొడుకులు ఇద్దరూ కలిసి భక్త సమూహంతో, భక్తి పారవశ్యంతో వెడుతున్న సక్కూబాయిని చూసి దూషించసాగింది. మా వంశ ప్రతిష్ఠ మట్టిపాలు చేస్తున్నావు అని అనరాని మాటలతో కుమారుని కూడా రెచ్చగొట్టటంతో, మూర్ఖురాల! నీకు పెద్దలంటే గౌరవం లేకుండా పోయింది. అంటూ ఆమెను నిర్దాక్షిణ్యంగా ఈడ్చుకుంటూ ఇంటికి తీసుకువచ్చి ఒక గదిలో స్థంబానికి తాళ్లతో కట్టి బంధించి, ఆహార పానీయాదులు కూడా లేకుండా చేశారు.

రోజంతా ఆహారం లేదు, దాహంతో నోరెండిపోతున్నది. విఠలా! విఠలా! అంటూ, పలకరించే దిక్కులేని, విషమ పరిస్థితిలో ఉన్న సక్కూబాయి దీనావస్థను చూసి, దీనదయాళుడైన పాండు రంగని హృదయం ద్రవించింది. భక్తురాలిని ఉద్ధరించడానికి పండరీపురాన్ని వదలి కదిలాడు. సక్కూబాయి వలే మారువేషం

ధరించి ఫలహారమును, మంచి తీర్థమును చేతి యందుంచుకుని, సక్కూబాయిని బంధించి ఉన్న గదిలో ప్రత్యక్షమయ్యాడు. అమ్మా! సక్కూ! నీరసంగా ఉన్నావు కాస్త అల్పాహారమును తీసుకో, అంటూ తన స్వహస్తాలతో తినిపించాడు సక్కూ వేషములో ఉన్న భగవానుడు. సక్కూ ఊరట పొందింది. అర్ధరాత్రివేళ తనకు ఆహార పానీయాదులిచ్చి కాపాడిని స్త్రీ ఎవరాయని చూసింది. తొలిచూపులోనే ఆశ్చర్య పోయింది. అన్నీ తన పోలికలే. అమ్మా! నువ్వూ నాలాగే ఉన్నావు. నువ్వెవరు? అని ప్రశ్నించింది.

అమ్మా! నేను ఓ భక్తురాల్ని. బ్రహ్మోత్సవంలో పాల్గొనడానికి పండరీపురం వెడుతున్నాను. దారిలో నీ గురించి విన్నాను. నీలాంటి భక్తురాలితో కలిసి పండరి యాత్ర చేయాలని సంకల్పించి ఇక్కడకు వచ్చాను అని చెప్పాడు మాయా నాటక సూత్రధారి. పండరి యాత్రకు వెళుతున్న భక్తురాలు అని తెలియగానే సక్కుబాయి వెంటనే ఆమె పాదాలకు నమస్కరించింది. తన పరిస్థితి అంతా వివరించి చెప్పింది. అంతా విన్న పాండురంగడు అమ్మా! చింతించకు ఆపదలో ఉన్నప్పుడు ఉపాయం ఆలోచించి బయటపడుట తెలివైన వారి పని. కనుక నాకు ఒక చక్కటి ఆలోచన వచ్చింది, అదేమంటే! మనిద్దరి పోలికలు ఒకేలా ఉన్నాయి. కనుక నా మాట విను, నువ్వు ఇప్పుడే బయలుదేరి వెళ్లి పక్క గ్రామంలో ఉన్నటువంటి సాధు బృందంతో కలిసి పండరీ పురం వెళ్ళు. నన్ను యధావిధిగా ఈ స్తంభానికి బంధించి వెళ్ళు. నువ్వు వచ్చేవరకు నేను ఇక్కడే ఉంటాను. నా గురించి చింతించొద్దు. బ్రహ్మోత్సవాలు నాకు కొత్త కాదు నేను ఎప్పుడూ వెళుతూ ఉంటాను. అని సక్కూని ఒప్పించి సక్కుబాయి స్థానంలో తాను నిలబడి ఆమెని పండరీ పురానికి పంపాడు మారువేషంలో ఉన్న పాండురంగడు. సక్కుబాయి వెంటనే బయలుదేరి వెళ్లి పక్క గ్రామంలో ఉన్న సాధు సంఘంతో కలిసి పాండురంగని దర్శనానికి పండరీపురం చేరింది. చంద్రభాగ నదిలో స్నానమాచరించి పాండురంగని దర్శించింది. పాండురంగణ్ణి గానం చేస్తూ, సేవిస్తూ ప్రశాంత జీవనాన్ని గడపసాగింది సక్కుబాయి.

సక్కుబాయి ఇంటిలో మాయా సక్కుగా చలామణి అవుతున్న పాండురంగని ప్రవర్తన భర్తను, అత్తగారిని ఆశ్చర్యానికి గురి చేసింది. కొద్ది రోజుల్లోనే భర్త ప్రేమను పొంది అత్తగారిని ఆనందింప చేయడం జరిగింది. కామోద్రేకమునకు గురి అవుతున్న భర్త బారి నుండి బయటపడటం ఒక్కటే కష్టమవుతున్నది పాండురంగనికి. నిజానికి భగవంతుని దృష్టిలో అది ఒక కష్టమా? జగన్నాటక సూత్రధారికి నటనలో నాణ్యత, అభినయంలో ఆతురత ఉండటంలో ఆశ్చర్యమేముంది?

పండరీపురంలో భగవంతుని నిత్య ఆరాధనలో తన బ్రతుకును పండించుకుంటూ ఉన్నటువంటి సక్కుబాయి, ఒకరోజు పువ్వులు తేవడానికి వనంలో ప్రవేశించింది. అక్కడ ఒక త్రాచు పాము కాటుకు గురై మరణించింది. ఆమె భౌతిక కాయాన్ని చంద్రభాగా నదీ తీరానికి తీసుకువచ్చారు. ఆమె జాడ ఏమిటో? ఆమె ఎక్కడినుండి వచ్చిందో, అక్కడ ఉన్న భక్త జనానికి తెలియలేదు. ఇంతలో సక్కుబాయి గ్రామానికి చెందిన భక్తులు అక్కడికి రావడం జరిగింది. వారు సక్కు బాయిను గుర్తించారు. మృత కళేబరాన్ని గ్రామానికి తరలించే అవకాశం లేనందున, ఆ నదీ తీరంలోనే దహన సంస్కారాలు చేయడం జరిగింది. పరమ పుణ్యక్షేత్రమైన పండరీపురంలోనే సక్కుబాయి చివరగా తన దేహాన్ని వదలడం జరిగింది. సక్కుబాయి చితాభస్మాని తీసుకుని సక్కు అంత్యకాలంలో లేని భర్తకు అందజేయాలని సంకల్పించారు ఆమె గ్రామస్తులు.

పాండురంగడు మాయా సక్కుగా సక్కుబాయి గృహంలో ఇంటి పనులు చేస్తూ ఉండటం చూసి రుక్మిణీదేవి మనసు కలత చెందింది. భర్త వియోగాన్ని భరించలేని రుక్మిణీదేవి భర్తను సమీపించి "స్వామీ! ఏమిటి మీ భక్త వాత్సల్యం? ఇక మీరు పండరీపురం బయలుదేరక తప్పదు. మీ దర్శన భాగ్యానికి అశేష భక్తజనులు అలమటిస్తున్నారు" అని తెలియజేసింది. స్వామి నవ్వుతూ "దేవీ! నేను సత్యస్వరూపుడను అని నీకు తెలుసు కదా! సక్కు తిరిగి ఇంటికి వచ్చేవరకు నేను ఇక్కడ ఉండాలి. ఆమెకు మాట ఇచ్చాను. ఇచ్చిన మాట ప్రకారం జీవించడం నా విధి. ఇంకా ఆమె రాలేదు. ఆమె వచ్చేవరకు నేను ఇక్కడ నుండి కదలి రాలేను" అని తెలియజేశారు. “ఆదిదేవా! సర్వజ్ఞులైన మీకు తెలియనిది ఏమీ లేదు సక్కుబాయి గతించింది. ఆమె చితాభస్మాన్ని తీసుకొని గ్రామస్తులు ఇక్కడికి వస్తున్నారు. ఇక ఆమె ఈ ప్రపంచానికి లేదు. మీరు ఈ నాటకాన్ని ముగించి పండరీ క్షేత్రానికి తరలిరండి” అని రుక్మిణి దేవి ప్రార్థించింది.

రుక్మిణీ దేవి మాటలను ఆలకించిన పాండురంగడు "దేవీ! నీ ప్రయత్నం సఫలం కాదు. ఆమె రానిదే ఈ ఇల్లు విడవను. ఒకవేళ ఆమె శాశ్వతంగా రాకపోతే నేనిక్కడే శాశ్వతంగా ఉండి వారికి సేవలు చేయక తప్పదు" అని తన అభిప్రాయాన్ని దృఢంగా తెలియజేశాడు ఆ లీలా మానుష విగ్రహుడైన పాండురంగడు.

పాండురంగని ఒప్పించలేక మెప్పించలేక నిరాశ చెందిన రుక్మిణి దేవి, పండరి పురానికి చేరుకుని, చంద్రభాగ నదీతీరంలో బ్రహ్మదేవుని గురించి తీవ్రంగా తపస్సుచేయడం ప్రారంభించింది. అప్పుడు బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై "తల్లీ! సర్వజనులు నీ దర్శనార్థమై తపస్సు చేస్తూ ఉండగా, నువ్వు ప్రత్యేకించి తపస్సు చేయడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. నీ అభీష్టాన్ని తీర్చగలిగే అవకాశం కలగటం నా అదృష్టం తల్లీ! ఆజ్ఞాపించు" అని ప్రార్థించాడు. రుక్మిణీదేవి సృష్టికర్తతో జరిగిన వృత్తాంతమంతా వివరించి, సక్కుబాయి ఆమె గృహంలో ప్రవేశించే వరకు పాండురంగని విడుదల సాధ్యం కాదని తెలిపి దుఃఖించింది. బ్రహ్మదేవుడు సంతోషించి సక్కుబాయిని పునరుజ్జీవింప చేసి,

రుక్మిణిదేవికి నమస్కరించి అంతర్ధానమయ్యాడు. సక్కుబాయి చంద్రభాగా నదిలో స్నానం ఆచరించి, పాండురంగని దర్శించి తన గ్రామానికి ప్రయాణమైంది.

సక్కుబాయి చితాభస్మాన్ని తీసుకువచ్చిన గ్రామస్తులు సక్కుబాయి భర్తకు చితాభస్మాన్ని అప్పగించి విషయాన్ని తెలియజేశారు. కోపంతో సక్కు భర్త, ఏమిటి మీ చిత్తచాంచల్యం సక్కు చని పోవడం ఏమిటి? ఆమె మా ఇంట్లోనే ఉన్నది. అని మాయాసక్కుబాయిని పిలిచి చూపించాడు. వచ్చిన గ్రామస్తులు ఆశ్చర్యపోయారు. తమ చేతుల మీదుగానే దహన సంస్కారం జరిగింది. మరి సక్కుబాయి ఇక్కడున్నది ఏమిటి? అని ఆలోచిస్తూ ఉండగానే యాత్రకు వెళ్లిన సక్కుబాయి లోపలికి వచ్చి భర్త పాదాలకు నమస్కరించింది. ఒకే చోట ఇద్దరు సక్కుబాయిలు కనిపించేసరికి అందరూ ఆశ్చర్యపోయారు. వాస్తవం ఏమిటి అని అందరూ ఏకకంఠంతో ప్రశ్నించారు. గ్రామస్తులు చెప్పినదే సత్యం. నేను గతించిన మాట వాస్తవం. రుక్మిణీదేవి తపః ప్రభావంచే బ్రహ్మదేవుడు నన్ను మరల బతికించాడు అన్నది. మరి ఈవిడ ఎవరు అందరూ ఒక్కసారి మాయాసక్కు బాయిని దర్శించారు. అంతే మాయాసక్కుబాయి మందహాసం చేస్తూ అదృశ్యం కావడం జరిగింది. సక్కుబాయికి మాత్రం శంఖ, చక్ర, గదా, పద్మాలతో పాండురంగడు దర్శనమివ్వడం జరిగింది. జగన్మోహనుని దివ్యదర్శనమును తిలకించి, పులకాంకితయైన సక్కుబాయి స్వామి పాదాలపై వాలింది. అంతే! సక్కుబాయి జీవన చైతన్యం పాండురంగని అనంత చైతన్యంలో లీనమైనది.

మహా భక్తురాలైన సక్కుబాయి భక్తిని గాంచిన వారందరూ బిగ్గరగా రోదించారు. ఆమె పాదాలపై పడి నమస్కరించారు. నిరంతరం భగవంతుని ధ్యానంలో జీవించే భక్తులు ధన్యజీవులు. వారి సాంగత్యం దుర్లభం, లభించినా వారిని అర్థం చేసుకోవడం కష్టం. అర్థం చేసుకున్నట్లైతే అమోఘం అని నారద మహర్షి భక్తి సూత్రాలలో తెలియచెప్పారు.

**ఓం నమో భగవతే వాసుదేవాయ**

# మీ ప్రశ్న - మా సమాధానం

**నిర్వహణ:**
**డా. మరింగంటి లక్ష్మణాచార్యులు**

**1.భగవద్గీతలోని "సర్వధర్మాన్ పరిత్యజ్య... అనే శ్లోకంలో "ధర్మాన్" అంటే? అనగా అన్ని ధర్మాలను వదిలేయమంటే...?**

జవాబు – ధర్మములో ఈ శ్లోకములో కనబడే (దృశ్య) భావనల నన్నింటినీ అని అర్థము. అన్ని ధర్మాలను అంటే కర్తవ్య ధర్మాలు, లౌకికమైన స్వల్ప, స్వల్పమైన ధర్మ మార్గాలు విధానాలు – వీటిని వదిలి మహాధర్మమును ఆచరించమని అర్థం. పెద్ద ధర్మము ఉన్నప్పుడు చిన్న ధర్మములను పట్టుకొన అవసరము లేదని అర్థము. అంతేకాని చిన్నధర్మములు ఎక్కువ అనో, వాటిని వదిలి సోమరి అవమనో కాదు. చెట్టు మూలాన్ని తడిపితే ఆ చెట్టు శాఖా పత్రాదులన్నిటినీ తడిపినట్టే కదా! మహాధర్మము అనగా 'భగవచ్ఛరణాగతి' అనేది నిత్యనైమిత్తికాది సమస్త ధర్మముల కంటెను, కర్మల కంటెను ఎన్నియో రెట్లు అధిక ఫలమును అందిస్తుంది. దైవము పట్ల దృఢమైన విశ్వాసము, శరణాగతి, ఇవి అన్నిటికన్నా మిన్న, అందరికీ సులువుగా అందుబాటులో ఉన్నదని భావం.

**2. ఈ మధ్యనే మనం ఎంతో వైభవంగా జరుపుకున్న మహా భక్తురాలు శ్రీ గోదాదేవి మార్గళి వ్రతం గురించి క్లుప్తంగా తెలియచేయగలరు. - మరింగంటి లక్ష్మి, విజయవాడ.**

జవాబు – గోదాదేవి భూదేవి అంశతో అయోనిజగా విష్ణుచిత్తుడు (పెరియాళ్వార్) అనే మహానుభావుడికి తులసివనంలో లభించిన కారణ జన్మురాలు. శ్రీకృష్ణుని మహాభక్తురాలు. బాల్యం నుంచే శ్రీకృష్ణుని తన పతిగా భావించి, ద్వాపరయుగంలో గోపికలు ఆరాధించి, ఆచరించిన కాత్యాయనీ వ్రతం స్ఫూర్తితో తాను తన స్నేహితురాళ్ళతో కలిసి ఈ మార్గళి నోమును చక్కగా ఆచరించినది.

తన వ్రతానికి ఫలితంగా భూమండలమంతా సుభిక్షంగా ఉండాలని, అలాగే తామందరికీ ఆ పరమాత్మ నిత్య సేవాభాగ్యమే కావాలని, తన వ్రతానికి కావలసిన సామగ్రి కోరడమనే మిషతో, గోదమ్మ స్వామిని అర్థించి తరించింది. తిరుప్పావై నాచ్చియార్, తిరుమొళి అనే రెండు అద్భుతమైన గ్రంథాలు రచించి మనకు అందించింది. పూమాలతో, పామాలలతో (పాశురాలు/పాటలు), ఆరాధించి, మనకు ముక్తిపథం చూపింది. ఆమె రచించిన "తిరుప్పావై" అంటే అ+ఆ అని చెప్పవచ్చు. అ అంటే అచ్యుత వైభవం. ఆ అంటే ఆచార్యుని ఘనత. తిరుప్పావై అనేది పైకి శ్రీకృష్ణవైభవం తెలిపినా (వ్యాచ్యార్థం) లోపల, అంతరార్థంగా ఒక గొప్ప ఆచార్యుని ఘనతను (ధ్వనిగా) ఎంతో హృద్యంగా వర్ణిస్తుంది. గోదా (ఆండాళ్) అంటే జ్ఞానము, సంపద మొదలగునవి ఇచ్చునదని, ఆండాళ్ అంటే రక్షకురాలు అని అర్థం. మరిన్ని విశేషాలు తెలియాలంటే ధనుర్మాసంలో నిర్వహించబడే తిరుప్పావై ప్రవచనాన్ని తప్పక వినాలి.

**జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు. భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు. – ఎడిటర్, శ్రీవేంకటేశం**

ధారావాహికం



# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా॥ విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

## వృషభాసురుని వృత్తాంతం :

ఆ రోజుల్లో వృషభాసురడనే శివభక్తుడు శ్రీశైలానికి దక్షిణం వైపున సంచరిస్తున్నాడు. అతడు విశాలమైన ఆ పర్వతాన్ని చూసి ఆశ్చర్యచకితుడై ఆ పర్వతం అక్కడికి రావడానికి కారణాన్ని అన్వేషించసాగాడు. ఈ పర్వతాన్ని సృష్టించిన మాయావి ఎవరో దీనిపైనే తప్పకుండా దాగుకొని ఉంటాడు. నేను అతనిని వెతకటానికి ప్రయత్నిస్తాను. అతనిని వెతికి పట్టుకొని అతనితో నిర్భయంగా యుద్ధం చేస్తాను. అని ఆలోచించి తనకపకారం చేసిన ఆ శత్రువును వెతుకుతూ అక్కడక్కడ సంచరిస్తూ బలగర్వంతో విర్రవీగుతూ ఆ పర్వతంపై విహరించసాగాడు.

వృషభాసురుడు భగవంతునితో యుద్ధం :

అలా సంచరిస్తూ ఉండగా ఆ వృషభాసురుడు ఒకచోట ధనుర్ధారియై గుర్రమెక్కి శబరవేషంలో విహరిస్తున్న శ్రీనివాసుని చూచాడు. ఆయనను చూసి అతనే తన శత్రువని నిశ్చయించుకొని ఆ రాక్షసుడు క్రోధావిష్టుడై వెంటనే అతనిని వెంబడిస్తూ 'ఆగుమని హెచ్చరించాడు. ఆ తరువాత వారిద్దరిమధ్య భయంకరమైన ఘోరయుద్ధం జరిగింది. వృషభాసరుడు ఆ శబరాధిపతిని పిలిచి దూషించాడు. అప్పుడు శబరినాయకుడు కోపించి సర్వసైన్యాలతో సన్నద్ధుడై అడవి కుక్కల సమూహములు తనవెంటరాగా తనసేనలతో తీక్ష్ణములైన బాణములతోను, ఈటెలతోను, ఖడ్గముతోను, గదలతోను, శక్త్యాయుధముతోను, శూలాలు గండ్రగొడ్డళ్ళు, బల్లాలు, రోకళ్ళతోను, వృక్షాలతోను, రాళ్ళతోను భయంకరమైన యుద్ధం చేశారు.

అయినప్పటికీ ఆ అసురుడు ఆ శబరులందరినీ జయించి ముందుకు వస్తున్నాడు. అప్పుడా శబరనాయకుడు ఆ రాక్షసుని చూసి విష్వక్సేనుని ఆజ్ఞాపించాడు. అంతట విష్వక్సేనుడు గంధర్వసమూహంతో అతన్ని ఎదుర్కొన్నాడు. వారిరువురి మధ్య భయంకరమైన యుద్ధం జరిగింది. ప్రతాపవంతుడైన విష్వక్సేనుడు వృషభాసురునిపై అనేక శస్త్రాస్త్రాలు ప్రయోగించాడు. అతనిని జయించటం కష్టమని తెలుసుకొని మాయా వరగర్వతుడు. శత్రువుల పట్టణాలను జయించే వృషభాసురుడు తన మాయతో వందల కొలది, వేలకొలది భయంకరమైన రాక్షసులను అనేక దివ్య శస్త్రాస్త్రాలను సృష్టించి నారాయణుని సంహరించవలెననే కోరికతో, కోపంతో వాటిని ఆయనపై ప్రయోగించాడు వృషభాసుడు ప్రయోగిస్తున్న శస్త్రాస్త్రాలన్నింటిని శ్రీహరి తన మాయతో భస్మం చేసేశాడు. ఇక యుద్ధంలో శ్రీహరిని జయించటం సాధ్యం కాదని తెలుసుకొని మాయావియైన ఆ రాక్షసుడు తన మాయతో అంతర్ధానం చెందాడు.

అంతట సర్వేశ్వరుడైన శ్రీహరి తనవైపు వస్తున్న ఆ మాయను చూచి దుష్టసంహారకమైనది, దేవతలందరు

నమస్కరించేది అయిన, తన సుదర్శన చక్రాన్ని ఆ రాక్షసునిపై ప్రయోగించాడు. అప్పుడా సుదర్శన చక్రము నుండి వేలకొలది జ్వాలలు విజృంభించాయి. దావాగ్నివలన అడవి దగ్ధమైనట్లు ఆ భయంకరజ్వాలలతో అతని సైన్యమంతా నశించింది. ఆ రాక్షసవీరులు ధరించిన కవచాలు కాలిపోయినై. ఆ రాక్షసుల విచిత్రాయుధాలన్నీ కూడ ఆ అగ్నిలో దగ్ధమైపోయినై. ఆ సుదర్శనం ప్రభావంవలన అద్భుతమైన ఆ అసురసేనంతా పరమాద్భుతమైన ఆ పర్వతంలో కొంచెం కూడ కనబడలేదు.

## వృషభాసురుని ప్రార్థన :

అంతట వృషభాసురుడు మాయ నశించుట చూచి ఆశ్చర్యచకితుడై ఇలా ఆలోచించసాగాడు–"ఆ శబరనాయకుడు పంపిన చక్రాయుధం నన్ను కూడ తప్పకుండా చంపే తీరుతుంది. నాకు మరణ సమయం సమీపించింది. ఇందుకు సందేహం లేదు. ఈ మహాపురుషుడు మానవ మాత్రుడు కాదు. ఆతడు సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపుడే అయి ఉండాలి. ఆతడు సర్వలోకాలను సృష్టించేవాడు, దేవతలందరికి పూజ్యుడు అని భావిస్తున్నాను. ఈ పరమపురుషుని చేతిలో మరణించినవాడు సర్వ పాపాల నుండి విముక్తు డవుతడు. అతడు భవసాగరాన్ని తరించి పరమపదాన్ని పొందుతాడు." అని చింతిస్తూ భగవంతుని చేతిలో మరణించుటకు సంతోషిస్తూ, తన మనస్సులోని కోరికను గూర్చి భగవంతునిలా ప్రార్థించాడు.

**దేవ దేవ! జగన్నాథ! సర్వలోకైకకారణ! ।**
**శరణం త్వామనుప్రాప్తః ప్రణతార్తి హర! ప్రభో! ॥**

**-బ్రహ్మాండ పురాణం అధ్యాయం.4.శ్లోకం. 35.**

ప్రభూ! దేవదేవా! జగన్నాథా! నీవు లోకాలన్నిటికి మూలకారణము శరణు వేడినవారి ఆర్తిని పోగొట్టే నిన్ను నేను శరణువేడుచున్నాను. ఈ చరాచరాత్మకమైన ప్రపంచమంతా నీవు వ్యాపించి ఉన్నావు. ముల్లోకాల్లో నీవు లేని వస్తువేదీ లేదు. బ్రహ్మాది సకల దేవతలు నీ ఆజ్ఞానుసారం ప్రవర్తించేవారే నీ ఆజ్ఞచేతనే వాయువు వీస్తున్నాడు ప్రతి రోజు సూర్యుడు ఉదయిస్తున్నాడు. నీకు భయపడి అగ్నిహోత్రుడు జ్వలిస్తున్నాడు. దేవేంద్రుడు నీ శాసనానికి కట్టుబడి పరిపాలిస్తున్నాడు. యముడు నీకు భయపడి పరుగెత్తు తున్నాడు! అని వేదం చెబుతున్నది.

కావున ఓ మహాదేవా! నీవు నన్ను రక్షించు కాపాడు. నీవు తప్ప నాకు వేరే దిక్కులేదు. యోగులు, నీ దర్శనానికి జితేంద్రియులై మోక్షం కొరకు నిన్ను అన్వేషిస్తున్నారు. అటువంటి నీవు నాకు ఇప్పుడు దర్శనమిచ్చావు. ఓ మహాబాహూ! నేను చేసినటువంటి అపకారాన్ని సహింపరాని అపరాధాలన్నింటిని దయతో క్షమించు. నీ వంటి వారికి నమస్కరించడమే పాపాత్ములకు ప్రాయశ్చిత్తం. క్షుద్రం, పాపకారణమైన ఈ జీవితాన్ని నేను కోరుట లేదు. కాబట్టి నీ సుదర్శన చక్రంతో నిహతుడనై పరమ గతిని పొందుతాను. కావున ఓ శ్రీనిధీ! దయానిధీ! మధుసూదనా! ప్రభూ! నన్ను క్షమించు నీవు తప్పనాకు రక్షకులులేక నేటినుండి ఎత్తైన శిఖరములు గల ఈ పర్వతము నా పేరుతో 'వృషభాచల' మని ప్రసిద్ధి పొందుగాక!

**అద్య ప్రభృతి చాయం వై గిరిరుచ్ఛ్రితశేఖరః ।**
**మదాఖ్యయా ప్రథాలయాతు 'వృషభాచల' ఇత్యపి' ॥**

**-బ్రహ్మాండపురాణం.అ.4.శ్లో.43.**

ఈ విధముగా దుఃఖాక్రాంతుడై కళ్ళవెంట కన్నీరు కారుస్తూన్న వృషభాసురుణ్ణి చూసి భగవానుడు మందహాసంతో యిలా అన్నాడు–

**వృషభాసుర! మద్భక్త్యా విముక్తిం యాస్యసి ధ్రువమ్ ।**
**గిరిశ్చాయం భవన్నామ్నా ప్రసిద్ధిమధిగచ్ఛతు ॥**

**-బ్రహ్మాండ పురాణం.అ4.శ్లో.45.**

'ఓ వృషభాసురా! నీవు నా యందలి భక్తి వలన తప్పకుండా ముక్తిని పొందుతావు. ఈ పర్వతం కూడా నీ పేరుతో 'వృషభాచలం'గా ప్రసిద్ధిచెందుతుంది. అని భగవంతుడు వరం ప్రసాదించగా ఆ దానవేశ్వరుడు సంతుష్టాంతరంగుడై భగవంతుని దివ్యా నిగ్రహాన్ని మహాప్రసాదంగా భావించి తన మరణాన్ని గురించి చింతించసాగాడు.

అంతట ఆ సుదర్శన చక్రం భయంకరమైన జ్వాలలతో సురవైరి అయిన శిరస్సును కాడనుండి పద్మాన్ని వేరు చేసినట్టుగా ఖండించింది. అంతట యుద్ధ దురహంకారి అయిన ఆ వృషభాసురుడు నేలకొరిగాడు. దేవతలు సంతోషంతో పుష్పవర్షాన్ని కురిపించారు. దేవదుందుభులు మ్రోగినాయి. అప్సరోగణాలు నాట్యం చేశారు. దిక్కులన్నీ నిర్మలంగా ప్రసన్నంగా ప్రశాంతంగా ఉన్నాయి. మందమారుతం సుఖంగా వీచింది. దయామూర్తి అయిన గోవిందుడు వృషభాసురునికి ఈ విధంగా వరమిచ్చి మరల శేషాద్రికి వెళ్ళి యథాస్థానంలో ఉన్నాడు. అని నారదమహర్షి భృగుమహర్షికి వృషభాసుర వృత్తాంతాన్ని వివరించాడు.

## అంజనాదేవి జననం :

అంతట భృగుమహర్షి నారదమహర్షిని 'ఓ మహామునీ! భగవంతుని అద్భుతమైన దివ్య చరిత్రలను వింటున్న నాకు తృప్తి కలుగుట లేదు. కావున ఆ మహాత్ముని దివ్యగాథలను యింకా చెప్పండి' అని అడుగగా నారదమహర్షి యిలా చెప్పసాగాడు–

'ఓ భృగుమహర్షీ! నేను చెప్పేదాన్ని నీవు ఏకాగ్రచిత్తంతో విను. ఆ దేవదేవుని మాహాత్మ్యము బహువిచిత్రమైనది. దానిని మునులంతా కీర్తించారు. పూర్వం త్రేతాయుగంలో 'కేసరి' అనే రాక్షసుడు పుత్రసంతానాన్ని కోరి శంకరుని గూర్చి తీవ్ర

నిష్ఠతో తపస్సు చేశాడు. అతడు మనోనిగ్రహంతో పవిత్రుడై నిరాహారుడై, జితేంద్రియుడై నిత్యము శివపంచాక్షరీ మహా మంత్రాన్ని జపిస్తూ శంకరుని సంతోషపెట్టాడు. సర్వలోకాలకు సుఖాన్ని కలిగించే శంకరుడు అతని తపస్సుకు సంతుష్టుడై అతనికి ప్రత్యక్షమయ్యాడు. కేసరి పరమ శివునికి సాష్టాంగ దండ ప్రణామమాచరించాడు. అంతట ఈశ్వరుడు చిరునవ్వుతో 'ఓ సుపుత్రా! నీకు శుభమగుగాక!

నీ ఈ తపస్సుతో నేను సంతుష్టుడనయ్యాను. నీ మనస్సులో ఏది కోరుకుంటున్నావో దానినడుగు వరమును ప్రసాదిస్తాను! అనగా కేసరి 'ఓ దేవదేవా మహానుభావా! నీవు అనుగ్రహించినట్లయితేనే కోరే వరాన్ని ప్రసాదించు! యుద్ధాలలో వెనుదిరగనివాడు మహాబలవంతుడు, మహాధైర్యవంతుడు, మహా బుద్ధిమంతుడు అయిన పుత్రుణ్ణి నాకు ప్రసాదించు' అని అడిగాడు. అప్పుడు శంకరుడు 'కేసరీ! నేను నీ తపస్సుకు సంతుష్టుడనైనప్పటికిని నీకు పుత్రుణ్ణి ప్రసాదించలేను ఎందుకంటె పూర్వం బ్రహ్మదేవుడు నీకు పుత్రసంతానం లేకుండా చేశాడు. అయినప్పటికీ నీకు రూప యౌవన సౌందర్యవతి అయిన కన్యను ప్రసాదిస్తాను. ఆమెకు నీవు కోరినటువంటి పుత్రుడు త్వరలోనే తప్పక కలుగుతాడు. అని కేసరికి వరాన్నిచ్చి పరమేశ్వరుడు అక్కడే అంతర్థానమయ్యాడు. ఆ రాక్షసరాజు కూడ తన అభీష్ట వరాన్ని పొంది సంతోషంతో వెళ్ళాడు.

కొంతకాలం తరువాత కేసరికి లోకానికి ఆశ్చర్యం కలిగించే సర్వలక్షణసంపన్నుయైన కుమార్తె కలిగింది. ఆమెకా రాక్షసరాజు 'అంజనా' అని పేరు పెట్టాడు. ఆ బాలిక క్రమ క్రమంగా శుక్ల పక్ష చంద్రునివలె దినదిన ప్రవర్ధమానయై మృదుమధురంగా మాట్లాడుతూ అందరికీ నేత్రానందాన్ని కలిగిస్తున్నది. రోజురోజుకు తండ్రికి ఆమె యందు ప్రీతి అధికమయ్యింది. ఆయన ఆమెను పుత్రప్రేమతో లాలించి పెంచాడు. ఆమె చెలికత్తెలతో బంతులాటలు ఆడుతుంటే ఆయన ఆ దృశ్యాన్ని మరలమరల ఆనందంతో విప్పారిన కనులతో వీక్షించి తృప్తి చెందేవాడు.

ఇలా ఉండగా ఆమె వివాహయుక్త వయస్కురాలైంది ఒకనాడు 'కేసరి' అనే వానర శ్రేష్ఠుడు వచ్చి ఆమెను తనకిచ్చి వివాహంచేయాలి అని ఆమె తండ్రిని అడిగాడు. ఆ దైత్యరాజైన కేసరి సంతోషంతో అంజనాదేవిని ఆ 'కేసరి' అనే వానర శ్రేష్ఠుని కిచ్చి వివాహం చేశాడు. ఆ వానరేంద్రుడు కోరిన రూపం ధరించే కామరూపి యైన ఆ కన్యకతో సుఖంగా క్రీడించాడు.

## వేంకటాద్రిపై అంజనాదేవి తపస్సు :

మహాసాధ్వియైన అంజనాదేవి కేసరి అనే ఆ వానర శ్రేష్ఠునితో చాల కాలం సకల భోగాలు అనుభవించింది. కాని ఆ దంపతులకు తగిన సంతానం కలుగలేదు. అందుకామె ఈ విధంగా విచారించింది. "అయ్యో! నా తండ్రి నన్ను పుత్ర ప్రేమతో పెంచాడు. ఆయన ఋణాన్ని నేనెలా తీర్చుకుంటాను? దురదృష్టవంతురాలైన నాకు సంతానం కలుగలేదు. పుత్రులు లేని స్త్రీలకు పరలోకంలో సుఖం కలుగదు పుత్ర సంతతి లేని నా కులం ఎలా విస్తరింస్తుంది? నా వంశం ఎలా వృద్ధి చెందుతుంది? తమ ఒడిలో పడుకొన్న పుత్రుల బోసినవ్వుల ముఖాలను చూచి ఆనందించే పుత్రవాత్సల్యంగల తల్లులు ధన్యులు గదా!"

అంజనాదేవి ఈవిధంగా పుత్రునికొరకై పరిపరి విధాల చింతించి, బ్రాహ్మణులను రావించి వారిని యథావిధిగా పూజించి, వారి ఆశీర్వాదాలు పొందింది. ఆ యశస్విని వారు కోరిన వాటిని దానం చేసింది. జ్యోతిష్యులను, శకునములు తెలిసిన వారిని తన సంతాన ప్రాప్తి గురించి అడిగేది. ఆమె నియమ నిష్ఠలతో అనేక వ్రతాల నాచరించింది. గోశాలలో రోకళ్ళను పరచి, ఇంద్రియాలను జయించి, ఉపవాసాలు చేస్తూ ఆ జగత్ప్రభువును సంతోషపెట్టింది. ఇలా నిశ్చల చిత్తంతో అనేక విధాలైన వ్రతాలు, దానాలు మొదలైన పుణ్య కార్యాలు చేసినప్పటికీ ఆమె పుత్ర సంతానం వలన కలిగే ఆనందాన్ని పొందలేక పోయింది.

ఇలా చాలాకాలం గడువగా ధర్మదేవతకు ఆమె యందు దయ కలిగింది. ఆమె సోదికత్తె రూపం ధరించింది. తలపై బుట్టనుపెట్టుకొంది. చేతిలో కర్రను పట్టు కొంది వీపున చంటి బిడ్డను కట్టుకుంది. 'సోదిచెబుతాను. అడగండి' అని మాటి మాటికి పలుకుతూ, అలసట లేనిదై పిల్లల చేతులు చూచి ఫలితాలను చెబుతు ఆ ధర్మ దేవత నెమ్మదిగా అంజనాదేవి సమీపానికి వచ్చింది. అంజనాదేవి ఆమెను పిలిచి మంచి ఆసనంపై కూర్చోబెట్టింది. బంగారు చేటలో ముత్యాలు, బియ్యముపోసి తెచ్చి, ఆమెకిచ్చి, ఆ సోదికత్తెను సంతృప్తిపరచింది. ఆ తరువాత అంజనాదేవి విచారమును మాని ఆ సోదికత్తెనీ విధంగా ప్రశ్నించింది.

"భవిష్యత్తు తెలిసినదానా! నాకు పుత్రసంతాన ప్రాప్తి ఉన్నదా?లేదా? ఓ ధర్మజ్ఞురాలా! నిన్ను ప్రశ్నిస్తున్న నాకు నిజం చెప్పు నేను నాకు ఇష్టుడు, బలవంతుడు అయిన పుత్రుని త్వరలో పొందినట్లైతే నీవు కోరినవన్నీ ఇస్తాను" అనగా ఆ సోదికత్తె అంజనాదేవితో" అమ్మా నీవు కోరిన పుత్రుడు నీకు తప్పక కలుగుతాడు. ఇందుకు సందేహంలేదు. నీవు దుఃఖించవద్దు. ఓ కల్యాణీ! నేను నా ధర్మంపై ప్రమాణం చేసి చెబుతున్నాను.

**శ్రీవేంకటగిరౌ సప్తసాహస్రం వత్సరాన్ పునః ।**
**తపః కురు తతఃపుత్రమవాప్స్యసి సుశోభనమ్ ॥**

**-బ్రహ్మాండ పురాణం. అధ్యాయం 5.శ్లోకం. 17.**

నీవు వేంకటాద్రిపై ఏడువేల సంవత్సరాలు భగవంతుని గూర్చి తపస్సు చెయ్యి అప్పుడు చక్కని పుత్రుని పొందుతావు."అనిచెప్పి

ఆ సోది కత్తె వచ్చిన దారిని వెళ్ళింది. అంజనాదేవి ఆమె చెప్పిన మనస్సుకింపైన మాటలను తలచుకొంటూ వెంకటాచలానికి వెళ్ళి, సిద్ధ సంఘాలు సేవించే ఆకాశగంగా తీరంలో తపస్సు చేయడాని కుపక్రమించింది.

ఆమె వాయుభక్షణ చేస్తూ, భయంకరమైన తపస్సు చేసింది. ఆమె ఇంద్రియాలను జయించి, ప్రశాంత చిత్తంతో, మనస్సును నిగ్రహించి వ్రతాలతో, నియమాలతో ఆయనను సంతోషపెడుతూ తపస్సు చేసింది ఆమె తపస్సుకు మెచ్చి వాయుదేవుడు ప్రత్యక్షమై ప్రతిరోజు ఆమె తినుటకు ఒక పండును ఆమె కిస్తూ ఉన్నాడు. ఇలా ఏడువేల సంవత్సరాలు గడిచాయి.

ఆ తరువాత ఒకనాడు పరమశివుడు పార్వతీదేవితో పాటు ఆ ఆశ్రమప్రాంతానికి వచ్చాడు. పార్వతీ పరమేశ్వరులు ఆ వనాలలో విహరిస్తూండగా ఆ సమయంలో అక్కడకు విలాసంగా వచ్చిన వానర మిథునం క్రీడిస్తూ ఉన్నది. అద్భుతమైన వాటి విలాస క్రీడను శివుడు పార్వతీదేవికి చూపించాడు. ఆమె క్రీడిస్తున్న ఆ వానర మిథునాన్ని చూచి కొంచెం సిగ్గుపడింది. ఆమెకు తామిద్దరం కూడా వానరరూపాల్ని ధరించి విహరించాలని కోరిక కలిగింది. లోకం రీతి ఈ విధంగా ఉంటుంది. అంతట పార్వతీ పరమేశ్వరులిద్దరు వానరరూపాలు ధరించి ఆ అడవిలో ఆనంద పరవశులై క్రీడించారు. వారి వీర్యాన్ని వాయుదేవుడు ఆకుదొన్నిలో తెచ్చి అంజనాదేవి చేతిలో పెట్టాడు.

ఆమె దానిని తినే పదార్థంగా భావించి తినేసింది. క్రమంగా కొన్నాళ్ళకు ఆమెకు గర్భధారణ చిహ్నాలు పొడచూపినై. ఆమె ముఖము పద్మము వలె వికసించింది. అందుకామె విచారిస్తూ" ఏ పాపం ఎరుగని నాకు గర్భమెలా వచ్చింది? అయ్యో! ఏమి నా దౌర్భాగ్యం ఏ దోషంవల్ల నాకీ స్థితి కలిగింది?"అని విచారిస్తూ, దుఃఖిస్తూ సిగ్గు పడుతున్నది.

అప్పుడు ఆకాశవాణి ఆమె నోదారుస్తూ ఇలా పలికింది. బిడ్డా! నీవు దుఃఖించవద్దు. నీకు జరగవలసినదే జరిగినది. రావణుడనే దుష్ట రాక్షసుడు లోకకంటకుడై దేవతాస్త్రీలనందరినీ బందీలుగా చేస్తాడు. వాడు తన క్రూర కర్మలతో ముల్లోకాలను ఏడిపిస్తాడు. అందువలన అతడు రావణుడుగా ప్రసిద్ధి చెందుతాడు. అంతట అతనిని సంహరించుటకై శ్రీహరి దేవతల ప్రార్థన మేరకు భూలోకంలో పవిత్రమైన రఘువంశంలో అవతరిస్తాడు. అప్పుడాయనకు సహాయం చేయడానికై అపరిమిత బల పరాక్రమ సంపన్నుడు, శౌర్య, ధైర్య గుణోపేతుడు, మహాబలవంతుడు, జితేంద్రియుడు, అసంఖ్యాక సద్గుణములుగల పుత్రుడు నీకు కలుగుతాడు."

అంజనాదేవి ఆకాశవాణి పలుకులు విని సంతోషించి తన తండ్రికి జరిగిన వృత్తాంతాన్ని, ఆకాశవాణి మాటలను తెలియజేసింది. అది విని ఆమె తండ్రి పరమానందాన్ని పొందాడు. అంజనాదేవికి పుత్రుడు ఎప్పుడు కలుగు తాడా అని ఆయనకు ఉత్కంఠ ఎక్కువైంది. అంజనాదేవి శరీరం తెల్లబడి శుక్లపక్షంలో కళంకంలేని చంద్రరేఖ వలె ప్రకాశించింది. ఆమె గర్భభారంతో నేలపై కూర్చోలేక లేవలేక పోయింది. ఈ విధంగా ఆమె గర్భము సంతోషాన్ని పెంపొందిస్తూ అభివృద్ధిచెందింది.

అంతట పదవ నెలరాగా అంజనాదేవి శ్రావణమాసంలో ఏకాదశినాడు, శ్రవణానక్షత్రంలో, సూర్యోదయవేళ బలిష్ఠుడైన పుత్రుని ప్రసవించింది. అతని చెవి కుండలాలతో అతని చెక్కిళ్ళు ప్రకాశిస్తున్నై. భుజాన యజ్ఞో పవీతం మెరుస్తున్నది. కౌపీనాన్ని ధరించాడు. అతడు తేజస్సుతో వెలిగిపోతున్నాడు. అతడు అత్యద్భుతమైన వానరరూపాన్ని ధరించాడు. అతని ముఖము, తోక మొదట్లో ఎర్రగా ఉంది. అతడు బంగారు ఛాయతో ప్రకాశిస్తున్నాడు. అటువంటి తేజశ్శాలి, మహా బలవంతుడు అయిన బిడ్డను చూసేకొని అంజనాదేవి పరమానందంతో మురిసిపోయింది. తన తపస్సు ఫలించినందుకు సంతోషించింది.

ఆంజనేయుడు సూర్యునిపైకి దూకుట :

ఆ బాలునికి పుట్టిన వెంటనే చాల ఆకలి వేసింది. అతడు ఉదయాచలంపై బాగా ఎర్రని రంగుతో విరాజిల్లుతున్న సూర్యుని చూశాడు. అతడు ఫలమనుకొన్నాడు. వెంటనే దానిని పట్టుకొని తినాలని భావించి, వేంకటాద్రి చరియలనుండి ఉదయాద్రిపైకి మహావేగంతో దూకాడు. ఆపైన సూర్యబింబాన్ని గట్టిగా పట్టుకోవడానికి ప్రయత్నించాడు. అదిచూచి చరాచర జగత్తంతా హాహాకారాలు చేసింది. అప్పుడు చతుర్ముఖ బ్రహ్మ తానే స్వయంగా వేగంగా వచ్చి ఆ బాలుని చంపాలని బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. ఆ ఆశ్రమంలో ఆటలాడుకుంటున్న ఆ బాలుడు వచ్చి విలాసంగా తనతోకచివరితో తానిని త్రోసివేసి నిశ్చింతగా ఉన్నాడు.

బ్రహ్మదేవుడు ప్రయోగించిన బ్రహ్మాస్త్రం వెనుదిరిగి రావడం చూచి దేవతా సమూహాలన్నీ ఆశ్చర్యపడినై. ఈ బాలుడు ఆకాశానికి ఎగరడం ఏమిటి? సూర్యుని పరుగెత్తి పట్టుకోవడమేటి? బ్రహ్మాస్త్రమును త్రిప్పికొట్టడ మేమిటి? అని వారంతా ఆశ్చర్యంతో మాట్లాడుకుంటున్నారు, దేవతలు, దానవులు గంధర్వులు, యకక్షులు, నాగులు, రాక్షసులతో సహా ప్రపంచమంతా ఆ వానరబాలుని అద్భుత కృత్యాన్ని చూసి విస్మయం చెందింది.

అంతట హనుమంతుడు సూర్యుణ్ణి చూసి నిరాశ చెందాడు. ఆ తేజోమూర్తి బ్రహ్మాస్త్ర ప్రభావంతో, దాని చేత కొట్టబడి భూమిపై పడ్డాడు. అప్పుడు అంజనాదేవి అక్కడకు వచ్చి దుఃఖించింది. కంటినుండి బాష్పబిందువులు నిండగా ఆమె దేవతలతో ఇలా అన్నది–ఓ దేవతలారా! మీరంతా దయలేనివారు. పసిబిడ్డపై బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి కృతార్థులైనట్లు భావిస్తున్నారు.

మీకిటువంటి పుత్రులు లేరా? ప్రారబ్ధకర్మ ఈ విధంగా ఉంది. ఇంతటి ఘోరం ఎక్కడైనా ఉందా? నా బిడ్డ మీకేమి అపకారం చేశాడు? మీ రెండుకిలా నిర్దయులై ప్రవర్తించారు?" అని పరుషంగా మాట్లాడుతున్న అంజనాదేవిని దేవతలంతా ఊరడించారు. హనుమంతుడు పరమేశ్వరాంశ సంభూతుడగుట వలనను, రాబోయే దేవకార్యాన్ని దృష్టిలో పెట్టుకొని వద్దు, బుద్ధిమంతుడైన నీ పుత్రునికి దుర్లభమైన దివ్యవరాలనిస్తాము. ఇతర దేవ, దానవ, గంధర్వ, యక్ష, రాక్షస సమూహములచేతను, పశాంచము చేతను, గుహ్యకులచేతను చంపబడకుండుగాక! ఇది తథ్యం అలాగే శస్త్రములచేతను, బాణముల చేతను నీ కుమారుడు చంపబడకుండునట్లు మేము ఆజ్ఞాపిస్తున్నాము. (వరమిస్తున్నాము) అతడు బలం, పాండిత్యంలోను అందరినీ మించిపోతాడు నీ కుమారుడిని ఎదిరించుటకు శత్రువులకు సాధ్యం కాదు" అని దేవతలందరు ఆంజనేయునికి వరాలిచ్చారు.

## క్రీడాద్రికి 'అంజనాద్రిగా' ప్రసిద్ధి

అంతట చతుర్ముఖ బ్రహ్మ అంజనాదేవిని పిలిచి ఇలా అన్నాడు–

"అంజనే! త్వం హి శేషాద్రౌ తపస్తప్త్వా సుదారుణమ్!
పుత్రం సూతవతీ యస్మాత్ లోకత్రయ హితాయ వై ।
ప్రసిద్ధిం యాతు శైలో యమంజనే! నామతస్తవ ॥
'అంజనాచల' ఇత్యేవ నాత్ర కార్యా విచారణా" ॥

**-బ్రహ్మాండపురాణం, అధ్యాయం 5. శ్లోకాలు 64,65.**

"ఓ అంజనాదేవీ! శేషాద్రిలో ఘోర తపస్సుచేసి, ముల్లోకాలకు హితం చేకూర్చే పుత్రుని కన్నావు. కావున ఈ పర్వతం నీ పేరుతో అంజనాద్రిగా ప్రసిద్ధి చెందుగాక! ఈ విషయంలో ఆలోచించవలసిన దేమీ లేదు." అని అంజనాదేవికి వరమిచ్చి బ్రహ్మాది దేవతలంతా తమతమ స్థానాలకు వెళ్ళారు. అంజనాదేవి తన కుమారుని తీసుకొని, వేంకటాచలానికి తిరిగివచ్చి, తన ఆశ్రమంలో పుత్రునితో సంతోషంగా, కాలం గడుపుతున్నది.

## క్రీడాద్రి 'వేంకటాద్రిగా' ప్రసిద్ధి చెందుట

భృగుమహర్షి మరల నారదమహర్షిని 'ఓ మునీంద్రా! భూలోకంలో ఈ పర్వతం వేంకటాచలంగా ఎందుకు ప్రసిద్ధి చెందిందో, ఆ కారణాన్ని నాకు తెలియజేయండి' అని అడిగాడు. అప్పుడు నారదమునీంద్రుడు భృగుమహర్షితో 'ఓ మహామునీ! ఈ పర్వతం వేంకటాద్రిగా ప్రసిద్ధి చెందడానికి గల కారణాన్ని సవిస్తరంగా చెబుతాను. సావధానంగా విను' అని ఇలా చెప్పనారంభించాడు.

ఈ శ్రీ పర్వతానికి పడమటి దిక్కున 'నందన' మనే పట్టణం ఉన్నది. అది ఏనుగులు, గుర్రాలు, రథాలతో సమృద్ధిగా సుసంపన్నమై భూలోకంలో ప్రసిద్ధి చెందింది. ఆ పట్టణంలో పురందరుడనే సోమయాజి ఉండేవాడు. ఆ బ్రాహ్మణోత్తముడు వేద వేదాంగ పారంగతుడు. ఆయన యజ్ఞ యాగాదులు నిర్వర్తించేవాడు. అతనికి మాధవుడనే బుద్ధిమంతుడైన పుత్రుడు కలిగాడు. అతడు దినదినాభివృద్ధి చెందాడు. అతనికి తండ్రి ఉపనయనం చేశాడు. వేదాధ్యయన మారంభించాడు.అతడు అన్నిగుణాల్లోను తండ్రిని మించాడు. అతనికి యౌవనం వచ్చింది. అతని బాహువులు బలిసినై వక్షఃస్థలం విశాలమైంది. ఆ బ్రాహ్మణ కుమారుడు నవ యౌవనంతో శోభిస్తున్నాడు. వివాహ యుక్త వయస్సు వచ్చిన మాధవునికి చంద్రలేఖ అనే కమలలోచనతో వివాహం చేశారు. ఆమె సర్వశుభ లక్షణసంపన్నురాలై దేవకాంతవలె ఉంది. అతడామె యందు మిక్కిలి అనురాగంతో ఉన్నాడు. నవయౌవనవతి, నిరుపమాన సౌందర్యవతి అయిన భార్యతో వనవిహారాని కనుకూలమైన మనోహరమైన ప్రదేశాలలో విహరిస్తూ మాధవుడు నిత్యం ఆనందంగా గడుపుతున్నాడు.

ఇంతలో అతనికి క్రీడావిశేషాల నుపదేశించడానికో అన్నట్లుగా వసంత ఋతువు వచ్చింది. మామిడి చెట్లపై నున్న మగకోయిలలు మధురంగా కూస్తున్నాయి ఆ కోకిల స్వరాలు తమ ప్రియురాండ్రకు దూరంగా ఉన్న పురుషుల మనస్సులకు బాధను కలిగిస్తున్నాయి. అశోక వృక్షం మనో హరంగా పుష్పించింది. ఆ పుష్పం లోకాలను దహింపగోరుతున్న మన్మథుని బాగాకాల్చిన బాణంవలె ఉన్నది.

ఒకనాడు మాధవుడు భార్య చంద్రలేఖతో పాటు పూలుకోయటానికి బయలుదేరాడు అతడు భార్యతోపాటు లీలోద్యాన ప్రదేశంలో సకలవిధ పుష్పాలతో మనోహరంగా ఉన్న ఉపవనంలో అక్కడక్కడ విహరిస్తున్నాడు. అక్కడ వారికొక సరస్సు కనబడింది. అది స్వచ్ఛమైన నీటితో నిండి ఉంది. దానిలో అనేక జంతువులున్నాయి. అది తామర పువ్వులతో నిండిన పద్మవనం వలె ఉన్నది. దానిలోని పుష్పాలు సుగంధ పరిమళాన్ని వెదజల్లుతున్నాయి. దాని ఒడ్డున అనేక వృక్షాలున్నాయి.

మాధవుడు భార్యతో కూడ ఆ సరోవర తీరంలోని దట్టమైన చెట్లనీడలో విహరిస్తున్నాడు. ఇంతలో అతనికి ఒక లావణ్యవతియైన చండాల కన్య కనబడింది. ఆమె నల్ల కలువరేకుల వలె శ్యామవర్ణంతో ఉంది. ఆమె నేత్రాలు వికసించిన పద్మాల వలె విశాలంగా ఉన్నై. ఆమె వక్షస్థలము ఉన్నతంగా ఉంది. ఆమె ముఖము పూర్ణ చంద్రబింబము వలె ఉంది. ఆమె ముంగురులు నిగనిగలాడుతున్నై ఆమె మూర్తీభవించిన మన్మథుని ఆజ్ఞ వలె ఉన్నది. ఆమె నడుము సన్నగా ఉంది, ఆమె పేరు 'మారిని' మాధవుడామెను చూసి ఆమె సౌందర్యానికి ముగ్ధుడై ఈ విధంగా చింతించ సాగాడు–

"ఆహా! అత్యద్భుతమైన ఈ సౌందర్యరాశిని బ్రహ్మ ఎలా

సృష్టించాడో గదా! ఈమె చండాలజాతిలో పుట్టవలసినదికాదు. బ్రహ్మ దేవునికి కూడా ఇటువంటి సర్వాంగ సుందరిని చూడటం సాధ్య కాదనుకుంటాను. మా వంటి వారికి అనుభవించడానికి వీలుకాని ఇటువంటి సౌందర్యవలిని వ్యర్థంగా సృష్టించిన బ్రహ్మదేవుడు గ్రుడ్డివాడు కాబోలు! అయినా రత్నానికి జాతితో వివక్షతో పనేముంది! పుణ్యాత్ముడు కాని వానికిడు అద్భుతమైన ఇటువంటి రూపం లభిస్తుంది. ఈమె చండాల కన్య అయినప్పటికీ, చేరరాని దైనను, నేనీమెను సమీపిస్తాను. చండాల వాటికలో కనబడిన రత్నం నిందార్హమౌతుందా? అని ఈ విధంగా చింతించి మాధవుడు ఆమె దగ్గరకు వెళ్ళాడు.

ఆ మాలినికి కూడా అతని యందు అనురాగం కలిగింది. తీక్ష్ణములైన మన్మథ బాణములు వారిద్దరి మనస్సులను వేధించసాగినాయి. అంతట మాధవుడు తన భార్య చంద్రలేఖను ఇంటికి పంపి నెమ్మది నెమ్మదిగా మాలినిని సమీపించాడు. ఆ బ్రాహ్మణకుమారుడు ఆమె సాంగత్యం మహాపాపహేతువని విచారించకుండా సంతోషంతో ఆమెను వరించాడు. ఇంకా ఆమెతో 'ఓ సుందరీ! నేను బ్రాహ్మణుడనని నీవు భయపడవద్దు. స్త్రీరత్నాన్ని చెడ్డకులంలో నుండి కూడా స్వీకరించవచ్చని శాస్త్రం చెబుతున్నది. కావున నేను నిన్ను మధురములైన మాటలతో యాచిస్తున్నాను. నిన్ను పొందుటకు నన్ను అనుమతించు! అని వేడుకుంటూ ఆమె చేతిని తన చేతిలోనికి తీసుకుని ఆ ద్విజ కుమారుడు ఆమెతో క్రీడించాడు.

వారు తినే మాంసాదులనే యిష్టంగా తింటూ కల్లు తాగుతూ చాలా కాలం ఆమెతో విహరించాడు. కొంత కాలానికి మాధవుడు దరిద్రుడయ్యాడు. దొంగతనాలు, హత్యలు చేస్తూ ధనాన్ని సంపాదిస్తూ, ఆ ధనాన్ని ఆమెకిస్తూ కొంతకాలం గడిపాడు. ఆ తరువాత అవి కూడా చేతకాక పోవుటవలన అతనిని ఆమె బంధువులందరు వెళ్ళగొట్టారు. అతడు నిలబడుటకు నీడలేక దేశదిమ్మరియై తిరుగుతూ దైవవశాత్తు శేషాద్రిని సమీపించాడు. దైన్యంతో, బాధతో ఎలాగో అలా ఆ పర్వతాన్ని అధిరోహించాడు. వెంటనే అతని శరీరమంతా పాదాల నుండి శిరస్సు వరకు మంటలు వ్యాపించాయి. అది చాలా ఆశ్చర్యమైంది. క్షణంలో అతని పాపరాశి అంతా భస్మమై ఛటఛట మంటూ నేలపై పడిపోయింది.

పాపములు నశించిన ఆ విప్రుడు బ్రహ్మతేజస్సుతో శరత్కాల సూర్యునివలె ప్రకాశించాడు. అక్కడికి వచ్చిన మహర్షులంతా అతనిని చూచి ఆశ్చర్యపడ్డారు. వారతనితో 'ఓ బ్రాహ్మణోత్తమా! నిన్ను చూస్తుంటే మాకు చాలా ఆశ్చర్యంగా ఉంది. నీకేమైంది? నీ వృత్తాంతాన్ని ఆసాంతం మాకు సమగ్రంగా తెలియజేయమని అడుగగా మాధవుడు ఆశ్చర్యపడి మొదటి నుండి తన వృత్తాంతాన్ని ఏమీ దాచకుండా జరిగింది జరిగినట్టుగా వారికి వివరించాడు. అది విని ఆ మహర్షులందరూ పరమాశ్చర్యాన్ని పొందారు. ఆ వృషాద్రి మహిమను పొగడుతూ వారిలా అన్నారు.

**అనేన పాపజాతం వై యస్మాద్దగ్ధం ద్విజన్మనః ।**
**'వేంకటాచల' ఇత్యస్య ప్రసిద్ధిర్భువి వర్తతామ్ ॥**
**సర్వపాపాని 'వేం' ప్రాహుః 'కట' స్తద్దాహ ఉచ్యతే ।**
**సర్వపాపదహో యస్మాత్ వేంకటాచల ఇత్యభూత్ ॥**

**బ్రహ్మాండ పురాణం. అ.అ.శ్లో 42, 43.**

ఈ పర్వతం ప్రభావం వలన ఈ మాధవుని పాపసమూహాలన్నీ నశించినాయి కావున ఈ పర్వతానికి భూలోకంలో 'వేంకటాచలం' అని ప్రసిద్ధి కలుగుగాక! 'వేం' అనగా పాపాలు 'కట' మనగా దహించడం. సర్వపాపాలను దహింపచేసేది కాబట్టి ఈ పర్వతం వేంకటాచలమయ్యింది! అని చెప్పి ఆ మహర్షులంతా వచ్చిన దారినే వెళ్ళారు. మాధవుడు కూడా ఆ పర్వతంపై ప్రశాంతచిత్తంతో జితేంద్రియుడై దుష్కరమైన తపస్సుచేసి మోక్షాన్ని పొందాడు.

## చోళరాజు వృత్తాంతం

భృగుమహర్షి నారదమహర్షిని 'ఓ మునీంద్రా! కలియుగంలో చోళరాజుకు కుమారుడు కలుగుతాడని, అతడు చక్రవర్తియై శేషాద్రి భగవంతుని పూజిస్తాడని మీరింతకు ముందు నాకు చెప్పారు. దానిని నాకు వివరంగా చెప్పండి అసలు ఆ చోళరాజు కొడుకెవరు? అతడే దేశంలో నివసిస్తాడు? అతడు శేషశైలనాథుణ్ణి ఎలా భక్తితో పూజిస్తాడు? అతనికి ఆ లక్ష్మీపతి యందు ఎటువంటి భక్తి కలుగుతుంది? భవిష్యత్తు తెలిసిన వారు మీరు తప్ప భూలోకంలో మరెవరూ లేరు. కావున నాయందు అనుగ్రహంతో ఆ కథను సవిస్తరంగా చెప్పండి! అని ప్రార్థించగా నారదమహర్షి యిలా చెప్పనారంభించాడు.

కలియుగంలో లోకవిఖ్యాతిగాంచిన చోళ రాజొకడు ఉండేవాడు. అతడు ధార్మికుడు, నీతి కోవిదుడై భూమిని పరిపాలించాడు. ఒకానొకప్పుడు రాజు అడవిలో వేటాడుటకై సేవకులను అటవీ సంరక్షకులను ఆదేశించాడు. తాను గుర్రమెక్కి వెంటనే బయలుదేరి శేషాచల అడవుల్లో మృగాలను వేటాడుతూ విహరించాడు. ఆ గుర్రాలు, ఏనుగుల భయంకర ధ్వని విని సింహాలు పెద్ద పులులు మొదలైన క్రూర మృగాలు గుహనుండి బయటకు వచ్చినాయి. ఇదిగో సింహం, ఇదిగో పెద్దపులి, ఇవిగో అడవి ఏనుగులు అని చూపిస్తున్న మృగ సమూహములను అడవి పందుల గుంపులను వాడి బాణాలతోను, ఖడ్గంతోనూ సంహరిస్తూ ఆ రాజు అడవిలో వేటాడాడు.

**(సశేషం)**

ధారావాహికం

# శ్రీ కృష్ణ తత్వం



- రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

కృష్ణ భగవానుని శరీరం మీద రక్తపు బిందువులు– నుదుటి మీద చెమట చుక్కలు వింత శోభను ఇస్తున్నాయి. ఆ స్వామి మల్లవీరులకు పిడుగులాగ– పామరులకు మహారాజులాగా– మరింకా స్త్రీలకు నవమన్మథునిలాగా–రాజులకు నియంతలాగా– కంస మహారాజుకు మృత్యుదేవత లాగానూ– మూర్ఖులకు అద్భుతమైనటువంటి పురుషునిలాగా– యోగిపుంగవులకు పరతత్వమైన పరబ్రహ్మలాగా– వృష్ణివంశజులకు పరదైవము లాగా– తల్లిదండ్రులకు ఒక బిడ్డలా– ఎవరెవరి మనోభావాలను బట్టి–వివిధ రూపాలలో కృష్ణ భగవానునుడు చూడచక్కనివాడై తేజరిల్లుతున్నాడు.

కంసమహారాజు బలరామకృష్ణులను చూసాడు. వారిద్దరూ బలశాలురని– యుద్ధరంగంలో అజేయులని గ్రహించాడు. భయపడిపోయినాడు. చాణూరముష్టికులూ అన్నదమ్ములను చూసారు.

పశువులను మేపుతూ– అక్కడ కుస్తీ పోటీలు పెట్టి ఆడుతుండేవారటగా మీరు. మనమందరం కలిసి– యుద్ధ క్రీడతో రాజు గారికి ఆనందాన్ని కలిగిద్దామా అన్నారు.

బలరామకృష్ణులు చాణూరముష్టికులూ చేతులు చేతులు కలిపారు. కాళ్లకు కాళ్లు అడ్డుగా నిలిపారు. ఒకరికొకరు గిరగిరా తిప్పుకొని పడిపోయేలాగా దూరంగా తోసుకోసాగారు. కిందా మీద పడ్డారు. కొట్టుకున్నారు. ఇంకా గుద్దుకున్నారు.

అయితే చాణూరుడు తొందరగానే అలసిపోవడం గమనించినవాడైన కృష్ణభగవానుడు అదే అదునుకదా అనుకుంటూ వాడిని పైకెత్తినాడు. శక్తి కొలది నేలకేసి కొట్టాడు.ఆ దెబ్బకు వాని తల రెండుగా పగిలిపోయింది. చాణూరుడు చచ్చాడు. అక్కడేమో బలరాముడు ముష్టికుని కొడితే–వాడు నెత్తురు కుక్కుకుంటూ చచ్చాడు. శలుడు తోలుడు కూటుడు– దూసుకుంటూ వచ్చారు. ముగ్గురిని కాళ్లతో కుమ్మి–తలలు చీలిపోయేలా పగులగొట్టినాడు బలరాముడు. అన్నదమ్ముల విజయానికి కంసుడు తప్ప–అందరూ ఆనందించారు.

వెంటనే కంసమహారాజు మచ్చరంతో ఊగిపోయాడు. ఆవేశంతో సేవకులారా! బలరామకృష్ణులను నగరం నుంచి తరిమేయండి అన్నాడు.

చాణూరుడిని చంపిన తరువాత అదే ఊపులోనే కృష్ణుడు కంసుడు కూర్చున్న వైపు చూసాడు. ఒక్క ఉదుటున ఎత్తులోనున్న మంచ మీదకి ఎగిరాడు. ఒక పామును గరుత్మంతుడు పట్టినట్లుగా కంసుని ఒడిసి పట్టి లాగాడు. అతని కిరీటం జారి పడిపోయింది. తన కత్తిని ఒర నుంచి తీసేలోపల–గద్దె నుంచి రంగస్థలంలో పడేటట్లు కిందికి తోసేసాడు. వెన్వెంటనే ఒక మెరుపు వేగముతో కృష్ణుడు కిందికి దూకాడు. అప్పటికే భయంతో కంసుని గుండె ఆగింది. చనిపోయాడు.

ఒక మృగరాజు ఏనుగు కళేబరాన్ని ఈడ్చినట్లుగా–చచ్చిన కంసుని శవాన్ని లాగేసాడు. ప్రేక్షకుల్లో హాహాకారాలు మిన్నుముట్టాయి.

"దదర్శ చక్రాయుధ మగ్రతో యః తదేవ రూపం దురవాపమాప"– చక్రధారియైన కృష్ణుని రూపమే దుష్టుడైన కంసునికి కనపడింది. వైరభావంతో కృష్ణనామాన్ని స్మరించడం వలన కంసుడు ఒక జ్యోతిలా కృష్ణునిలో ఐక్యమైనాడు.

కంసుని దుర్మరణాన్ని అతని సోదరులు చూసారు. అది సహించలేక పోయినారు. కుంకుడు– న్యగ్రోధుడు మొదలుగా గల ఎనిమిది మంది కలిసి బలరామకృష్ణుల మీదకు ఒక్కుమ్మడిగా చుట్టుకుని దాడికి దిగినారు. అక్కడున్న ఒక పరిఘను తీసుకుని వాళ్ల వెంబడించి–తరిమి కొట్టి–చంపేసాడు బలరాముడు. అపుడు ఆ అన్నదమ్ముల విజయానికి పూలవాన కురిపించారు దేవతలు. గంధర్వులందరూ పాడారు. అప్సరసలు ఆడారు.

ఆ తరువాత తమ తల్లిదండ్రుల అయిన దేవకీవసుదేవులని బంధవిముక్తులను గావించాడు కృష్ణుడు. వెంటనే వారి పాదాలకు సాష్టాంగ నమస్కారాలు చేసారు బలరామకృష్ణులు.

ఇక తన యోగమాయతో అమ్మానాన్నలకు పుత్రవాత్సల్యాన్ని పెంపొందించేట్లు చేసాడు. కృష్ణ భగవానుడు వాళ్లతో అంటున్నాడు ఈవిధంగా–

మా ఇద్దరికీ పాలిచ్చి పెంచి పోషించే భాగ్యానికి నోచుకోలేదు మీరు. ఇక మీ ప్రేమానురాగాలను పొందే అదృష్టం మాకు దక్కలేదు అన్నాడు.

కృష్ణుని మాటలకు దేవకీవసుదేవులు సంతోషించారు. ఆనందబాష్పాలతో రామకృష్ణులను అభిషేకించారు.అటు తరువాత కంసుని తండ్రి ఉగ్రసేనుణ్ణి చెర నుంచి విడిపించి–మధురకు రాజుగా ప్రకటించాడు కృష్ణుడు.

కంసుడు సృష్టించిన దురాగతాలకు చెల్లాచెదురైన–యదు వృష్ణి అంధక మధు దాశార్హాది తన వంశీయులను పిలిపించాడు. వాళ్లందరినీ చక్కగా సత్కరించాడు. వారి వారి స్వగృహాలకు వెళ్లేట్లు తగిన ఏర్పాట్లు గావించాడు.

నందాది గోపవృద్ధులను గోపాలురను అందరినీ బృందావనానికి ఆనందంతో వెళ్లిపొమ్మన్నాడు. తర్వాత రాజ్యంలోని సమస్యలను పరిష్కరించగలిగాడు. నగరవాసులు నిర్భయంగా జీవనం సాగించడానికి ఒక సంవత్సరం పట్టింది కృష్ణభగవానునికి.

మాతాపితరుల పట్ల ప్రేమ, సేవాభావాలు ప్రదర్శించిన శ్రీరాముని తీరు లోకానికి ఆదర్శమయ్యింది. కంస సంహారానంతరం కృష్ణుడు కూడా తన తల్లిదండ్రుల పట్ల చూపిన భక్తిప్రపత్తులు– వారి పాదాలు పట్టి–క్షమించాలని కోరిన తీరు–లోకానికి ఆదర్శమైంది.

ఇక మరణాంతాని వైరాణీ– శత్రుత్వం మరణించే వరకు అని శ్రీరాముడు అన్నట్లు– చనిపోయిన కంసాదులకు దహనక్రియలు తాను స్వయంగా జరిపించి– రాజపత్నులను కృష్ణుడు ఓదార్చినాడు అన్న పురాణకథనం కూడా ప్రశంసనీయం.

రాజ్యాధికారం చేజిక్కినా ఇతరులకు కిరీటాలను పెట్టి తాను నిమిత్తమాత్రుణ్ణి అని కృష్ణుడు ప్రవర్తించిన తీరు నిజంగా ఆదర్శవంతమైంది.

గర్గమహాముని చేత బలరామకృష్ణులకు ఉపనయనాది సంస్కారాలు నందుడు జరిపించాడు. తరువాత సాందీపుని దగ్గర విద్యాభ్యాసాలు–64 రోజుల్లో 64 కళలను నేర్చినారు.

విద్యాభ్యాసం పూర్తయిన తరువాత గురుదక్షిణ ఏమి ఇవ్వాలో చెప్పమని అడిగాడు కృష్ణుడు. పరత్వ సౌలభ్య గుణాలు కలవాడని – శక్తిసామర్థ్యాలు చక్కగా తెలుసు గురువుగారికి. సముద్రం పాలైన తమ కుమారుణ్ణి తెచ్చి ఇమ్మని కోరినాడు.

బలరామకృష్ణులు ప్రభాస తీర్థానికి రథంమీద వెళ్లారు. వారిని దర్శించిన సముద్రుడు అర్ఘణమా హరత్ తయోః వారిద్దరికీ పూజాద్రవ్యాలను సమర్పించాడు. మా గురు పుత్రుణ్ణి తీసుకుని రా– అన్నాడు కృష్ణుడు. దానికి పంచజనుడు అనే రాక్షసుడు హరించాడని– విన్నవించాడు.

వెంటనే కృష్ణభగవానుడు సముద్రంలో ప్రవేశించి ఆ రాక్షసుని చంపాడు. పొట్ట చీల్చి–చూస్తే–బాలుడు లేడు. శంఖము కనపడింది. అదే పాంచజన్యము. ఆ వెంటనే యమపురికి వెళ్ళి యమధర్మరాజుకి తెలిపి గురువుగారి కుమారుడిని ఇవ్వమని అడిగాడు. ఆ బాలుడ్ని తీసుకుని గురువు గారి దగ్గరికి వెళ్ళి అప్పగించాడు.

కంసుని భార్యలు ఇద్దరూ అస్తి ప్రాప్తి– మగధరాజైన జరాసంధుని కుమార్తెలు. కంసుని దుర్మరణం విన్నాడు అతడు. మరి ప్రతీకారం తీర్చుకోవాలని 23 అక్షౌహిణీల సేనతో మధురను ముట్టడించాలని నిశ్చయించాడు.

కాలయవనుడు బలవంతుడు. మూడు కోట్ల సేనతో మధురను ముట్టడిస్తాడని తెలిసింది కృష్ణునికి. అదే సమయంలో జరాసంధుడు వస్తున్నాడు. ఇద్దరినీ ఏకకాలంలో కృష్ణుడు ఎదుర్కోవలసి వస్తుంది. అందుకనే తన వాళ్లందరి రక్షణ కోసం దుర్భేద్యమైన దుర్గాన్ని నిర్మించాలనుకోవడంతో ఏర్పడిందే ద్వారకానగరం.

గోమతీనది సముద్రంలో కలుస్తున్న చోట – సముద్రమధ్యంలో – పన్నెండు యోజనాల (192 కి.మీ) విస్తీర్ణంలో మహానగరాన్ని విశ్వకర్మ నిర్మించాడు. అదే ద్వారక.

ద్వారక ఒకానొక మహా అద్భుతమైన నగరం. సర్వాంగ సుందరం. సర్వతో భద్రమైంది. రాజమార్గాలు – విశాలమైన వీధులు – కళాత్మకమైన మణిమయ భవనాలు.

చూడచక్కని తెల్లనైన గుర్రాలను ఇచ్చాడు వరుణదేవుడు. కుబేరుడు అష్టనిధులను సమకూర్చాడు."సుధర్మ"– అనే విశాలమైన భవనాన్ని ఇచ్చాడు దేవేంద్రుడు. యోగమాయా ప్రభావంతో యాదవులను ద్వారకకు చేర్పించాడు కృష్ణుడు. ప్రస్తుతం ద్వారక గుజరాత్ దగ్గర సముద్రంలో మునిగిపోయిందని పురావస్తు శాఖ శాస్త్రజ్ఞులు వారు కనుగొన్నారు.

ఇక్కడ వ్యాసమహర్షి ఒక చమత్కారాన్ని చెబుతున్నాడు – దేవతలకు తనకు తానే అనుగ్రహించిన వైభవాలను వాళ్లందరూ మళ్లీ తిరిగి సమర్పించారట. స్వామి స్వీకరించారట.

జరాసంధుణ్ణి కాలయవనుణ్ణి ఇద్దరినీ ఏకకాలంలో ఎదుర్కోవాల్సి వచ్చింది. తలంచిన వెంటనే రెండు రథాలు – సారథులు–ధ్వజాలూ – కవచాలూ –ధనుస్సులూ – నానా విధాలైన ఆయుధాలు ఆకాశం నుంచి వచ్చాయి. అవి అవతార ప్రయోజనాన్ని ఆవిష్కరించేందుకు దైవ యోగంతో బలరామకృష్ణులను చేరాయి.

బలరామకృష్ణులలో బలరాముడే తనకు సరియైన ఉజ్జీయని– జరాసంధుడు బలరామునితో సిద్ధపడ్డాడు.అటువైపు తక్కిన సేనలను ఎదుర్కున్నాడు కృష్ణుడు. ఇక అపుడు రణ రంగంలో రక్తం ఏరులై పారింది. జరాసంధుడు ఓడిపోయాడు.తాళ్లతో బంధించాడు బలరాముడు.ఇపుడు వీడిని వదిలిపెడితే– మరలా సేనలతో వస్తాడు. దుష్టశిక్షణ నెరవేరుతుందని అన్నాడు కృష్ణుడు. అపుడు జరాసంధుణ్ణి విధిగా వదిలిపెట్టాల్సివచ్చింది. **(ఇంకా ఉంది)**


# సరస్వతీ నమస్తుభ్యం

**– చిల్లర సీతారామారావు**

**యాకుందేందు తుషారహార ధవళా యా శుభ్ర వస్త్రాన్వితా**
**యా వీణా వరదండ మండితకరా యా శ్వేత పద్మాసనా**
**యా బ్రహ్మాచ్యుత శంకర ప్రభుతిభి దేవై స్సదా పూజితా**
**సామాం పాతు సరస్వతీ భగవతీ నిశ్శేష జాఢ్యాపహా**

మల్లెలు, చందమామ, మంచు, ముత్తెపు సరముల వలె తెల్లనిది, తెల్లని చీర కట్టినది, వీణా దండముచే అలంకరింపబడిన చేయి కలది, తెల్ల తామరపై కూర్చుండునది, త్రిమూర్తులచే, వేల్పులచే ఎల్లవేళలా కొలువబడినది, తన భక్తుల జడతను నిశ్శేషముగా బాపునది యగు సరస్వతి నన్ను రక్షించు గాక.

సకల ప్రాణులను చైతన్యవంతులను చేసే పరాశక్తి సరస్వతి. విద్యాధిదేవత సరస్వతి. సరస్వతీ కటాక్షము ఉంటే శ్రీ హ్రీ శక్తి సంపదలు లభిస్తాయని, సరస్వతీ కటాక్షము లేనిదే త్రిమూర్తులు కూడా ఏ పనీ చేయలేరని సరస్వతీ సూక్తం స్పష్టం చేస్తున్నది. సకల జ్ఞానప్రదాయిని సరస్వతీదేవి శ్రీపంచమి నాడు అవతరించింది. శ్రీపంచమినే వసంత పంచమి అని కూడా అంటారు. అఖిల సంపదలకు ఆధారం విద్య. అక్షయమైన సిరి సంపదలను అందించేది అక్షరం. ఆ అక్షరానికి అధిష్ఠాత్రి సరస్వతి. సకల విద్యా స్వరూపిణి అయిన ఆ తల్లిని హిందూ ధర్మ గ్రంథాలలో శారద, వీణాపాణి, వాగ్దేవి, భారతి, ప్రజ్ఞాపారమిత, వాగేశ్వరి మొదలైన అనేక నామముల వివరణ లభిస్తుంది. ఋగ్వేదములో వాగ్దేవి పేరు సరస్వతి అని చెప్పబడినది. దీనికి మూడు స్థానాలు ఉన్నాయి. ఒకటి స్వర్గం, రెండు పృథ్వి, మూడు అంతరిక్షం. స్వర్గంలో వాగ్దేవిని భారతి అని, పృథ్విలోని వాగ్దేవికి ఇల అని, అంతరిక్షవాసిని అయిన వాగ్దేవికి సరస్వతి అని పేరు. ఈమెని ఉపాసించిన వారికి అన్ని విద్యలు, సిద్ధులు ప్రాప్తిస్తాయి.



చదువుల తల్లి అయిన సరస్వతీ దేవిని మాఘశుద్ధ పంచమి నాడు ఆరాధిస్తారు. శ్రీపంచమి సరస్వతీదేవి జన్మదినం. చైత్రమాసంలో వచ్చే పంచమిని వసంత పంచమి అని అంటారు. ఈరోజున శ్రీపంచమి పేరుతో విద్యాధిదేవత సరస్వతి జయంతిని ఘనంగా జరుపుకుంటారు.

**"తల్లీ నిన్ను దలంచి పుస్తకము చేతన్ బూనితిన్ నీవు నా**
**యుల్లంబందున నిల్చి జృంభణముగా నుక్తుల్ సుశబ్దమ్ము శో**
**భిల్లం బల్కుము నాదు వాక్కునను సంప్రీతిన్ జగన్మోహినీ**
**పుల్లాబ్జాక్షి! సరస్వతీ! భగవతీ! పూర్ణేందు బింబాననా!"**

ఈ పద్యము సరస్వతిని స్తుతిస్తున్న పద్యము. పూర్వకాలమున పిల్లలు పలక, బలపము పట్టుకున్నప్పుడు పిల్లల చేత ఈ పద్యము కంఠస్థము చేయించెడివారు. 'ప్రాణశక్తిః సరస్వతి' అని వేదము పేర్కొన్నది. మనలో దాగి ఉన్న ఆత్మజ్యోతి ప్రకాశమే ప్రాణం. ఆ ప్రాణం మనలోని ప్రతి అణువులోనూ ఉంది. ఆ శక్తినే మనం సరస్వతి అంటున్నాం. అప్పుడైనా, ఇప్పుడైనా, ఎప్పుడైనా జ్ఞానసంపదకే ప్రాధాన్యత. విద్యకి, జ్ఞానానికి ఎవరు ప్రాముఖ్యత నిస్తారో వారికి అన్నీ సమకూరుతాయి అనడంలో సందేహం లేదు. సంపాదించాలన్నా, సద్వినియోగం చేయాలన్నా కావలసినది బుద్ధి శక్తి. బుద్ధి, ప్రతిభ, ఆలోచన, మేధ, ధారణ, స్మృతి, ప్రజ్ఞ, స్ఫురణల వంటి ధీశక్తుల స్వరూపమే అమ్మ సరస్వతి.

సరస్వతీ సూక్తములో అమ్మవారి వాక్స్వరూపము నాలుగు విధాలుగా చెప్పబడింది. 1. పరా 2. పశ్యంతి 3. మధ్యమా 4. వైఖరి. మనం మాటను పలికేముందు అది ముందుగా మన మనస్సులో భావాత్మకంగా గోచరిస్తుంది. అది పశ్యంతి. దానిని ప్రేరేపించే అజ్ఞాత సంస్కారమే పరా. అది లోన మాటలుగా కూర్చుకుంటున్నప్పుడు మధ్యమ. పైకి వినబడేది వైఖరి. యోగపరంగా వీటి ప్రయాణ స్థానం మూలాధారము నుండి నాభి, హృత్, కంఠ, రసన (నాలుగు) లు. వీటికి మూలమైన నాదం సరస్వతీ స్వరూపమే. భావ ప్రకటన కోసం వృక్షాలు పరా వాక్కును, పక్షులు పశ్యన్తి వాక్కును, పశువులు మధ్యమా వాక్కును, మనుషులు వైఖరీ వాక్కును ఉపయోగించడం జరుగుతుంది.

బ్రహ్మ దేవేరి సరస్వతి. శ్వేత పద్మముపై నిల్చుని, తెల్లని దుస్తులతో, తెల్లని పూలు, ముత్యాల హారాలతో, నాలుగు చేతులలో వీణ, పుస్తకము, జపమాల, అభయముద్ర ధరించి భక్తులకు

దర్శనమిస్తుందని బ్రహ్మవైవర్త పురాణము తెలియజేస్తున్నది. ఋగ్వేదము సరస్వతీదేవిని ఒక నదీస్వరూపముగా వర్ణించింది. ఈ నది గంగా యమునల సంగమములో కలిసి త్రివేణీ సంగమములో మిళితమై అంతర్వాహినిగా ప్రవహిస్తున్నది. దీనికి సంబంధించిన ఒక కథ బ్రహ్మ పురాణంలో ఉంది.

పురూరవుడు ఒకసారి సరస్వతీదేవిని చూసి మోహించాడు. ఊర్వశి ద్వారా తరచూ ఆమెను కలుసుకునేవాడు. తత్ఫలితముగా సరస్వతి ఒక పుత్రునికి జన్మనిచ్చింది. అతడి పేరు సరస్వంతుడు. బ్రహ్మకు ఈ విషయం తెలిసి సరస్వతిని నదివి కమ్మని శపించాడు. సరస్వతి గంగాదేవిని శరణు కోరింది. గంగ బ్రహ్మను ప్రార్థించింది. గంగాదేవి ప్రార్థనను మన్నించి బ్రహ్మ తన శాపమును ఉపసంహరించుకున్నాడు. కాని భూలోకములో అంతర్వాహినిగా ప్రవహించమని ఆజ్ఞాపించాడు. అందువలన సరస్వతి అంతర్వాహినిగా ప్రవహిస్తున్నది.

శ్రీపంచమి రోజున సరస్వతీదేవిని ఆరాధించాలి. ఆరోజు వేకువ జాముననే లేచి స్నానాదికములు పూర్తి గావించుకోవాలి. గోమయముతో ఇంటిని శుభ్రపరచుకోవాలి. పిదప ముగ్గులు వేయాలి. గడపలకు పసుపు రాయాలి. కుంకుమ బొట్లు పెట్టాలి. పూజా మందిరములో ఒక మంటపమును ఏర్పాటు చేసుకోవాలి. మధ్యలో ఒక పీట వేసి దానిమీద వస్త్రమును వేయాలి. ఆ వస్త్రముపై బియ్యము పోయాలి. దానిమీద సరస్వతీదేవి చిత్రపటము గాని, విగ్రహమును గాని ఉంచాలి. కలశమును ఉంచాలి. ముందుగా గణపతిని పూజించాలి. కలశము లోనికి సరస్వతీదేవిని ఆవాహన చేయాలి. షోడశోపచారములతో పూజలు చేయాలి. సరస్వతీదేవికి నివేదించే పదార్థముల వివరములు వేదశాస్త్రములో వివరించబడినాయి. వాటి ప్రకారము వెన్న, పెరుగు, పాలు, లాజలు (పేలాలు), నువ్వుల ఉండలు, చెరకు గడలు, తెల్లబెల్లము, తేనె, పంచదార, శ్వేతాక్షతలు, తెల్లని బియ్యంతో వండిన అన్నము, అటుకులు, నేయి, ఉప్పు కలిపిన హవిష్యాన్నము, బియ్యము, గోధుమపిండి, నేతితో చేసిన పిండివంటలు, అరటిపళ్ళ గుజ్జుతో తయారు చేసిన విచిత్రమైన పిండివంటలు, పండిన అరటిపండ్లు, కొబ్బరికాయలు, రేగుపళ్ళు, కొబ్బరినీరు, ఆయా కాలములలో లభించు ఫలములను అమ్మవారికి సమర్పించాలి. శక్తి లేనివారు ఒకటి రెండు పదార్థములను నైవేద్యముగా పెట్టవచ్చును. సరస్వతీదేవికి తెలుపు అంటే చాలా ఇష్టము. అందువలన పూజకు తెల్లని దండలు, తెల్లని పూలు, తెల్లని వస్త్రాలు ఉపయోగించాలి. ఈ విధంగా పూజించడం వలన జ్ఞానాభివృద్ధి, ఆలోచనాశక్తి, విద్యాభివృద్ధి జరుగుతుంది.

సరస్వతీ కవచము ఒక మహామంత్రము. భక్తి శ్రద్ధలతో ఈ మంత్రమును పఠిస్తే అజ్ఞానులు జ్ఞానులవుతారు. వాల్మీకి మహర్షి ఈ కవచమును పఠించి కవి అయినాడని దేవీ భాగవతంలో ఉంది. సరస్వతీ కవచమునకు విశ్వజయం అను పేరు కూడా ఉంది. దీని సహాయముతో విశ్వమును జయించవచ్చు. సరస్వతీ కవచమును పఠించిన వారికి వాక్శుద్ధి కలుగుతుంది. కవచ మాహాత్మ్యమును తెలియచేసే ఒక కథ దేవీ భాగవతము, బ్రహ్మ వైవర్త పురాణములందు ఉంది. ఒకప్పుడు యాజ్ఞవల్క్య మహర్షి తన గురువైన వైశంపాయనుడిని ధిక్కరించాడు. దానితో ఆగ్రహించిన వైశంపాయనుడు, తాను బోధించిన విద్యలను వెనక్కి తీసుకున్నాడు. గురుద్రోహం వల్ల, గురుశాపం వల్ల యాజ్ఞవల్క్యుడు విద్యావిహీనుడయ్యాడు. సర్వభ్రష్టుడైనాడు. దుఃఖములనుభవింపసాగాడు. సూర్యుడిని గురించి తపము చేశాడు. అతడి తపమునకు మెచ్చి సూర్యుడు ప్రత్యక్షమై వరమును కోరుకొమ్మని పలికాడు. విద్యను ప్రసాదించమని అడిగాడు యాజ్ఞవల్క్యుడు. గురుద్రోహికి విద్య లభించడం అసాధ్యం. అయినప్పటికీ అసాధ్యమును సుసాధ్యము చేయగల శక్తి ఒక్క సరస్వతీ కవచమునకే ఉంది. దానిని నీకు బోధిస్తాను. దానిని భక్తి శ్రద్ధలతో పఠించు అని పలికి సరస్వతీ కవచమును బోధించి అంతర్ధానమయ్యాడు. యాజ్ఞవల్క్యుడు భక్తి శ్రద్ధలతో సరస్వతీ కవచమును పఠించడం మొదలుపెట్టాడు. ప్రసన్నురాలైన సరస్వతీదేవి ప్రత్యక్షమై వరము కోరుకొమ్మని పలికింది.

శ్లో ॥ "కృపాం కురు జగన్మాతః మామేవం హత తేజసమ్
గురు శాపాత్ స్మృతి భ్రష్టమ్ విద్యాహీనం చ దుఃఖితమ్
జ్ఞానం దేహి స్మృతిం విద్యాం శక్తిం శిష్య ప్రబోధినమ్"

**- దేవీ భాగవతం**

తల్లీ! గురువుగారి శాపం వలన తేజస్సు, జ్ఞాపకశక్తి నశించిపోయి, విద్యావిహీనుడనై అలమటిస్తున్నాను. నన్ను కరుణించు తల్లీ! జ్ఞానమును, స్మృతిని, విద్యను ప్రసాదించుము అని తన కోరికను వెల్లడించాడు యాజ్ఞవల్క్యుడు. సరస్వతీదేవి అతనికి సకల విద్యలూ ప్రసాదించింది. ఎంతటి మూర్ఖులు అయినా, సరస్వతీ కవచమును భక్తి శ్రద్ధలతో పఠిస్తే వారిని పండితులను చేస్తాను. ఎంతటి పాపాత్ముడైనా సరస్వతీ కవచమును పఠిస్తే పుణ్యాత్ముడిని చేస్తాను అని పలికి అంతర్ధానమయింది. అత్యంత శక్తివంతమైన సరస్వతీ కవచమును అయిదు లక్షల మార్లు జపిస్తే సిద్ధి కలుగుతుంది. సిద్ధి పొందినవారు మహోపన్యాసకులు, కవీంద్రులు అవుతారు. ఎన్ని పనులున్నప్పటికీ కనీసం సంవత్సరమునకొకసారి మాఘ శుక్ల పంచమి నాడు సరస్వతీదేవిని ఆరాధించి, సరస్వతీ కవచమును పఠించాలి. అలా చేయనివాడు మూగవాడుగా పుడతాడని విష్ణుమూర్తి నారదుడితో చెప్పాడు.

అమ్మ వైభవం అనంతం. ఆ తల్లిని స్తోత్రం చేస్తే మనకు అన్నింటా జయమే కలుగుతుంది. కనుక అమ్మవారిని ఉపాసించి తరిద్దాం.

# తిరుమల సర్వస్వం

ధారావాహికం

– పల్లపోతు వాణిశ్రీ



గత సంచిక తరువాయి

## పంచబేరాలు

మొట్టమొదటగా పరమ పావనమైన ఆనందనిలయం, అనగా తిరుమల క్షేత్రము నందలి ప్రధానాలయపు గర్భాలయంలోని పంచబేరాలుగా పిలువబడే శ్రీవేంకటేశ్వరుని ఐదు రూపాల గురించి తెలుసుకుందాం.


సకల కళ్యాణ కారకుడైన శ్రీవేంకటేశ్వర రూపాంతరాల స్మరణతో ''తిరుమల సర్వస్వం'' ప్రారంభమవటం మంగళదాయకంగా భావించి, తొట్టతొలి ప్రకరణాన్ని శ్రీనివాసుని ''పంచబేరాలకు'' అంకితమివ్వడం జరిగింది.

ఆనందనిలయంలో కొలువై, పంచబేరాలుగా పేర్గాంచిన శ్రీనివాసుని ఐదు దివ్యమంగళ స్వరూపాలు ఈవిధంగా పిలువబడుతాయి.

| ధ్రువబేరం | అనిరుద్ధబేరం | కౌతుకబేరం | స్నపన బేరం | ఉత్సవబేరం |
|---|---|---|---|---|
| మూల విరాట్టు | కొలువు శ్రీనివాసుడు | పురుషబేరం | అచ్యుతబేరం | మలయప్ప స్వామి |
| | దర్బారు శ్రీనివాసుడు | భోగ శ్రీనివాసుడు | ఉత్సవ శ్రీనివాసుడు | |
| | అళగిప్పిరాన్ | మనవాళ పెరుమాళ్ | స్నపనమూర్తి | |
| | | | ఉగ్ర శ్రీనివాసుడు | |

**మూల విరాట్టు**

సుమారు వెయ్యేళ్ళ క్రితం, చరిత్రకు అందనట్టి ప్రాచీన కాలం నుండి తిరుమల శిఖరంపై విరాజిల్లుతున్న ఈ ప్రతిమ శివుడిదా లేదా అమ్మవారిదా లేదా విష్ణువుగా అనే వివాదం నెలకొన్నది. ఆ సమయంలో శ్రీమద్రామానుజులవారు బంగారు శంఖు చక్రాలు తయారు చేయించి, వాటిని తన భక్తితత్పరతతో స్వామివారి ఉభయ హస్తాలలో శ్రీవారి చేతనే స్వయంగా ధరింపచేసి ఆ ప్రతిమ శ్రీమహావిష్ణువు కలియుగావతారమైన శ్రీవేంకటేశ్వరునిదేనని నిర్ద్వంద్వంగా, తర్కపూరితంగా నిరూపించారు. కుడి వక్షస్థలంలో అమ్మవారితో, చతుర్భుజాలతో, శంఖు చక్రాలతో దేదీప్యమానంగా ప్రకాశిస్తూ ఉండే స్వామి ఇక్కడ స్వయంగా వెలశారు. మూలవిరాట్ నే




ధ్రువబేరం (స్థిరంగా ఉండే విగ్రహం) అని కూడా వ్యవహరిస్తారు. తొమ్మిదిన్నర అడుగుల ఎత్తుతో సమున్నతంగా ఉండే స్వామివారి యజ్ఞోపవీతంలో ఒక పోగు తెగి ఉంటుంది. ప్రలంబాసురునితో ప్రచండ యుద్ధం జరిగినప్పుడు ఆ పోగు తెగిపోయిందని ప్రసిద్ధి. శ్రీవారికి నాగాభరణంతో బాటుగా అనేక స్వర్ణాభరణాలు అలంకరించబడి ఉంటాయి. మొదట్లో సన్నగా ఉండే తిరునామం రామానుజాచార్యుల వారి హయాం నుండి ప్రస్తుతం మనకు కనబడే వెడల్పాటి ఊర్ధ్వపుండ్రంగా రూపాంతరం చెందింది. ఈ తిరునామానికి మామూలు రోజుల్లో 16 తులాల పచ్చ కర్పూరం, ఒకటిన్నర తులం కస్తూరిని వినియోగిస్తారు. అదే బ్రహ్మోత్సవాల్లో దీనికి రెండింతల పదార్థాన్ని వినియోగిస్తారు. స్వామివారు కుడి వరదహస్తంతో (అంటే వరాలనిచ్చే హస్తం), ఎడమ కటిహస్తంతో (అంటే నడుము భాగంలో చేర్చబడిన చేయి) దర్శనమిస్తారు. స్వామివారి పాదపద్మాలు పద్మపీఠంపై విరాజిల్లుతుంటాయి. సూర్యకటారి లేదా నందకం అనే ఖడ్గాన్ని నడుము క్రింది భాగం నుంచి ధరించి ఉంటారు.

దాదాపు 120 సంవత్సరాలు జీవించి స్వామివారి సేవలో పునీతుడైన రామానుజాచార్యుల వారి గురించి మున్ముందు సవివరంగా తెలుసుకుందాం. అలాగే స్వామివారి మూలవిరాట్టు ఆవిర్భావం, స్వరూప స్వభావాల గురించి కూడా ఆనందనిలయాన్ని వివరిస్తున్నప్పుడు సవిస్తరంగా వర్ణించుకుందాం.

## కొలువు శ్రీనివాసుడు

ఈ శ్రీనివాసుడినే "దర్బారు శ్రీనివాసుడు", అనిరుద్ధబేరం, అళగిప్పరాన్ అని వేర్వేరు పేర్లతో పిలుస్తారు. ఈ స్వామి బంగారు వాకిలి దాటి బయటకు రారు. వీరు ఆదాయం, పద్దులు, లేఖిక, దర్బారు, బలిబేరం (నైవేద్యం) స్వీకరిస్తారు. 826వ సంవత్సరం నాటిదిగా భావింపబడే ఈ విగ్రహం ఆనందనిలయంలోకి ఎలా వచ్చిందో చెప్పటానికి చారిత్రక ఆధారాలు లేవు. ప్రతిరోజూ తోమాల సేవ (తోమాలు అనగా పూలు) అనంతరం దర్బారు సేవ నిర్వహిస్తారు. అంటే – ఆరోజు తిథి, వార, నక్షత్రాలు, ముందురోజు ఆదాయం ఎంత వచ్చింది – ఆ లెక్కలన్నీ స్వామివారికి చెబుతారన్న మాట. ఇంగ్లీషు తేదీల ప్రకారం కూడా పంచాగాన్ని వివరిస్తారు. తరువాత నైవద్యం సమర్పించి మరునాటి తిథి, వార, నక్షత్రాలు వినిపిస్తారు. నిత్యాన్న పథకానికి విరాళాలు ఇచ్చిన దాతల పేర్లు కూడా స్వామివారికి మనవి చేస్తారు. బొక్కసం (లెక్కల గుమాస్తా), ఆర్జిత సేవలవల్ల, ప్రసాద విక్రయాల ద్వారా, హుండీ ద్వారా కానుకలుగా వచ్చిన వెండి, రాగి, బంగారం, ఇతర లోహ పాత్రలు, నగలు వగైరాలను, రొక్కం రూపంలో వచ్చిన కానుకలను పైసలతో సహా లెక్కగట్టి స్వామివారికి వినిపించి, సాష్టాంగ నమస్కారం చేసి సెలవు తీసుకుంటారు. ప్రతిరోజూ ఉదయం 4.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సేవను ఆలయ ప్రాంగణంలో కూర్చుని వీనులవిందుగా విని తరించవచ్చు. ఈ కార్యక్రమం అంతా బంగారు వాకిలికి ఆనుకుని ఉన్న 'స్నపనమండపం'లో జరుగుతుంది. ఇది పూర్తిగా ఏకాంతసేవ.

## భోగ శ్రీనివాసుడు

మూలవిరాట్ కు ఎడమవైపున ఉన్న బేరం (మూర్తి లేదా ప్రతిమ) భోగశ్రీనివాసుడు. సామాన్య శకం 624 సంవత్సరంలో పల్లవరాణి 'సామవై' అనే మహాభక్తురాలు ఈ వెండి ప్రతిమను చేయించింది. మరికొందరి శాస్త్రకారుల అంచనా ప్రకారం ఈ విగ్రహం సామాన్య శకం 966వ సంవత్సరంలో చేయించబడింది.

ఒకటిన్నర అడుగుల ఎత్తుతో ముగ్ధమనోహరంగా ఉండే ఈ మూర్తిని కౌతుకబేరం, పురుషబేరం అని కూడా వ్యవహరిస్తారు. ఈ మూర్తికే 'మనవాళప్పెరుమాళ్' అనే మరో నామధేయం కూడా ఉంది. 'మనవాళన్' అనే తమిళ పదానికి 'పెండ్లికొడుకు' అని అర్థం. నిత్య పెండ్లికొడుకులా నిత్యమూ పట్టుపానుపుపై శయనించి భోగభాగ్యాలను పొందుతూ ఈ స్వామి సార్థక నామధేయుడయ్యాడు.

జ్యేష్ఠమాసంలో ఈ మూర్తికి ప్రత్యేక సహస్ర కలశాభిషేకం నిర్వహిస్తారు. పూర్వం – ఇప్పటి మలయప్పస్వామి వారి ఉత్సవ విగ్రహాలు లేనప్పుడు – మాడవీధుల్లో భోగశ్రీనివాసుణ్ణే ఊరేగించేవారు. అన్ని మర్యాదలు, సేవా కైంకర్యాలు, అభిషేకం, ఏకాంతసేవ, బంగారు పట్టుపరుపుపై పవళింపు సేవ, బుధవారం జరిగే ప్రధానసేవ యైన సహస్ర కలశాభిషేకం భోగశ్రీనివాసునికే చెందుతాయి. ప్రతి ఉదయం తోమాలసేవకు ముందుగా భోగశ్రీనివాసునికి అభిషేకం జరుపబడుతుంది.

సామవై మహారాణికి మరోపేరు 'పేరిందేవి'. ఆమె కాలంలో ఆనందనిలయం జీర్ణోద్ధారణ కావించబడినప్పుడు, నిత్యపూజకు ఆటంకం కలగకుండా ఉండే నిమిత్తం మూలమూర్తికి నకలుగా భోగ శ్రీనివాసుడి విగ్రహం చేయించి నేడు స్నపన మంటపంగా పిలువబడే ప్రదేశంలో 'బాలాలయం' నిర్మించి, భోగశ్రీనివాసుణ్ణి అందులో ప్రతిష్ఠింపచేసి, వారికి సకల లాంఛనాలతో పూజాదికాలను నిర్వహించింది. స్వామివారికి అనేక ఆభరణాలు చేయించి ఆడంబరంగా అనేక ఉత్సవాలు నిర్వహిస్తూ పరమభక్తశిరోమణిగా పేరు గాంచింది. స్వామివారి సేవలో తరించిన మొట్టమొదటి చారిత్రక వ్యక్తిగా కూడా ఈమె చరిత్రపుటల్లో చిరస్థాయిగా నిలిచి తరువాతి కాలంలో మహాభక్తులైన ఎందరో రాజులు, మహారాజులకు ఆదర్శప్రాయమైంది.

## ఉగ్రశ్రీనివాసుడు

ఈ శ్రీనివాసునికే ఉత్సవ శ్రీనివాసుడని మరియొక పేరుండేది. ఈ మూర్తిని స్నపనబేరం, అచ్యుతబేరం మరియు స్నపనమూర్తి అని కూడా పిలుస్తారు. స్నపనం అంటే పరిశుద్ధం చేయుట లేదా శుద్ధి చేయుట అని అర్థం. శ్రీదేవి భూదేవి సమేతుడై ఉండే ఈ స్వామిని సామాన్యశకం 1200 సంవత్సరంలో యాదవరాజొకరు ఆలయానికి బహూకరించారు. అప్పటినుండి ఈ మూర్తులు ఆనందనిలయం నందుండి, ఉత్సవమూర్తులుగా పూజా పునస్కారాలు అందుకుంటూ ఉండేవి. ఒకానొకప్పుడు బ్రహ్మోత్సవాల సందర్భంలో ఈ మూర్తులను ఉత్సవ మూర్తులుగా ఊరేగిస్తున్నప్పుడు అగ్నిప్రమాదం జరిగి తిరుమలలోని గృహాలన్నీ భస్మీపటలమయ్యాయి. శ్రీవారు అర్చకస్వాములకు దర్శనమిచ్చి ఇక మీదట ఆ మూర్తుల్ని ఉత్సవ విగ్రహాలుగా ఉపయోగించవద్దని చెప్పారు. అంతేకాకుండా మలయ కొండల్లో స్వామివారి విగ్రహాలు లభిస్తాయని, ఇకనుండి అవి మాత్రమే ఉత్సవ విగ్రహాలుగా పూజలందుకోవాలని సెలవిచ్చి అంతర్ధానమయ్యారు. స్వామివారికి ఆగ్రహం వచ్చి అగ్నిప్రమాదం జరిగిందని భావించి, అప్పటినుండి ఆయనను 'ఉగ్రశ్రీనివాసుని'గా పిలుస్తూ ఆనంద నిలయానికే పరిమితం చేశారు. ప్రతి సంవత్సరం కృష్ణాష్టమి సందర్భంగా జరిగే ఆరాధన నాడు మరియు కార్తీక ద్వాదశి రోజు మాత్రమే ఈ ఉగ్రశ్రీనివాసునికి ఆస్థానం జరుగుతుంది.

కార్తీక ద్వాదశి నాడు సుప్రభాతం, తోమాలసేవ అనంతరం శ్రీదేవి–భూదేవి సమేత ఉగ్రశ్రీనివాసునికి అభిషేకాదులు నిర్వహించి, పట్టువస్త్రాలు, ఆభరణాలు, పుష్పమాలలు అలంకరిస్తారు. పిదప స్వామివారు మాడవీధుల్లో ఊరేగింపబడుతారు. ఈ ఊరేగింపు సూర్యోదయానికి చాలా ముందుగా జరుగుతుంది. సూర్యోదయానంతర వెలుగులు ఈ మూర్తిని సోకితే ఉగ్రత్వం వస్తుందని భావించి, ఈ ఉత్సవాన్ని తెల్లవారు ఝామున సూర్యోదయానికి చాలా ముందుగానే ముగిస్తారు. ఉదయం 3 గంటల లోపే ఈ మూర్తులు మందిరం అంతర్భాగం చేరేటట్లు అర్చకులు అత్యంత జాగ్రత్త వహిస్తారు. ఊరేగింపు పూర్తయిన తరువాత ఉగ్రశ్రీనివాసుణ్ణి ఆలయం నందలి రంగమండపంలో గల సర్వభూపాల వాహనంలో వేంచేపు చేసి నైవేద్య నీరాజనాలు సమర్పించి ఆనందనిలయంలో పునః ప్రవేశింపచేస్తారు. శ్రీవారి మూలమూర్తికి ముమ్మూర్తులా నకలు ప్రతిమ అయిన ఉగ్రశ్రీనివాసుని విగ్రహం పంచలోహ నిర్మితమైంది. ఈ మూర్తి ఇరవై అంగుళాల ఎత్తు కలిగి ఉండి ఆరంగుళాల ఎత్తైన పద్మపీఠంపై అమర్చబడి ఉంటుంది. అలాగే స్వామివారికి ఇరువైపులా అయిదంగుళాల ఎత్తైన పీఠంపై పద్దెనిమిది అంగుళాల ఎత్తైన శ్రీదేవి భూదేవిల పంచలోహ ప్రతిమలు దర్శనమిస్తాయి.

## మలయప్ప స్వామి

3 అడుగుల 9 అంగుళాల ఎత్తుతో, ఈ స్వామి దేవేరులైన శ్రీదేవి – భూదేవి సమేతంగా ఉంటారు.

సామాన్యశకం 1330 సంవత్సరంలో మలయకోనలో ఈ స్వామి లభించారు. ఒకానొక బ్రహ్మోత్సవాల సందర్భంలో అగ్నిప్రమాదం సంభవించినప్పుడు ఉగ్రశ్రీనివాసుని ఆనతిపై తిరుమల సానువుల్లోని మలయపర్వతంలో గాలింపు చర్యలు చేపట్టగా ఈ మూర్తులు లభ్యమయ్యాయి. మలయ పర్వతం అంటే తల వంచిన కొండ అని అర్థం. ఉభయ దేవేరులతో ఉన్న మలయప్ప స్వామి వారి మూర్తులను ఉత్సవ విగ్రహాలుగా ఊరేగిస్తూ అర్ధాంతరంగా ఆపివేయబడ్డ బ్రహ్మోత్సవాలను తిరిగి కొనసాగించారు. అప్పటినుండి ఈనాటి వరకు ఈ మూర్తులే ఉత్సవ విగ్రహాలుగా పూజలందుకొంటున్నాయి.

తిరుమలలో జరిగే డోలోత్సవం, నిత్యకళ్యాణోత్సవం, ఆర్జితబ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవ, పవిత్రోత్సవాలు అన్నీ మలయప్పస్వామికే చెందుతాయి. అన్ని ఉత్సవాలు, వేడుకలనందుకొనే ఈ స్వామి

తిరుమలను సందర్శించుకునే భక్తులందరికీ సుపరిచితులు. ఆనందనిలయంలోని మూలమూర్తి దర్శనార్థం భక్తులు వారి చెంతకు చేరుకోవాలి. కానీ భక్తసులభుడైన మలయప్పస్వామి వారు మాత్రం తానే ఆనందనిలయంలో నుండి బయటికి వచ్చి భక్తుల వద్దకు వేంచేస్తారు. ఆనందనిలయం లోనికి ప్రవేశించటంలో అశక్తులైన తన భక్తుల సందర్శనార్థం మూలమూర్తే తన ప్రతిరూపాన్ని బయటకు పంపుతున్నారేమో.

కొల్లిగళ వీరణ్ణశెట్టి అనే భక్తునికి విష్ణుమూర్తి కలలో కనిపించినందుకు గుర్తుగా ఆయన స్వామివారికి వజ్రకిరీటం చేయించారు. ఆ వజ్రకవచాన్ని తొలుతగా తమ ఇలవేలుపు అయినట్టి "చెరువు నారాయణ స్వామికి" తొడగడానికి ప్రయత్నిస్తే అది సరిపోదు. ఆ తరువాత శ్రీరంగనాథునికి ప్రయత్నిస్తే వారికి కూడా సరిపోదు. అప్పుడు కంచిలో ఉన్న అర్చకస్వాములు తిరుమలలోని మలయప్పస్వామి పేరు సూచించారు. అప్పుడా భక్తుడు తిరుమల క్షేత్రానికి విచ్చేసి మలయప్పస్వామికి ఆ కవచం తొడిగితే సరిగ్గా సరిపోతుంది. ఇప్పటికీ ఆ కవచం క్రింద భాగంలో ఆ భక్తుని పేరును మనం చూడవచ్చు.

ఈ పంచలోహ విగ్రహాలు తామరపువ్వు ఆకారంలోని పీఠం మీద కొలువై ఉంటాయి. అనేక స్వర్ణాభరణాలతో బాటుగా, వజ్రకవచం మరియు ముత్యాల కవచం కూడా మలయప్పస్వామి వారి స్వంతం.

ఆనందనిలయంలోని ఈ పంచబేరాలు విష్ణువు యొక్క మహారూపాలను సూచిస్తాయి.

| | |
|---|---|
| **మూల విరాట్టు** | **విష్ణువు** |
| **భోగ శ్రీనివాసుడు** | **పురుషుడు** |
| **మలయప్పస్వామి** | **మహావిష్ణువు** |
| **ఉగ్ర శ్రీనివాసుడు** | **సదా విష్ణువు** |
| **కొలువు శ్రీనివాసుడు** | **వ్యాపి నారాయణుడు** |

ఈ పంచబేరాలే కాకుండా, ఆనందనిలయంలో ఇతర పరివార దేవతలు కూడా ఉంటారు – ఆంజనేయ సీతా లక్ష్మణ సమేత శ్రీరాముడు, రుక్మిణీ సమేత శ్రీకృష్ణుడు, సుదర్శన చక్రం, సేనాని, విష్వక్సేనుడూ, గరుత్మంతుడూ – మొదలగువారు. ఈ మూర్తుల గురించి వచ్చే ప్రకరణాల్లో వివరంగా తెలుసుకుందాం.

తిరుమల క్షేత్రంపై అజమాయిషీ తరచూ చేతులు మారినప్పటికీ, చారిత్రకాధారాలు లభ్యమైనంతవరకు, సకల లోక సార్వభౌముడైన శ్రీనివాసునికి సేవలు, ఉత్సవాలు పదిహేను వందల సంవత్సరాలకు పైబడి కొనసాగుతూనే ఉన్నాయి. వెయ్యేళ్ళక్రితం శ్రీ రామానుజులవారు అంతకుపూర్వం జరిగే సేవలన్నింటినీ క్రమబద్ధీకరించి ఒక నిర్దిష్టమైన సేవలపట్టీని, అర్చనావిధానాన్ని రూపొందించారు. ఈనాడు కూడా స్వల్ప మార్పులు, చేర్పులతో అవే సేవలు, అదే క్రమంలో జరుపబడుతున్నాయి. కాలానుగుణంగా మరికొన్ని ఇతరసేవలు కూడా చేర్చబడ్డాయి.

ప్రస్తుతం సంవత్సరానికి 450కి పైగా ఉత్సవాలు జరుగుతాయి.

నిత్య, వార, పక్ష, త్రైమాసిక, వార్షిక ఉత్సవాలు ఎన్నో... ఎన్నెన్నో...

ఆలయ ఆగమ శాస్త్రానుసారం స్వామి రోజూ ఆరుసార్లు పూజలందుకుంటున్నారు. వీటినే "షట్కాల పూజలు"గా వ్యవహరిస్తారు.

సుప్రభాత సమయం నుండి దాదాపు నడిరేయి సమయంలో జరిగే ఏకాంత సేవ వరకూ...

బ్రహ్మముహూర్తంలో సుప్రభాత గానాన్ని ఆలకించి, నవనీతహారతిని అందుకొని విశ్వరూపదర్శనాన్ని అనుగ్రహించే స్వామివారు అనేక సేవలు, లెక్కకు మిక్కిలి నైవేద్యాలు అందుకుంటూ రాత్రి ఏకాంతసేవలో ముత్యాల హారతితో హాయిగా విశ్రమిస్తారు. ఆ సేవలన్నింటినీ ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.

## సుప్రభాతసేవ

చారిత్రక ఆధారాలను బట్టి ప్రస్తుతం అమలులో ఉన్న సుప్రభాత సేవావిధానం 15వ శతాబ్దిలో ప్రారంభమైనట్లు తెలుస్తోంది. అంతకుముందు ఈ సేవ ఎలా జరిగేదో తెలిపే ఆధారాలు లభ్యం కాలేదు. ఐతే స్వామివారికి మేలుకొలుపులు పాడే సంప్రదాయం మాత్రం ఎప్పటినుండో ఉంది.

తరతరాలుగా, హైందవజాతిలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని జాగృతం చేస్తున్న మహత్తర స్తవం "శ్రీవేంకటేశ్వర సుప్రభాతం". నేటికీ లక్షలాది దేశ విదేశాలలో ఉన్న తెలుగువారి ఇండ్లలో దినచర్య, నిత్యపూజ, సుప్రభాత పఠనంతోనే ఆరంభమవుతాయి. ప్రాతః సంధ్య వేళ ఈ సుప్రభాత గానం వినగానే, భగవద్ధ్యానంలో తాదాత్మ్యం చెంది, మనం పొందే అలౌకిక, ఆధ్యాత్మిక అనుభూతి వర్ణనాతీతం.

కలియుగంలో కూడా, త్రేతాయుగపు శ్రీరామునివలెనే "కౌసల్యా సుప్రజా రామా" అంటూ మేలుకొలుపు పాడించుకోవడం ద్వారా తాను సాక్షాత్తూ శ్రీరామచంద్రుని మరో అవతారమని స్వామి లోకాలకు చాటుతున్నారు. అలాగే శ్రీవేంకటేశ్వరసుప్రభాతంలోద్వాపరయుగపు శ్రీకృష్ణుని ప్రస్తావన మరియు ప్రత్యేకపు పూర్వయుగాల్లో శ్రీమహావిష్ణువు యొక్క

అనేక అవతారాల వర్ణన కూడా కానవస్తుంది. 29 శ్లోకాలున్న సుప్రభాతాన్ని, 11 శ్లోకాలున్న స్తోత్రాన్ని (కమలాకుచ చూచుక కుంకుమతో...), 16 శ్లోకాలున్న ప్రపత్తినీ (ఈశానాం జగతో...), 14 శ్లోకాలున్న మంగళా శాసనాన్నీ (శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే...), 15వ శతాబ్దంలో మనవాళ మహాముని శిష్యుడైన "ప్రతివాద భయంకర అణ్ణన్ స్వామి" రచించారు. వారి అసలు పేరు హస్తగిరినాథన్. ఇంతటి మహత్తరమైన స్తోత్ర రత్నావళిని అందించిన వీరు శ్రీవారి భక్తులందరికీ ప్రాతః స్మరణీయులు.

ప్రతిరోజూ బ్రాహ్మీ ముహూర్త కాలంలో (తెల్లవారు ఝామున 2.30 – 3.00 గంటల మధ్య) సుప్రభాత సేవ జరుగుతుంది. ఆ సమయంలో సన్నిధి గొల్ల తిరునామం ధరించి, దివిటీ చేబూని ఉత్తర మాడవీధిలోని అర్చకుల ఇంటికి వెళ్ళి, వారికి నమస్కరించి, సాదరంగా వారిని ఆలయానికి ఆహ్వానిస్తాడు. అప్పటికే పవిత్రస్నానం, ఊర్ధ్వపుండ్రధారణ (తిరునామాలు), అనుష్ఠానాదులు ముగించి సిద్ధంగా ఉన్న అర్చక స్వాములు శ్రీవారి బంగారు వాకిలిని తెరిచే 'కుంచెకోల' అనబడే పరికరాన్ని భుజంపై పెట్టుకుని, తాళం చెవుల గుత్తితో, సన్నిధి గొల్లను అనుసరిస్తూ ఆలయానికి విచ్చేస్తారు.

ఇలా అర్చక స్వాములు మహాద్వారం వద్దకు చేరగానే మహాద్వారానికి లోపల, ఉత్తర దిక్కున ఉన్న నగారా మండపంలో పెద్ద పలకగంటను మ్రోగిస్తారు. 1960 ల్లో, ఈ గంట దేవాలయానికి ఎదురుగా ఉన్న వేయికాళ్ళ మంటపం పైకప్పుకు వ్రేలాడుతుండేది. మాడవీధుల విస్తరణలో భాగంగా, ఈమధ్య కాలంలో ఆ మంటపం కూల్చివేయబడింది.

సన్నిధి గొల్లననుసరిస్తూ వస్తున్న అర్చకులు ప్రధాన ద్వార దేవతలకు (శంఖనిధి–పద్మనిధి) మంత్రపూర్వక ప్రణామాలర్పిస్తూ ఆలయ ప్రవేశం చేస్తారు. వారివద్ద ఉన్న కుంచెకోలనూ, తాళంచెవుల గుత్తినీ ధ్వజస్తంభ మండపంలో ఈశాన్య దిక్కున ఉన్న క్షేత్రపాలక శిలకు తాకించి, భక్తితో నమస్కరించి, ధ్వజస్తంభానికి ప్రదక్షిణగా వెండి వాకిలిని దాటి బంగారు వాకిలి ముందు మౌనంగా స్వామివారిని ధ్యానం చేస్తుంటారు.

అర్చక స్వాములను అక్కడ వదిలి, సన్నిధి గొల్ల మరల సన్నిధి వీధిలోని బేడి ఆంజనేయస్వామి గుడి వద్దనున్న శ్రీమాన్ పెద్ద జియ్యంగార్ మఠానికి వెళ్ళి, జియ్యంగారినీ లేదా వారి పరిచారకుడైన ఏకాంగినీ ఆలయంలోని బంగారు వాకిలి ముంగిటకు తోడ్కొని వెళ్తాడు.

ఆ సమయానికి అర్చకులతో పాటుగా ఆలయ అధికారులు, శ్రీవారి సుప్రభాతాన్ని పఠించే వేదపండితులు బంగారు వాకిలి ముందు వేచి ఉంటారు. అలాగే అన్నమయ్య వంశీయులొకరు తుంబుర ధరించి మేలుకొలుపు సంకీర్తన పాడటానికి సిద్ధంగా ఉంటారు. వీరందరితో పాటు ఇంద్ర, వరుణ, బ్రహ్మాది దేవతలు, శివపరివారము, సనక సనందనాదులు, సప్త ఋషులు, అష్టదిక్పాలకులు, నారదాది మహర్షులు, గంధర్వ, యక్ష, కిన్నెర, కింపురుషులు, గరుత్మంతుడు, ఆదిశేషువు మున్నగు వారందరూ పుష్కరిణిలో పవిత్ర స్నానమాచరించి అదృశ్య రూపంలో స్వామివారి సుప్రభాతానంతర దర్శనార్థం వేచియుంటారని ప్రసిద్ధి.

అర్చకులు, జియ్యంగార్ లేదా వారి పరిచారకుడైన ఏకాంగి, ఆలయ అధికారులు, వేదపండితులు, తాళ్ళపాక వంశీయులు, సన్నిధిగొల్ల సుప్రభాతసేవ, ఆర్జితసేవకు విచ్చేసిన భక్తులు వీరందరి సమక్షంలో, అర్చకులు కుంచెకోలతో బంగారు వాకిలికి ఉన్న చిన్న రంధ్రం ద్వారా లోపల వేసి యున్న గడియను తీస్తారు. తరువాత అందరి సమక్షంలో తాళం చెవులకు, తాళాలకు రాత్రి వేసిన సీళ్ళను పరిశీలించి తాళాలు తెరుస్తారు. తాళం చెవులను ఆలయ ధర్మకర్తలుగా వ్యవహరించే – అర్చకులు, జియ్యంగార్లు, ఆలయ అధికార్లు – ఈ ముగ్గురి వద్ద సీళ్ళు వేసి ఉన్న పెట్టెలలో భద్రపరిచే సంక్లిష్టమైన మరియు సురక్షితమైన వ్యవస్థ ఏనాటినుంచో అమలులో ఉంది. ఆ విధి విధానాలను ఈనాటికీ పొల్లు పోకుండా పాటిస్తారు. ఆనందనిలయుని అంతులేని సంపదకు ఆమాత్రం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు ఉండాల్సిందే మరి.

తదనంతరం బంగారు వాకిలి తెరుచుకుని సన్నిధి గొల్ల దివిటీతో ముందుగా లోనికి ప్రవేశిస్తాడు. మరుక్షణం అర్చకులు కూడా సుమధుర స్వరంతో 'కౌసల్యా సుప్రజారామా' అంటూ వీనులవిందుగా ఆలపిస్తూ బంగారు వాకిలి లోనికి ప్రవేశిస్తారు. ఏకాంగి మహంతు మఠం వారు తెచ్చిన పాలు, చక్కెర, వెన్న, తాంబూలం గల బంగారు పళ్ళెరాన్ని అందుకుని లోనికి వెళ్ళిన వెంటనే బంగారు వాకిలి మూయబడుతుంది. బంగారు వాకిలి ముందు వేచియున్న పండితులు, అర్చకులు ప్రారంభించిన సుప్రభాత గీతాన్ని అందుకుని వీనులవిందుగా వినిపిస్తారు. తరువాత అన్నమయ్య వంశీయులు బంగారు వాకిలి ముందు నిలబడి మేలుకొలుపు కీర్తనను భూపాలరాగంలో ఆలపిస్తారు. సుప్రభాత సేవకు విచ్చేసిన భక్తులు శ్రవణపేయంగా, రాగయుక్తంగా ఆలపింపబడుతున్న సుప్రభాతాన్ని వింటూ భక్తిపారవశ్యంలో మైమరచిపోతారు. సుప్రభాత సేవలో పాల్గొనే భక్తులకు దాదాపు 20–25 నిముషాల పాటు బంగారు వాకిలికి ఎదురుగా అత్యంత సమీపంలో వేచియుండి, వీనుల విందైన సుప్రభాత గానాన్ని ప్రత్యక్షంగా ఆలకిస్తూ, అందులో స్వరం కలుపుతూ, బంగారు వాకిళ్ళను శాస్త్రోక్తంగా తెరిచే విస్తారమైన ప్రక్రియను ప్రత్యక్షంగా తిలకించుకునే మహత్తర భాగ్యం దక్కుతుంది. ఈ సేవ కోసం ఏళ్ళ తరబడి వేచియుండే

భక్తులెందరో ఉంటారు.

బంగారు వాకిళ్ళను దగ్గరగా మూసిన సన్నిధి గొల్ల వద్దనున్న దివిటీ వెలుగులో, అర్చకులు రాములవారి మేడకు (బంగారు వాకిలిని దాటిన వెంటనే వచ్చే మంటపం) వేసివున్న తలుపుల తాళాలను తీసి, శయన మండపంలో పానుపుపై శయనించి వున్న భోగశ్రీనివాసునికి ప్రదక్షిణగా శ్రీవారి సన్నిధికి చేరుకుంటారు. వైఖానస అర్చకులు, జియ్యంగార్లు వెంట రాగా దివిటీతో ముందుగా లోనికి వెళ్ళిన సన్నిధిగొల్ల, కులశేఖరపడి (ఏడు ద్వారాల్లో చిట్టచివరిది, అంటే స్వామివారికి అత్యంత సమీపంలో ఉండేది) వద్ద నిలచి, ఆ వెలుగులో శ్రీవారి దివ్యమంగళ తొలి దర్శనం చేసుకుంటాడు. ఓ గొల్లవానికి తొలి దర్శనమా? ఆశ్రిత పక్షపాతియైన స్వామివారి అనుగ్రహానికి హద్దులుండవు మరి!

సన్నిధిగొల్ల చేతిలోని దివిటీ నందుకుని 'ఏకాంగి' దేవుని సన్నిధిలోని దీపాలు వెలిగించగా, సన్నిధిగొల్ల రాములవారి మేడలోని దీపాలను వెలిగిస్తాడు. అనంతరం అర్చకులు శ్రీవారికి నమస్కారం చేసి, శయన మండపంలో బంగారు పట్టుపరుపుపై శయనించి ఉన్న భోగశ్రీనివాసమూర్తిని సమీపించి, నమస్కరించి చప్పట్లు చరిచి, మేల్కొనవలసిందిగా ప్రార్థిస్తారు. తరువాత భోగశ్రీనివాసమూర్తి విగ్రహాన్ని మూలమూర్తి సన్నిధిలో (జీవస్థానంలో) వేంచేపు చేస్తారు.

ఆనందనిలయంలో కులశేఖరపడి వద్ద తెరవేసి, అర్చకులు శ్రీవారి దంతధావన, ఆచమనాది ప్రక్రియలు గావించి మహంతు మఠం వారు తెచ్చిన నవనీతం, పాలు, చక్కెరను నివేదన చేసి సుగంధ తాంబూలాన్ని సమర్పిస్తారు. బంగారు వాకిలి ముంగిట్లో వేదపండితులు సుప్రభాతం, మంగళాశాసనాన్ని ముగిస్తూ ఉండగా, లోపల అర్చకులు శ్రీవారికి నవనీత హారతి ఇస్తున్నప్పుడు బంగారు వాకిళ్ళు తెరువబడతాయి.

**(ఇంకా ఉంది)**

# రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.

ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుచుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

## రచనలు పంపవలసిన చిరునామా

**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com



## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథ యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము.**
**(హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)**

**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు సాధారణ పరిస్థితులు ఉన్నవి. శుభకార్యములు నెరవేరును. బంధుమిత్రుల కలయిక. ఇష్టకార్యసిద్ధి కలిగి ఉన్నారు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకొనగలరు. శ్రీవేంకటేశ్వర స్వామి అలంకరణ దర్శనం చేయండి. చక్కెర పొంగలి ప్రసాదములు.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు విందు వినోదములు, ఆర్థికముగా బాగుంటుంది. మీరు పొగడ్తలకు పొంగిపోరాదు. ప్రమోషన్ ఉంటుంది. చాలా నెమ్మదిగా చాకచక్యంగా మసలుకోవాలి. ఏ పరిస్థితులలో తొందరపడి మాట్లాడరాదు. లక్ష్మీనారాయణ పూజలు చేయండి.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు వ్యాపారస్తులకు చట్టపరమైన సమస్యలు ఉండగలవు. ఆందోళన వలన అనారోగ్యము కాచుకొని ఉంది. ప్రశాంతంగా, నిబ్బరంగా ఉండండి. ఎంత పెద్ద సమస్యల అయినా ఇట్టే పరిష్కారమవుతుంది. నవగ్రహ జపదానాలు ప్రదక్షిణలు చేయండి.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సుబ్రహ్మణ్యేశ్వరుని అనుగ్రహం కొరకు పూజలు. అనారోగ్య సమస్యలు. ఆయుర్వేద వైద్యం, భూములు కొనుట వలన అధిక ఆదాయం ఉంటుంది. చాలా జాగ్రత్తలు తీసుకొనగలరు. స్నేహితుల విషయంలో ఇచ్చిపుచ్చుకొను విధానంలో జాగ్రత్తగా ఉండాలి. మహన్యాస రుద్రాభిషేకం చేయండి.

## సింహరాశి

**మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు భార్యాభర్తల అనురాగముగా ఉండలరు. ఆకస్మికముగా నూతన స్నేహములు, తీర్థయాత్రలు, విందువినోదములు ఆర్భాటపు ఖర్చులు హుందాతనమునకు అధిక ధన వ్యయము చేయగలరు. ఇష్ట దేవతల ఆరాధన శాంతినిస్తుంది.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. ఆదాయ వనరులకొరకు ప్రయత్నములు ఫలించగలవు. మీ ఆధిపత్యంనకు అవకాశాలు కలిగి ఉన్నారు. ఉన్నత ఆశయాల యందు శ్రద్ధ ఉంచండి. లోక కళ్యాణమునకు, ఆరాధనలకు అనుకూలమైన రోజులు. దైవకళ్యాణమునకు అనుకూలంగా ఉండండి.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రతి విషయంలో వ్యతిరేకత కలిగి ఉన్నారు. అనారోగ్య సమస్యలు ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఉండగలవు. అఖండ దీపారాధన, కుసుమ నూనెతో దీపారాధన అమ్మవారి పూజలు ధైర్యాన్ని ఇవ్వగలవు. నవగ్రహ జపదానాలు ఇవ్వండి.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. సంతానయోగం ఉన్నది. పారిశ్రామిక రంగంలో అనుకూలత ఉన్నది. సామరస్య ధోరణితో మీకు ఫలితము. సమయ పాలన గురించి తెలుసుకొని ఆచరించండి. నవగ్రహ జప దానములు ఆచరించండి.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ పురుషులకు శుభకార్యములు. ఏ విషయంలో ఏదో తెలియని విధంగా వాయిదా పడుటకు అవకాశము. ధనధాన్యాలకు లోటు ఉండదు. చాలా అనుకూలమైన రోజులుగానే ఉంటుంది కాని ముందుచూపుతో ఆలోచన చేయండి.

## మకరరాశి

**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ట 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు ఆశాజనకంగా ఉంటుంది. మీరు జాగ్రత్తలు పాటిస్తున్నారు కనుక ఇబ్బందులు వస్తాయని భయపడవలసిన పనిలేదు. సమర్థవంతంగా ముందుకు సాగండి. వివాహ ప్రయత్నములు చేయండి. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నవగ్రహ ప్రదక్షిణలు చేయండి.

## కుంభరాశి

**ధనిష్ట 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. వివాహ ప్రయత్నములకు అనుకూలమైన రోజులు. మీ ప్రయత్నములో లోపం లేకుండా చూసుకొనిన శుభకార్యములు నిర్విఘ్నంగా జరుగును. వాయిదా వేయుటకు ఉన్నది పట్టుదలగా ముందుకు సాగండి. సూర్యదేవుని ఆరాధన చేయండి.

## మీనరాశి

**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలమైన కాలం. ప్రతి విషయంలో అనుకూలత. విందు వినోదములు. బంధుమిత్రుల కలయిక, అకాల భోజనము.అందరి మన్ననలు పొందగలరు. అందరిని సంతృప్తి పరచగలరు. శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామి వారి వ్రతం చేయండి.

# మీ విజ్ఞానం

నిర్వహణ: **డా.పి. లలితవాణి**




**శ్రీ వేంకటేశం**
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సిగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com

**ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.**

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. ఏకాదశి కన్య ఎవరిని చంపింది?
2. ప్రహ్లాదుని నుండి శీల సంపదను పొందింది ఎవరు?
3. ఉపకోశలుడికి బ్రహ్మోపదేశం చేసిందెవరు?
4. గోదాదేవి చేసిన వ్రతమేది?
5. హరిదాసులు వచ్చుటెప్పుడు?
6. రాధగా జన్మించిందెవరు?
7. కృష్ణుడు ఎవరికి సుందర రూపాన్నిచ్చాడు?
8. జయదేవుని భార్య ఎవరు?
9. ఆదిశేషుని తోకభాగం ఏ క్షేత్రం?
10. శ్రీశైలంలో శివుడు వెలియడానికి కారకుడు ఎవరు?
11. మార్గశిర – పుష్యమాసాల మధ్యలో వచ్చేది ఏది?
12. విష్ణుచిత్తుడు ఎవరి అవతారం?
13. బియ్యానికి అధిదేవత ఎవరు?
14. శాపవశాత్తు మహిషిగా మారిందెవరు?
15. అయ్యప్పస్వామి మహిషిని ఏ నదీ తీరంలో సంహరించాడు?

1. ____________________
2. ____________________
3. ____________________
4. ____________________
5. ____________________
6. ____________________
7. ____________________
8. ____________________
9. ____________________
10. ____________________
11. ____________________
12. ____________________
13. ____________________
14. ____________________
15. ____________________

### గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. ధర్మ్యామతం, 2. 14 జన్మలు, 3. గరుడుడు, 4. వ్రతం, 5. సరయూ నదిలో, 6. మహర్షు లు, 7. అరిష్టనేమి (ప్రజాపతి), 8. గోదాదేవి, 9. గోవిందుని వక్షస్థలం నుండి, 10. శక్తి, 11. మార్గశిర శుద్ధ త్రయోదశి నాడు, 12. పులస్త్యుడు, 13. వరాంగి, వజ్రాంగుడు, 14. యముని అంశతో 15. 'కనక భండి'

పేరు: ____________________

చిరునామా: ____________________

____________________

____________________

____________________

పిన్‌కోడ్: ____________________

ఫోన్: ____________________

### సరైన సమాధానాలు రాసినవారు

1. ఎస్ ధర్మారావు
2. డి.ఇందిర
3. పి.సురేఖ

### లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

**ఎస్.ధర్మారావు**



Postel Registration No:
HSE/879/2025-2027

Published on 28th and Licenced to
Post On 29th & 30th of Every Month

RNI No.:
APTEL/2008/23122





If Un Delivered Please Return to:

**SRI VENKATESHAM,**

(Sri Venkateshwara Maha Mantra Peetham)

H.No: 1-1-53, Street No. 1, Habsiguda,
Hyderabad-500007.Ph: 040-27175050.


డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు
https://www.srivenkatesham.org లో చదవండి.

Srivenkatesham Magazine in Google Drive
https://drive.google.com/drive/folders/
1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq